
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
శుక్రవారం 23, మే 2025


అపార్టుమెంట్‌కు ట్యాంకర్ నీరు

నగర కార్పొరేషన్‌లో జలగలు పడ్డాయి. ఇవి మామూలు జలగలు కాదు. పేదలకు అందాల్సిన తాగునీటిని 'పెద్దల'కు అమ్మి సొమ్ము చేసుకునే రాకాసి జలగలు. శివారు ప్రాంతాల్లో దాహం తీర్చాల్సిన కార్పొరేషన్ ట్యాంకర్లను పక్కదారి పట్టించి పచ్చనోట్లు మింగేసే ఆ జలగలే కాంట్రాక్టర్లు. వీరికి సిబ్బంది తమ వంతు సహకారం అందిస్తున్నారు. అంతా కలిసి తాగునీటి ట్యాంకర్లను హోటళ్లకూ, అపార్టుమెంట్లకూ, భవన నిర్మాణాలకూ అమ్మి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నెలకు రూ.5 లక్షలకుపైనే దోచేసుకుంటున్నారు. కార్పొరేషన్ లెక్కల్లో మాత్రం శివారు కాలనీలకు సరఫరా చేస్తున్నట్టు రాసేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. శివారు కాలనీవాసులు మాత్రం తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు.


భవన నిర్మాణానికి పైపు ద్వారా నీటిని పంపుతున్న కార్పొరేషన్ ట్యాంకర్

కార్పొరేషన్‌లో జలగలు!

అపార్టుమెంట్లు, హోటళ్లు, నిర్మాణాలకు తాగునీరు అమ్మకం

- ఒక్కొక్క ట్యాంకర్ నీరు రూ.600
- నెలకు రూ.5లక్షలకుపైనే దోపిడీ
- రికార్డుల్లో శివారు కాలనీల పేర్లు
- వాస్తవంలో అక్రమంగా విక్రయం
- కాంట్రాక్టర్లు, సిబ్బంది కలిసి నిర్వాకం
- రాజకీయ పెద్దల పేరు చెప్పి దందా
- పట్టించుకోని కార్పొరేషన్ ఇంజనీర్లు
- పేదల ఆవాసాల్లో నీటి తిప్పలు తీవ్రం

నెలకు రూ.5లక్షల పైనే దోపిడీ



నగరపాలక సంస్థ ద్వారా 50కిపైగా శివారు కాలనీలకు రోజూ 45 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. ఒక్కో ట్రిప్‌నకు కార్పొరేషన్ రూ.356 చెల్లిస్తోంది. 40 రోజులకు ఒక టెండర్ పిలిచి 9వేల ట్రిప్పులు తాగునీరు సరఫరా చేయాలన్నది నిబంధన. ఒక్కో కాలనీకి నాలుగు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తుండటంతో ప్రజలు వాటినే పొదుపుగా వినియోగించుకుంటున్నారు. అయితే ఫిల్టర్ బెడ్ సిబ్బంది, ట్యాంకర్ డ్రైవర్లు, కొందరు కాంట్రాక్టర్లు ఏకమై కాలనీ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు చేసి... వాటిని అపార్ట్‌మెంట్‌లు, భవన నిర్మాణాలు, హోటళ్లకు అమ్ముకుంటున్నారు. ఒక్కొక్క ట్యాంకర్ రూ.500 నుంచి రూ.600 విక్రయిస్తున్నారు. ఒకవైపు కార్పొరేషన్ నుంచి ఒక్కో ట్రిప్‌నకు రూ.356 రికార్డుల్లో నమోదు కావడం, మరోవైపు ప్రైవేటుగా ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్ముకుని డబ్బులు దండుకోవడం మంచి లాభసాటి బేరంగా మారింది. ఇలా సుమారుగా నెలకు 840కిపైగా ట్రిప్పులు దారి మళ్లించి అక్రమంగా సంపాదిస్తున్నారు. పేదల తాగునీటిని అమ్మి నెలకు దాదాపు రూ.5లక్షల వరకు సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం.

ఒంగోలు, కార్పొరేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పైపులైన్లు లేని ప్రాంతాలకూ, శివారు కాలనీలకూ నగర పాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తోంది. వీటి కోసం కార్పొరేషన్ జనరల్ ఫండ్ కేటాయించింది. ఈ ట్యాంకర్లను శివారు కాలనీలకు సరఫరా చేయాలి. కొందరు కాంట్రాక్టర్లు, సిబ్బంది కుమ్మక్కై, తాగునీటి పేరుతో వేల రూపాయలు దోచేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్యాంకర్లు పలు అపార్ట్‌మెంట్‌లు, హోటళ్లకు తరలిస్తున్నారు. రికార్డులో శివారు కాలనీల పేరు రాసి నీటిని అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు.

అక్రమం ఇలా..

- నగరంలోని జీజీహెచ్ సమీపంలో అతి పెద్దదైన ఓ అపార్ట్‌మెంట్‌కు రోజూ 11 నుంచి 14 ట్రిప్‌లు తరలిస్తున్నారు. అందులో రాజకీయ పెద్దలు నివాసం ఉండటంతో వారి పేరు చెప్పుకుని ఓ కాంట్రాక్టర్ నీటి దోపిడీకి పాల్పడుతున్నారు. ఆ అపార్ట్‌మెంట్‌లో నివసించే ప్రజాప్రతినిధి పేరు చెప్పి అధికారులపై ఒత్తిడి తెచ్చి విచ్చలవిడిగా నీటి అక్రమానికి తెగబడతుతున్నారు.
- నగరంలోని దాదాపు ఇరవై అపార్ట్‌మెంట్‌లకు ఇదే తరహాలో రోజూ

మిగతా 6లో...


మార్కాపురంలో శోభాయాత్ర



నమో ఆంజనేయ

జిల్లావ్యాప్తంగా గురువారం హనుమజ్జయంతి పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామాల మొదలు పట్టణాల వరకు ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాల్లో విశేష అర్చనలు జరిగాయి. స్వామివారికి ఎంతో ఇష్టమైన సిందూరంతో ఆయా దేవాలయాల్లో పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచే పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్ని దేవాలయాల వద్ద భారీఎత్తున అన్నదానాలు నిర్వహించారు. మార్కాపురంలో హనుమాన్ శోభాయాత్ర కనులపండువగా జరిగింది.

-ఒంగోలు కల్చరల్

తాగునీటి కోసం సాగర్ నీరు విడుదల

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేసినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. చెరువులు నింపుకునేందుకు కేఆర్ఎంబీ ద్వారా నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సాగర్ నీటితో చెరువులను నింపుతామన్నారు. ప్రస్తుతం విడుదల చేసిన నీటిని తాగునీటికే వాడుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. మూడేళ్ల తర్వాత సాగర్ ఆయకట్టుకు సాగునీటిని పుష్కలంగా అందించగలిగామని తెలిపారు.

పార్టీపరంగా జిల్లాస్థాయిలో అత్యంత ప్రధానమైన మహానాడును తెలుగుదేశం పార్టీ శుక్రవారం నిర్వహిస్తోంది. నియోజకవర్గ, జిల్లా పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రజల తక్షణ సమస్యలు, పథకాల అమలుపై చర్చించి సమీక్షిస్తారు. రాష్ట్రస్థాయిలో మహానాడు దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కారం జరిగేలా చూడాలి. ఈ క్రమంలోనే ఈనెల 19 నుంచి 22 వరకు జరిగిన నియోజకవర్గ స్థాయి మహానాడులు పూర్తిగా ఆయా ఎమ్మెల్యేలు లేదా ఇన్‌చార్జిల సారథ్యంలో జరిగాయి. వాటి కొనసాగింపుగా ఒంగోలులో టీడీపీ జిల్లా మహానాడు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ నేతృత్వంలో నగర శివారులోని బృందావనం కల్యాణ మండపంలో సాయంత్రం మూడు గంటలకు జిల్లా మహానాడు నిర్వహించనున్నారు.

- ఒంగోలు (ఆంధ్రజ్యోతి)

హామీల అమలు.. జిల్లా అభివృద్ధి.. సమస్యల పరిష్కారం



- ఇవే కీలక అంశాలు కావాలి
- నేడు ఒంగోలులో టీడీపీ జిల్లా మహానాడు
- హాజరుకానున్న మంత్రులు ఆనం, డాక్టర్ స్వామి, ఇతర జిల్లా ప్రజాప్రతినిధులు
- ముగిసిన నియోజకవర్గ మినీ మహానాడులు
- ఉత్సాహంగా పాల్గొననున్న శ్రేణులు
- స్థానిక అంశాలపై చర్చ

కీలక బాధ్యులంతా హాజరు

మొదట్లో జిల్లాస్థాయి మహానాడు రెండు రోజులపాటు జరిగేది. తర్వాత కాలంలో ఒక రోజుకు పరిమితం కాగా ఈసారి ఒకపూట కొద్దిగంటల పాటు నిర్వహిస్తున్నారు. పార్టీవర్గాల సమాచారం ప్రకారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామితోపాటు జిల్లాకు చెందిన టీడీపీ కీలక ప్రజాప్రతినిధులు అతిథులుగా పాల్గొని ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకులు, జిల్లా నుంచి రాష్ట్ర పార్టీలో, ప్రభుత్వంలో కీలక బాధ్యతలలో ఉండే వారంతా హాజరుకానున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉన్న నేపథ్యంలో సహజంగానే శ్రేణులు జోష్‌తో ఉండగా ఆ ప్రభావం నియోజకవర్గ మినీ మహానాడులో కనిపించింది. శుక్రవారం జరగనున్న

మిగతా 6లో...

హెచ్‌ఎంల బదిలీ దరఖాస్తు గడువు పూర్తి

- వచ్చిన వాటిలో అనేక తప్పులు
- తలలు పట్టుకుంటున్న అధికారులు

ఒంగోలు విద్య, మే 22(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీ దరఖాస్తుల్లో తప్పులు దొర్లడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. బదిలీల దరఖాస్తుల సమర్పణకు గురువారం రాత్రి 11.59 గంటలకు గడువు ముగియనుంది. తప్పులతడకలతో తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్య కమిషనర్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బదిలీలకు హెచ్‌ఎంలు బుధ, గురువారాల్లోనే వివరాలు సమర్పించాలి. అయితే బుధవారం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత మాత్రమే దరఖాస్తు ఆన్‌లైన్‌లో ఓపెనైంది. గురువారం సాయంత్రానికి కూడా దరఖాస్తులో తప్పులు సరిచేయకపోవడంతో హెచ్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు. ఒక స్థానంలో రెండేళ్లు పూర్తయినవారు బదిలీకి దరఖాస్తు చేసుకుంటే అందులో తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ అని వస్తుండటంతో కొందరు అప్లై చేసేందుకు భయపడుతున్నారు. తప్పనిసరి బదిలీ అని ఉన్నందున తమ స్థానాలు ఖాళీగా చూపిస్తారేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. కొందరికి పాయింట్లు రాకపోవడంతో వారు కూడా టెన్షన్‌కు గురవుతున్నారు. 2023 నుంచి కొత్త స్థానాల్లో చేరిన వారికి స్టేషన్ పాయింట్లు నమోదు కావడం లేదు. బుధవారం నుంచి ఈ పరిస్థితి ఉన్నా దానిని సరిచేసి హెచ్‌ఎంలు ధైర్యంగా దరఖాస్తు చేసుకునేందుకు భరోసా ఇవ్వాల్సిన అధికారులు వారి గురించి పట్టించుకోవడం లేదు.

110 ఖాళీలు

ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఎంల బదిలీలకు 110 ఖాళీలు చూపించారు. వీటిలో జడ్పీ యాజమాన్యంలో 92, ప్రభుత్వ, మునిసిపల్ యాజమాన్యంలో 9 ఖాళీలు ప్రదర్శించారు. మొత్తం 12 మంది హెచ్‌ఎంలకు ప్రస్తుతం వారు పనిచేస్తున్న స్థానాల్లో ఐదేళ్లు పూర్తి కావడంతో వారు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. మరో రెండు పాఠశాలలు ముటుకుల, వైపాలెం జడ్పీ హైస్కూలు విద్యార్థుల సంఖ్య తగ్గడంతో అక్కడ హెచ్‌ఎం పోస్టులు పోయాయి. దీంతో ఆ రెండు పాఠశాలల హెచ్‌ఎంలు కూడా బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. తప్పనిసరిగా కావాల్సిన వారంతా దరఖాస్తు చేయించమని కమిషనర్ ఆదేశించారు. వారు దరఖాస్తు చేసుకోకపోతే బదిలీల కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగిలిన స్థానాల్లో వారికి నియామక ఉత్తర్వులు ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బత్తాయి.. పడిపోయి..!

- రైతును చిత్తు చేసిన చిత్త కాపు
- తెగుళ్ల విజృంభణతో పడిపోయిన దిగుబడి
- టన్ను ధర రూ.18వేల లోపే
- వేసవిలో పంటకు డిమాండ్ ఎక్కువ..
- ప్రస్తుతం భిన్న పరిస్థితులతో రైతుల ఆందోళన

7



వీరయ్య చౌదరి హత్య కేసులో సూత్రధారి కోసం గాలింపు

- సురేష్ పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- అదుపులో ఇద్దరు నిందితులు

ఒంగోలుక్రైం, మే22 (ఆంధ్రజ్యోతి): వీరయ్య చౌదరి కేసులో కీలక సూత్రధారి కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. పరారీలో ఉన్న నిందితుడు ముప్పా సురేష్ విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్టు స్వాధీనం చేసుకున్నారు. అతను పరారు కావడంపై ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఈ విషయంలో కొందరు పోలీసుల పాత్రపైన కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అదేక్రమంలో హత్యలో పాత్రధారి అయిన నిందితుడు ఓబిలి నాగరాజు, కిరాతక ముఠాను నెల్లూరు నుంచి ఒంగోలుకు పంపిన నానీని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇంకా ఈ కేసులో పాత్రధారులు ఎవరు ఉన్నారనే కోణంలో లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం.

కుంట భూమి ఆక్రమణ


ఆక్రమిత భూమిలో పంట సాగు

రూ.కోట్ల భూమిపై కన్నేసిన కబ్జాదారులు

- సచివాలయానికి వెళ్లేందుకు దారిలేకుండా దౌర్జన్యం
- ప్రభుత్వ భూమిలో కాలువ తవ్వకం
- అక్రమంగా దున్ని పంట సాగు
- తెలిసినా పట్టించుకోని అధికారులు

పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆగడం లేదు. పట్టణానికి సమీపంలోని రూ.కోట్ల విలువైన భూమిని ఆక్రమించేస్తున్నారు. అధికారుల ఆదేశాలను సైతం లెక్క చేయకుండా భూముల్లో పంటలు చేయడం విడ్డూరంగా ఉంది.

పొదిలి, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి కూత వేటు దూరంలో కంభాలపాడు గ్రామ సర్వే నెంబర్ 45-1 లో 2.11ఎకరాలు కుంట భూమి ఉంది. అందులో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గ్రామ వార్డు సచివాలయంతో పాటు పలురకాల కార్యాలయాలు నిర్మించేందుకు ఎకరం పొలాన్ని కేటాయించారు. సచివాలయం, హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. కంభాలపాడు సచివాలయానికి కేటాయించిన స్థలం పోను మిగిలిన 1.11 ఎకరాల భూమిని గత ఏడాది మార్చి 14వ తేదీన వైసీపీ హయాంలో కొందరు ఆక్రమించారు. ఈ పొలం పక్కనే ఉన్న పొలం యజమాని ఆ భూమి తనదంటూ సచివాలయానికి వెళ్లడానికి వీలులేకుండా ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీశారు. విషయం తెలుసుకున్న నగరపంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆక్రమిత స్థలాన్ని అదేరోజు పరిశీలించారు. ఆ తరువాత చర్యలు తీసుకోకపోవడంతో ఏకంగా పొలాన్ని దున్ని కంది పంటను సాగుచేశారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా.. పంటకాలం పూర్తి అయిన తరువాత సర్వే చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంట ఇంటికి వచ్చి కూడా రెండు నెలలు అయింది. అయినా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ భూమి ఒంగోలు - నంద్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఉంది. కోట్ల రూపాయలకు విలువ చేస్తోంది. తహసీల్దార్‌ను వివరణ కోరగా.. సర్వే చేసి నగరపంచాయతీకి నివేదికను అందిస్తామని చెప్పారు. దీనిపై కంభాలపాడు కార్యదర్శి శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. రెవెన్యూ అధికారులు సర్వేచేసి నివేదిక ఇచ్చారని, దాని ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇటీవల కొత్తగా వచ్చిన నగరపంచాయతీ కమిషనర్‌తో కలిసి పరిశీలించామని త్వరలో పోలీసుల అనుమతితో ఆక్రణను తొలగిస్తామని స్పష్టం చేశారు.

టీచర్ల బదిలీలకు హెల్ప్ డెస్క్

ఒంగోలు విద్య, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి సహాయం అందించేందుకు ఆరుగురు అధికారులతో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. సంతనూతలపాడు ఎంఈవో డి.వెంకారెడ్డి 7382797374, డీఈవో కార్యాలయ ఏడీ ఉదయభాస్కర్ 8919121853, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు 9848527274, చీరాల ఉపవిద్యాధికారి గంగాధరరావు 9440872946, ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు 7989866227, చినగంజాం ఎంఈవో అజయ్‌బాబు 9110775870లను హెల్ప్‌డెస్క్‌లో నియమించామన్నారు. ఉపాధ్యాయుల బదిలీల కోసం సంబంధించి సమస్యలు, సందేహాలకు వీరిని నేరుగా కానీ లేదా మొబైల్ ద్వారా కలిసి నివృత్తి చేసుకోవాలన్నారు.

● స్కూలు అసిస్టెంట్ దరఖాస్తులు ప్రారంభం

స్కూలు అసిస్టెంట్ బదిలీ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. వీరికి కూడా షెడ్యూల్‌ను బుధవారం నుంచి చేసుకోవచ్చని ప్రకటించగా గురువారం మధ్యాహ్నం 1.30 తర్వాత సైట్ ఓపెన్ అవుతుంది. సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. అయితే స్కూలు అసిస్టెంట్ బదిలీ దరఖాస్తులో స్పౌజ్ నో అని పెట్టినా ఐదు పాయింట్లు కలుస్తున్నాయి. వరుసగా రెండుసార్లు టీచర్ల పునర్విభజనకు గురైన వారికి రావాల్సిన 7 పాయింట్లు రావడం లేదని టీచర్లు చెప్తున్నారు. దరఖాస్తుల్లో తప్పులు సవరించి తమకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని టీచర్లు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మృతి

అద్దంకి, మే 22(ఆంధ్రజ్యోతి) : కుమార్తె మృతి చెందటంతో మతిస్థిమితం కోల్పోయిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన మీనాక్షి వేదవతి 8 నెలల క్రితం ఇంకొల్లులో మృతి చెందింది. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో నివాసం ఉండే ఆమె తల్లి నర్రా మహలక్ష్మమ్మ(53) మతిస్థిమితం లేకుండా ఉంటుంది. ఈ నెల 20వ తేది గుళికల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.


చినరాస్తాను డబుల్ లైన్‌గా విస్తరించాలి

● ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ మినీమహానాడులో తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్, పక్కన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గరటయ్య

చీమకుర్తి, మే22(ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు నియోజకవర్గంలోని మూడు మండలాలకు లింక్‌రోడ్‌గా ఎంతో కీలకంగా ఉన్న చినరాస్తా రహదారిని డబుల్‌రోడ్‌గా అభివృద్ధి చేయాలని గురువారం జరిగిన టీడీపీ మినీ మహానాడులో తీర్మానం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కృషితో బాటరోడ్‌గా ఉన్న చినరాస్తాను బీటీరోడ్‌గా మార్చి నిర్మాణ పనులను చేపట్టారు. ఈ రహదారిని పూర్వం రాజుల కాలంలో ఏనుగుల బాటగా పిలిచేవారు. చీమకుర్తి పట్టణం నయాగార హోటల్ వద్ద నుంచి ప్రారంభమయ్యే చినరాస్తా రహదారి సంతనూతలపాడు, మద్దిపాడు మండలాల గ్రామాలను కలుపుతూ కొష్టాలు వద్ద జాతీయ రహదారిలో కలుస్తుంది. అక్కడ నుంచి మద్దిరాలపాడు వద్ద చీరాల వైపు జాతీయ రహదారి వద్దకు పొడిగించనున్నారు. ఈ విధంగా 18కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిని అభివృద్ధి చేస్తే నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆలోచించిన విజయ్‌కుమార్ రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. దాదాపు ఆరు కిలోమీటర్ల మేర బీటీరోడ్ నిర్మాణం పూర్తయింది. తదుపరి ఎన్నికలు రావటం వైసీపీ అధికారంలోకి రావటంతో రోడ్డు నిర్మాణానికి గ్రహణం పట్టింది. తిరిగి కూటమి ప్రభుత్వం రావటంతో రోడ్డు అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. చీమకుర్తికి చెందిన టీడీపీ నాయకులు మినీ మహానాడులో ఎమ్మెల్యే బీఎన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ రహదారిని డబుల్‌రోడ్‌గా విస్తరిస్తే చీమకుర్తితో పాటు పశ్చిమ ప్రాంతం నుంచి వచ్చే వాహనాలు ఒంగోలుకు వెళ్లకుండా నేరుగా కొష్టాలు వద్ద జాతీయరహదారి ఎక్కి విజయవాడ వైపు, రాజధాని అమరావతికి సులభంగా చేరుకోవచ్చు. నియోజకవర్గానికి జీవనాడిగా ఉన్న



చీమకుర్తి మండలంలో ఉన్న చినరాస్తా రహదారి

చినరాస్తాను సత్వరమే అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన విజయ్‌కుమార్ మహానాడు తీర్మానాల్లో ఈ అంశాన్ని చేర్చి ఆమోదింపజేశారు. తదనుగుణంగా అధికారులతో చర్చించి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, కాట్రగడ్డ రమణయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, యడ్లపల్లి రామబ్రహ్మంలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

బర్లీ రైతులకు అండగా రాష్ట్రప్రభుత్వం

- రేపు మార్టూరుకు ముగ్గురు మంత్రుల రాక
- సీఎం చంద్రబాబు సమీక్ష, ఆదేశాలు
- ఫలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి కృషి

ఒంగోలు, మే 22 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సమస్యపై సమీక్ష చేసి కొన్ని ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు రైతులతో మాట్లాడి పరిష్కారానికి స్పష్టమైన మార్గాలను నిర్ణయించేందుకు ముగ్గురు మంత్రులు శనివారం మార్టూరు రానున్నారు. ఆ సందర్భంగా ఇసుక దర్శి వద్ద ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు ఆఫీసు ఆవరణలో ఏర్పాటు చేసిన రైతులతో వారు మాట్లాడతారు. నల్ల బర్లీ పొగాకు కొనుగోలు దాదాపుగా స్థంభించిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే.

సుమారు 60 వేల ఎకరాల్లో బర్లీ

రాష్ట్రంలో సుమారు 60 వేల ఎకరాల్లో నల్లబర్లీ పొగాకు పండిస్తున్నారు. అందులో రమారమీ 30 వేల ఎకరాల్లో పర్చూరు నియోజకవర్గం రైతులే సాగు చేశారు. మిగిలిన పొగాకు ప్రత్తిపాడు, చందవోలు పాడు, అద్దంకి తదితర నియోజకవర్గాలో రైతులు సాగు చేశారు. కనీసం మద్దతు ధర కూడా ఇవ్వకుండా వ్యాపారులు మొండికేయడంతో రైతులు పొగాకు విక్రయానికే వెనుకంజ వేసి రోడ్డెక్కారు. విషయాన్ని ముందుగానే పసిగట్టిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంటనే సమస్యను ప్రభ్వుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఒత్తిడితో రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ పర్చూరు నియోజకవర్గానికి వచ్చి సమస్య తీవ్రతను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. బాపట్లలో బుధవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో ఇదే అంశంపై ప్రధానంగా చర్చించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి తీర్మానం చేశారు. గురువారం ఉదయం మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే సాంబశివరావులు ఈ విషయాన్ని మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ముఖ్యమంత్రి మంత్రివర్గంతో, అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమయితే గిట్టుబాటు ధరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చర్చించారు. ఆ మేరకు వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్‌శాఖా మంత్రి రవికుమార్, సాగునీటి పారుదల శాఖా మంత్రి రామనాయుడు పర్చూరు నియోజకవర్గంకు వెళ్లి రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి అవసరమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దీంతో మంత్రులు ఎమ్మెల్యే ఏలూరితో చర్చలు జరిపారు. ఆ మేరకు శనివారం ఉదయం మంత్రుల బృందం మార్టూరు వచ్చే కార్యక్రమం ఖరారయింది. ఒక గ్రామంలోకి వెళ్లి రైతులతో మాట్లాడి పొగాకు పంటను పరిశీలిస్తారు. పొగాకు ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శిస్తారు.

ఏలూరి క్యాంపు ఆవరణలో సమావేశం

ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు ఆవరణలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో వారు పాల్గొంటారు. తదనుగుణంగా వారిచ్చే నివేదికను పరిశీలించి గిట్టుబాటు ధర కల్పించే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ప్రకటిస్తారు. తదనుగుణంగా నల్ల బర్లీ పొగాకు రైతుల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పరిష్కారమయ్యే అవకాశం కనిపిస్తుంది.

వైభవంగా శ్రీవీరాంజనేయస్వామి కల్యాణం

బొబ్బేపల్లి, రాజుగారిపాలెం మధ్య కొండపై ఘనంగా తిరునాళ్ల

మార్టూరు, మే22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బొబ్బేపల్లి, రాజుగారిపాలేల మధ్య కొండపై శ్రీవీరాంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం దేవస్థానంలో శ్రీసువర్చలా సహిత వీరాంజనేయస్వామి స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. కల్యాణం సందర్భంగా స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. ఇక సాయంత్రం ఎడ్ల ప్రదర్శన,కోలాటం ప్రదర్శించారు. ఇంకా రాత్రి పాటకచేరీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం కమిటీ చైర్మన్ దండా వీరాంజనేయులు ఆధ్వర్యంలో స్వామి వారి జయంతి మహోత్సవాలను నిర్వహించారు. మార్టూరు సీఐ ఎం శేషగిరి రావు ఆధ్వర్యంలో ఎస్ఐలు సైదా, టీ రత్నకుమారి,"మాల్యాద్రి, ఏఎస్ఐ బాషా ఇంకా దాదాపుగా 30 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



సువర్చలా సహిత వీరాంజనేయస్వామి

రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. రాజుగారిపాలెం, బొబ్బేపల్లి ద్రోణాదుల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

ట్రిపుల్ ఐటీ ఒంగోలులోనే...

మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు విద్య, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ట్రిపుల్‌ఐటీ కళాశాల ఎక్కడికీ తరలిపోవడం లేదని, ఒంగోలులోనే కొనసాగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి స్పష్టంచేశారు. గురువారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో ట్రిపుల్‌ఐటీపై సమీక్ష నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీ తరలిపోతుందని పత్రికల్లో వచ్చిన కథనాలు అభూత కల్పన అని మంత్రి తోసిపుచ్చారు. ఒంగోలులోని రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను కొనసాగించేందుకు, లీజు అగ్రిమెంట్ పొడిగించేందుకు ఆ కళాశాల యాజమాన్యం అంగీకరించకపోవడంతో ఆ క్యాంపస్‌ను మూసివేయాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందిలేదని మంత్రి చెప్పారు. ప్రస్తుతం రావ్‌అండ్ నాయుడు క్యాంపస్‌లోని ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం తరగతులకు ఎస్ఎస్ఎన్ క్యాంపస్‌కు తరలివెళ్లారన్నారు. ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి కొత్త విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో వసతి కల్పిస్తున్నామని చెప్పారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇడుపులపాయకు వెళ్తారన్నారు. అక్కడే ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం పూర్తయిన తర్వాత 2, 3, 4 సంవత్సరాలు ఇంజనీరింగ్ కోర్సుకు ఒంగోలుకు వస్తారని మంత్రి వెల్లడించారు. 2017లో ఏర్పాటైన ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సొంత భవనాలను పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక వసతి కోసం ప్రయతిస్తున్నామని చెప్పారు. స్థల సేకరణ, నిధులపై కలెక్టర్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. కొత్తభవనాలు నిర్మించే వరకు ఈ సర్దుబాటు కొనసాగుతోందన్నారు. నిధుల కోసం సీఎం, విద్యాశాఖమంత్రితో మాట్లాడతామని తెలిపారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ భాస్కర్ పటేల్, డీన్ రూపస్‌కుమార్‌లు ఉన్నారు.

పొగాకు రైతుల వివరాల సేకరణ

పర్చూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతుల వద్ద ఉన్న నిల్వలు, సాగు విస్తీర్ణం తదితర అంశాల వివరాల సేకరణలో వ్యవసాయాధికారులు ఉన్నారు. పొగాకు రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ఆదేశాలు జారీచేసింది. ఈప్రక్రియను మూడు రోజుల్లో పూర్తిచేసే విధంగా నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఆయా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నేతృత్వంలో వివరాలు సేకరించాలని పేర్కొంది. దీంతో యుద్ధప్రాతిపదికన నేరుగా అధికారులు రైతుల నివాసాల వద్దకు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే పొగాకును కొనుగోలు చేయాలి
కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం
28న పొదిలి వేలం కేంద్రాన్ని సందర్శించనున్న జగన్

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ జిల్లా కోఆర్డినేటర్ కారుమూడి వెంకటనాగేశ్వరరావు ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిందేనన్నారు. రైతుల ఇబ్బందులను తెలుసుకునేందుకు జగన్మోహన్‌రెడ్డి ఈనెల 28వ తేదీన పొదిలి వేలం కేంద్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో మార్క్‌ఫెడ్‌కు రూ.100 కోట్లు కేటాయించి పొగాకు కొనుగోళ్లు చేశామన్నారు. కనీసం రైతులు పండించిన పంటలకు కూడా గిట్టుబాటు ధరలు కల్పించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో కంది పంట దెబ్బతింటే వైసీపీ ప్రభుత్వం వెంటనే ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ధాన్యం కొనుగోళ్లు చేసిన 24 గంటల్లో రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం పక్షం రోజులు గడుస్తున్నా ఇంత వరకు డబ్బులు జమ చేయలేదన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు

ముఖ్యనాయకులతో భేటి

జగన్ పర్యటన కార్యక్రమ నిర్వహణపై జిల్లా కో ఆర్డినేటర్ ఆ పార్టీ ముఖ్యనాయకులతో చర్చించారు. ప్రస్తుతం జిల్లాలో రైతుల పరిస్థితి, పొగాకు ధరలు, ఇతర పంటలు తదితర అంశాలపై పార్టీ నాయకులతో చర్చించినట్లు తెలుస్తోంది. పొదిలి వేలం కేంద్రాన్ని ఆరోజు ఉదయం 9.30 గంటలకు పరిశీలించనున్నందున రైతులను పెద్ద ఎత్తున సమీకరించాలని సూచించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాసులురెడ్డి, కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జులు చుండూరి రవి బాబు, డి. నారాయణ, ఆ పార్టీ నాయకులు కేవీ రమణారెడ్డి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

అవీఇవీ

ఘనంగా హనుమాన్ జయంతి

పూజలు నిర్వహించిన పోతుల రామారావు



చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రామారావు

సింగరాయకొండ/టంగుటూరు మే, 22 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామచావడి శ్రీపంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయుడికి విశిష్ట పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మాజీఎమ్మెల్యే పోతుల రామారావు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోతుల నరసింహరావు, రాజేంద్రప్రసాద్, బెల్లం జయంత్‌బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, చిడిపోతు కోటేశ్వరరావు, ఎస్సై నాగమల్లేశ్వరరావు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో 'జల'గలు!

(5వపేజీ తరువాయి)

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి డబ్బులు దండుకుంటున్నారు. కొన్ని అపార్ట్‌మెంట్‌లకు రోజూ సరఫరా చేస్తుండగా, మరికొన్నిటికి నాలుగు రోజులకు ఒకసారి కార్పొరేషన్ ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు.

● నగరంలో పలు అపార్ట్‌మెంట్‌ల నిర్మాణానికి కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క ట్యాంకర్లు భారీగా డబ్బు వసూలు చేస్తున్నారు.

● పలు హోటళ్లకు రోజూ పోయాల్సిందే

నగరంలోని పలు ప్రధాన పేరున్న హోటళ్లకు కార్పొరేషన్ ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ అక్రమం జరుగుతోంది. అందుకు కాంట్రాక్టర్‌కు నెలవారీ మామూళ్లు ఇవ్వడంతో ట్యాంకర్ యజమానులే వాటిని హోటల్స్‌కు సరఫరా చేస్తున్నారు. మరి కొంతమంది ట్యాంకర్ కాంట్రాక్టర్‌లు తమ సొంత అవసరాల పేరుతో అపార్ట్‌మెంట్‌లకు, భవన నిర్మాణాలకు అమ్ముకుంటున్నా అధికారులు సైతం చేసేదేమీ లేక చేతులెత్తేస్తున్నారు.

● శివారు కాలనీల్లో నీటి తిప్పలు

నగర పరిధిలో బలరాం కాలనీ, కేశవరాజు కుంట, జాషువా కాలనీ, ఇందిరమ్మ కాలనీ, అరవ కాలనీ, పీర్లమాన్యం, అరుణోదయ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, నేతాజీ కాలనీలతోపాటు మరికొన్ని కాలనీలకు నాలుగు రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతోంది. ఎక్కువ శాతం పీర్లమాన్యం, అరుణోదయ కాలనీ, నేతాజీ కాలనీ, అరవ కాలనీల పేరుతో ట్యాంకర్‌లు పక్కదారి పడుతున్నాయి. మరికొన్ని ట్యాంకర్లు ఆయా డివిజన్ నాయకుల ఆదేశాలతో ఉచితంగానే తరలిస్తుండగా, వాటికి కార్పొరేషన్ నుంచి రూ.356 చెల్లింపులు జరుగుతున్నాయి. దీంతో నాలుగు రోజులకు ఒకసారి వచ్చే నీటి కోసం ఎదురు చూసే ప్రజలకు ట్యాంకర్లు దారి మళ్లడంతో ఐదారు రోజులకు కూడా దాహం తీరే పరిస్థితి లేదు. దీంతో చేసేదేమీ లేక ఆయా ప్రాంతాల్లో మినరల్ వాటర్ కేంద్రాల నుంచి తాగునీటి అవరాలు తీర్చుకుంటున్నారు.

● పీర్లమాన్యంకు నాలుగు రోజులకు ఒకసారి 300 ఇళ్లకు ముప్పై ట్రిప్పులు రావాల్సి ఉంది. అయితే అవి ఎప్పుడొస్తాయో తెలియదు. ఇంటికి రెండు డ్రమ్ములు మాత్రమే పోసి వెళుతున్నారు. ఇదేమని అడిగితే ఎవరూ పట్టించుకోవడం లేదని పీర్లమాన్యంకు చెందిన మీరాబీ వాపోయారు.

● అరుణోదయ కాలనీకి చెందిన ప్రజలు తాగునీటి కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంది. స్థానికంగా ఉండే సత్యనారాయణ అనే వ్యక్తి ట్యాంకర్ ఎప్పుడు వస్తుందో కూడా తెలియదని, అధికారులకు ఫోన్‌లు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒక్కోసారి వారం రోజులకు కూడా నీరు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేమని అడిగితే ఫిల్టర్ బెడ్‌లో మోటారు చెడిపోయిందని చెబుతున్నట్లు వివరించారు.

హామీల అమలు.. జిల్లా అభివృద్ధి.. సమస్యల పరిష్కారం!

(5వపేజీ తరువాయి)

జిల్లా మహానాడుకు కూడా భారీగానే నాయకులు హాజరుకానున్నారు.

● సమస్యలపై తీర్మానాలు

జిల్లా ప్రజల తక్షణ సమస్యలకు పరిష్కారాలు, అభివృద్ధి అంశాలు, గత ఎన్నికలలో ప్రజలకు పార్టీపరంగా ఇచ్చిన హామీల అమలుపై మహానాడులో చర్చించి తీర్మానాలు చేస్తారు. వాటిని అటు పార్టీ అధిష్ఠానం దృష్టికి, ఇటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా చూడాల్సిన బాధ్యత జిల్లా నాయకత్వంపై ఉంది. ఎన్నికల సమయంలోనూ, యువగళం పాదయాత్రలోనూ పార్టీపరంగా ఇచ్చిన హామీలలో ప్రధానమైనవి కొన్ని ఉన్నాయి. వాటిలో పశ్చిమ ప్రజల కోరిక మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, జిల్లా మొత్తానికి సంబంధించి మూతపడిన ఒంగోలు డెయిరీ పునరుద్ధరణతో పాటు యూనివర్సిటీ, ట్రిపుల్‌ఐటీ నిర్మాణాలు కీలకంగా ఉన్నాయి. కనిగిరి ప్రాంతంలో నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్, ఫార్మా హబ్‌ల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెంపు కూడా ముఖ్యంగా ఉన్నాయి. ఈ అంశాలలో ఒంగోలు డెయిరీ వ్యవహారం మినహా ఇతర అంశాలపై ప్రభుత్వపరంగా దృష్టి పెరిగినా అవసరమైన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ఇక మౌలిక రంగాలు, అభివృద్ధి, ప్రజల జీవన పెరుగుదలకు ఉపకరించే కీలకమైన రోడ్లు, రైలు ఇతరత్రా అంశాలలో కదలిక ఉన్నా సాగు, తాగునీరు, విద్య, వైద్యం వంటి రంగాలపై అవసరమైన స్థాయిలో ఇంకా దృష్టి పెట్టలేదు.

● ధరలు లేక రైతులు విలవిల

మరోవైపు తక్షణ ప్రజా సమస్యల విషయం పరిశీలిస్తే.. జిల్లాలో అత్యధిక ప్రజానీకం ఆధారపడే వ్యవసాయం, పాడిపరిశ్రమ సంక్షోభంలో ఉన్నాయి. పంటలు పండక, పండిన వాటికి గిట్టుబాటు ధరలు లభించక రైతాంగం తల్లడిల్లుతున్నారు. మూడేళ్లు బాగా ఉందనుకున్న పొగాకు మార్కెట్ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టివేయబడి ధరలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లబర్లీ పొగాకు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఒంగోలు డెయిరీ పునరుద్ధరిస్తే తప్ప పాడిపరిశ్రమ తిరిగి కోలుకోలేని పరిస్థితి. గ్రామీణ పేదలకు, వ్యవసాయ కూలీలకు ఆసరాగా ఉండే ఉపాధి పథకం అవినీతిమయంగా మారగా కీలకమైన రెవెన్యూ, పోలీస్ ఇతర శాఖల్లో అవినీతి రాజ్యమేలుతుంది. ఇంకా అధికారపార్టీకి జిల్లా పాలనా యంత్రాంగంపై పట్టు దొరకని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా ఇళ్ల స్థలాలు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి వ్యక్తిగత లబ్ధి చేకూర్చే ప్రభుత్వ కార్యక్రమాల కోసం వేలాది మంది పేదలు ఎదురుచూస్తున్నారు. ఇక పార్టీపరంగా చూస్తే రాష్ట్రస్థాయిలో కీలకంగా పనిచేసే నాయకులకు పదవులు విషయంలో జరగాల్సినంత కృషి జరగలేదన్న అభిప్రాయం వారిలో ఉంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న జిల్లా మహానాడులో ప్రభుత్వంపై పొగడ్తలు, ప్రతిపక్షంపై విమర్శలకు పరిమితం కాకుండా భవిష్యత్‌లో జిల్లా అభివృద్ధికి, ప్రజలకు మేలుచేసే ఆలాగే పార్టీశ్రేణులకు ఉత్సాహాన్ని ఇచ్చే అంశాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాలిక మెడలో బంగారు గొలుసును అపహరించిన దొంగ అరెస్ట్

అద్దంకి, మే 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవీనగర్‌లో విశ్వభారతీ స్కూల్ సమీపంలో ఇటీవల ఇంటి ముందు పూలు కోస్తున్న బాలిక మెడలో బంగారు గొలుసును అపహరించిన నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. గుంటూరు పట్టణంలోని శ్రీనివాసరావుతోటకు చెందిన పాత నేరస్థుడు పసుపులేటి సాయినాద్‌బాబు స్కూటీపై వచ్చి అద్దంకిలో బాలిక మెడలో బంగారు గొలుసు లాక్కొని వెళ్లాడు.

బత్తాయి.. పడిపోయి..!

టన్ను ధర రూ.18వేలలోపే
వేసవిలో కాపునకు డిమాండ్ ఎక్కువ..
ప్రస్తుతం అందుకు భిన్న వాతావరణం
ఆందోళనలో రైతులు

• రైతును చిత్తు చేసిన చిత్త కాపు • తెగుళ్ల విజృంభణతో దిగుబడి ఢమాల్



ముండ్లమూరు, మే 22(ఆంధ్రజ్యోతి) : బత్తాయికి గడ్డుకాలం దాపురించింది. ధర దారుణంగా పతనమైంది. ప్రతికూల వాతావరణ ప్రభావం వల్ల తెగుళ్లు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రస్తుతం దిగుతున్న కాయకు విపరీతమైన మంగువస్తుంది. కాండాలకు పచ్చని పాకురు, వేరుకుళ్లు, పూతదశలో తామర పురుగులు వస్తుండటంతో చెట్లు చచ్చిపోతున్నాయి. పెట్టుబడులు భారీగా పెరుగుతుండడం, ధర పడిపోతుండడంతో నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా మార్కెట్ లేకపోవటం, ప్రభుత్వం నుంచి సబ్సిడీలు అందకపోవటం, సాగు యాజమాన్య పద్ధతులపై సరైన సూచనలు కరువయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





● మండలంలో సుమారు 200 ఎకరాల్లో సాగు

ముండ్లమూరు, మారెళ్ల, పసుపుగల్లు, జమ్మలమడక, పోలవరం, సుంకరవారిపాలెం, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో దాదాపు సుమారు 200 ఎకరాల్లో బత్తాయి పంటను సాగు చేశారు. నెల రోజుల నుంచి చిత్త కాపు కాయలు కోస్తున్నారు.

● ఉత్తరాదికి ఎగుమతులు

జిల్లా నుంచి బత్తాయి పంట డిల్లీ, ఆగ్రా, జైపూర్, కోల్‌కత్తా, ముంబయి తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. అక్కడ అకాల వర్షాలు పడుతుండటం కాయ వినియోగం పడిపోయిందని వ్యాపారులు చెపుతున్నారు. అందువల్లే ధరలు తగ్గాయంటున్నారు.

● రైతులకు అందని ప్రోత్సాహం

బత్తాయి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందించటం లేదు. ఉద్యానవన శాఖ అధికారులు వచ్చి సలహాలు ఇస్తున్నా కూడా రైతులకు నష్టాలు తోడవ్వటంతో ఏటా బత్తాయి సాగు విస్తీర్ణ తగ్గుతుంది.

ఇదేం ధర?

సాధారణంగా వేసవిలో వచ్చే బత్తాయి కాయకు డిమాండ్ ఉంటుంది. ఈ సీజన్‌లో వచ్చే కత్తెర కాయ దిగుబడి చాలా తక్కువ వస్తుంది. రసం ఎక్కువగా వస్తుంది. ఏటా ఏప్రిల్, మే నెలల్లో వచ్చే కత్తెర కాయ టన్ను ధర రూ.40వేలు నుంచి రూ.50వేల వరకు ధర ఉంటుంది. ప్రస్తుతం రూ.18వేలకు మించి పలకటం లేదు.

చిత్తకాపుతో బెంబేలు

ఈ ఏడాది చిత్త కాపు బత్తాయి సాగు రైతులను నట్టేటా ముంచింది. కత్తెరతోపాటు మంగు తెగులు ఎక్కువగా వ్యాపించటం వల్ల దిగుబడి గణనీయంగా పడిపోయింది. మొదట్లో ధర బాగా ఉందనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం టన్నుకు రెండు క్వింటాళ్ల చొప్పున తరుగు తీస్తుండటంతో కోత, కూలీల వల్ల రైతులకు తీవ్ర నష్టాలు వస్తున్నాయి.

దళారుల మాయాజాలం

అసలే చిత్త కాపు అంతంత రావటం ఒక ఎత్తయితే దానికితోడు మంగు, కత్తెర తెగులు అని పేరు చెప్పి దళారులు రైతులను దోపిడీ చేస్తున్నారు. ఇంకా ఉండే కొద్ది రేటు తగ్గుతుందేమోనని భయపడి వారు అడిగిన ధరకు రైతులు విక్రయిస్తున్నారు.

ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టగా దిగుబడి టన్ను నుంచి రెండు టన్నులు మాత్రమే రావటం, రెండు టన్నులు కలిపి రూ.36వేలు ధర రాక పోవటంతో రూ.70వేలు వరకు నష్టం వాటిల్లుతుంది. పంట కోసం తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలంటూ రైతులు అల్లాడిపోతున్నారు.

మంగు, నల్లితో సాగు కష్టం



నాగేశ్వరరావు, బత్తాయి సాగు రైతు, మారెళ్ల

నేను రెండు ఎకరాల్లో బత్తాయి సాగు చేశా. ఈ ఏడాది చిత్త కాపు చిత్తు చేసింది. అసలే దిగుబడి అంతంత మాత్రంగా ఉంటే దానికి తోడు మంగు, నల్లి తెగుళ్ల వ్యాప్తి చెంది అధికంగా ఉండటంతో సాగు వ్యయం భారీగా పెరిగింది. వాతావరణంలో మార్పులతో చెట్లు దెబ్బతింటున్నాయి. ఎన్ని మందులు పిచికాకీ చేసినా పెద్దగా ఫలితం ఉండటం లేదు. పెట్టుబడి పెరుగుతుండగా దిగుబడులు బాగా పడిపోయాయి. కాయలకు ధర ఉండటం లేదు.



మంగు తెగులు సోకిన బత్తాయి కాయలు

కత్తెర కాయ దిగుబడి లేదు



గుంటుపల్లి రంగనాయకులు, రైతు, ముండ్లమూరు

ఎనిమిది ఎకరాల్లో బత్తాయి సాగు చేస్తున్నా. ప్రతికూల వాతావరణ మార్పులతో ఒక్క టన్ను దిగుబడి రాలేదు. చాలా తోటల్లో ఇదే పరిస్థితి. బత్తాయి దిగుబడులు పూర్తి స్థాయిలో పడి పోయాయి. అయినా మార్కెట్‌లో ధర కూడా లేదు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందటం లేదు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా,పక్కన జేసీ గోపాలకృష్ణ,ఏఎస్పీ అశోక్‌బాబు

యోగాంధ్ర మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర-25 మాసోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మాసోత్సవాల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 21న యోగాంధ్రాపై జిల్లాలో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు ముందస్తు ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఏ రోజు ఏయే కార్యక్రమాలు నిర్వహించాలి, అందుకు చేపట్టాల్సిన చర్యలపై గ్రామ, మండల, జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. దైనందిన జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. నెలరోజులపాటు జరిగే ఈకార్యక్రమాల్లో ఒక్కొక్క రోజు ఒక్కో జిల్లాలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అందులో భాగంగా జూన్ 18న ఐదువేల మంది స్వయం సహాయక సభ్యులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జూన్ 2, 8, 15 తేదీల్లో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో కనీసం వెయ్యి మందితో యోగా కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో 100 మంది మాస్టర్ ట్రైనర్స్‌ను, మండల స్థాయిలో 200 మంది ట్రైనర్స్‌ను గుర్తించి జాబితాలను రూపొందించాలని ఆయూష్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ అశోక్‌బాబు, జిల్లా రెవెన్యూఅధికారి చిన ఓబులేషు, వివిధ శాఖల అధికారులు చిరంజీవి, పద్మజాతి పాల్గొన్నారు.

గుండ్లకమ్మలో కోడి వ్యర్థాలను అరికట్టి ప్రజారోగ్యం కాపాడాలి

మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య

ఒంగోలు, కార్పొరేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండలం, మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మలో చేపల పెంపకం చేస్తూ వాటి ఆహారంగా కోడి వ్యర్థాలు వేయడాన్ని మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య తప్పుబట్టారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఈ నీరు తాగితే ఇంకేమైనా ఉందా?' కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు విషయాన్ని బాపట్ల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గురువారం త్రోవగుంటలో జరిగిన సంతనూతలపాడు నియోజకవర్గం మహానాడుకు హాజరైన బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మను పరిశీలించి, అనధికారకంగా చేపల పెంపకం, కోడి వ్యర్థాలు వేయడాన్ని అరికట్టాలని కోరారు. తాగునీటి వనరుల్లో కోడి వ్యర్థాలు వేయడం ద్వారా ఒంగోలు నగరానికి వచ్చే తాగునీరు కలుషితం అవుతుందని, ఈ విషయంలో అధికారులు దృష్టిసారించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఆర్ఆర్ఎంలో బదిలీల సహాయ కేంద్రం

అందుబాటులో 75 ల్యాప్‌టాప్‌లు

ఒంగోలు విద్య, మే 22(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలులో ప్రత్యేకంగా ఒక సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఈ కేంద్రంలో 75 ల్యాప్‌టాపులతో సాంకేతిక సిబ్బంది టీచర్లకు సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా టీచర్ల బదిలీల దరఖాస్తులు చేసేందుకు కూడా అవకాశం ఉంటుందని, బదిలీలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్నా ఈసహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించినట్లు వివరించారు. హెచ్ఎంల బదిలీ దరఖాస్తుల్లో ఏదైనా పొరపాటు జరిగినా ఉప విద్యాధికారి లాగిన్ ద్వారా వాటిని పరిశీలించి సరిచేసేందుకు అవకాశంఉంటుందని తెలిపారు. దరఖాస్తులు, పాయింట్ల విషయంలో హెచ్ఎంలు, టీచర్లు ఎవరూ ఆందోళన చెందవద్దని లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అందరికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

గణితం పరీక్షకు 19 సిట్టింగ్ స్క్వాడ్లు

ఒంగోలు విద్య, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన గణితం పరీక్షకు రికార్డు స్థాయిలో 19 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో గణితంలోనే ఎక్కువమంది విద్యార్థులు ఫెయిల్ కావడంతో ప్రస్తుతం కూడా పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ఈ ఏర్పాట్లు చేశారు. గణితం పరీక్షకు 3876 మందికి 3727 మంది హాజరు కాగా 348 మంది గైర్హాజరయ్యారు. ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియెట్ ఫిజిక్స్ పరీక్షకు 1516 మందికి 1338 మంది, పొలిటికల్ సైన్స్ పరీక్షకు 550 మందికి 456 మంది హాజరయ్యారు. పదో తరగతి గణితం పరీక్షకు 1021 మందికి 841 మంది హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

కరోనాపై అప్రమత్తం చేసిన ప్రభుత్వం

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖను అప్రమత్తం చేసింది. పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు నమోదవుతుండటం, విశాఖపట్నంలోనూ ఒక కేసు నమోకావడం తెలిసిందే. కోవిడ్‌పై అప్రమత్తం చేయడంతోపాటు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాలను జారీ చేసింది. కోవిడ్‌పై శుక్రవారం డిల్లీ నుంచి ఉన్నతాధికారులు రాష్ట్ర అధికారులతో ప్రత్యే క సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

సొంతూరిపై మమకారం అభినందనీయం

ఎడ్ల బలప్రదర్శన పోటీల ముగింపు సభలో
ఎమ్మెల్యేలు ఉగ్ర, నసీర్ అహ్మద్

పీసీపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గుంటూరులో స్థిరపడినప్పటికీ సొంతూరిపై మమకారంతో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు పల్లె సంస్కృతిని అద్దం పట్టేలా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్న కొంపల్లి మాలకొండయ్య అభినందనీయులని కనిగిరి, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, నసీర్ అహ్మద్‌లు పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని వెంగళాపురం సమీపంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముగింపు రోజు పోటీలో వీరు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్లు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయన్నారు. ప్రస్తుతం యాంత్రీకరణ పద్ధతిలో వ్యవసాయం చేస్తుండడంతో ఏటేటికీ గ్రామాల్లో ఎడ్ల సంఖ్య తగ్గిపోతోందని చెప్పారు. ఈతరుణంలో బలప్రదర్శన పోటీలకు వచ్చిన ఎడ్లను చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం వారు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోకుండా ఉండేందుకు ఎమ్మెల్యే ఉగ్ర రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఇక్కడికి తీసుకురావడంతో పాటు ఎంఎస్ఎంఈ పార్కులను కూడా మంజూరు చేయించారన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచన మేరకు త్వరలో కనిగిరిలో స్టేడియాన్ని నిర్మించబోతున్నట్టు చెప్పారు.

గురువారం నిర్వహించిన సీనియర్ పోటీల విభాగంలో నంద్యాల జిల్లా హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఎం రామసుబ్బారెడ్డికి చెందిన ఎడ్లు 3103.2మీటర్లు బండ లాగి ప్రథమస్థానంలో విజేతగా నిలిచాయి. నంద్యాల జిల్లా జిల్లెల గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డి, హిత్విక్‌రెడ్డి ఎడ్లు 3017.3మీటర్లు బండలాగి ద్వితీయస్థానం, బాపట్లజిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోటి వీరేషచౌదరి, శివక్రిష్ణ చౌదరిల ఎడ్లు 3000మీటర్లు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. వీటితో పాటు 7వ స్థానం వరకు విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కొంపల్లి మల్లికార్జున, మధు, వెల్ది కొండయ్య, గుదే నాగేశ్వరరావు, రావి రామాంజనేయులు, వడ్డెంపూడి చిన్నా, వడ్డెంపూడి శ్రీను, రామారావు, సుబ్బారావు, పెద రాఘవయ్య, సోమయ్య, సతీష్, రాజా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎమ్మెల్యే ఉగ్ర

కనులపండువగా హనుమ శోభాయాత్ర

మార్కాపురం వన్‌టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ జయంతి పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర గురువారం కనులపండువగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో తర్లుపాడు రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. నాలుగు మాడవీధుల గుండా సాగిన శోభాయాత్ర చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ముగిసింది. అంగరంగ వైభవంగా, మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, రంగురంగుల టపాసులు, జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో శోభాయాత్ర సాగింది. ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి చిన్నవీరారావు, గోపాలుని హరిహరరావు, హిందూ చైతన్య వేదిక నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శోభాయాత్ర కమిటీ నాయకులు గుంటక వనజాక్షి, నారాయణం తులసి పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు పాల్గొన్న శోభాయాత్రతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.



శోభాయాత్రలో హనుమంతుడి విగ్రహం



శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

ప్రతి ఓటుకూ ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రతి ఒక్క ఓటుకూ ఆధార్ అనుసంధానం చేసుకొనే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్వో చిన ఓబులేషు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అలా అనుసంధానం చేసుకోకపోతే ఓటును కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అంతకు ముందు వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో చనిపోయిన వారి ఓట్లను ఇప్పటి వరకు ఎన్ని తొలగించారని డీఆర్వో దృష్టికి తెచ్చారు. ఒంగోలు నగరంతో పాటు ఇతర మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో డోర్ నంబర్లు లేకపోవడం వల్ల కొత్తగా ఓట్లు చేర్చుకోనేందుకు ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయాఅంశాలపై డీఆర్వో మాట్లాడుతూ ఒంగోలు నగరంతో పాటు మునిసిపాలిటీల్లో డోరు నెంబర్లు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీకలెక్టర్లు ఎం. వెంకటశివరామిరెడ్డి, జాన్సన్, బ్రహ్మయ్య, మంజునాథరెడ్డి, ఎంవీ సత్యనారాయణ, ఎన్నికల సెల్ సూపరిటెండెంట్ రాజ్యలక్ష్మి, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు వెంకటరావు, డీఎస్ క్రాంతికుమార్, రమేష్, ఎస్‌కే రసూల్ తదితరులు ఉన్నారు.



రాజకీయ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఓబులేషు


కేశవస్వామిపేటలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్


మంగమూరుడొంకలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు


అప్పాయకుంటలోని ఆంజనేయస్వామి విగ్రహానికి భక్తుల పూజలు

వైభవంగా హనుమజ్జయంతి

- స్వామివారికి ప్రత్యేక పూజలు
- పలుచోట్ల భక్తులకు అన్నప్రసాద వితరణ
- ఒంగోలులో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి పండుగను ప్రజలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఒంగోలు నగరం కేశవస్వామిపేట శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రముఖ పురోహితులు జొన్నలగడ్డ వేదసాయిశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు ఆంజనేయ సహస్ర నామావళి పఠిస్తుండగా తమలపాకులతో స్వామివారికి విశేష అర్చన చేశారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థాన ఈవో బోడపాటి శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి పండితులు వేద ఆశీర్వచనాన్ని, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సహస్ర నామ పఠనంలో చివుకుల ప్రసాదశర్మ, సుబ్రహ్మణ్యశర్మ, వారణాసి రామకృష్ణశర్మ, శ్రీనివాసశర్మ, రమేష్‌శర్మ పాల్గొన్నారు.

స్థానిక రాజాపానగల్ రోడ్ శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలోను విశేష అర్చనలు జరిగాయి. లాయర్‌పేట శ్రీచిట్టిఆంజనేయస్వామి దేవస్థానంలో అర్చకులు అశమురి శ్రీనుస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి తమలపాకులతో విశేషఅర్చన, వడమాల సేవ నిర్వహించారు. స్థానిక సుందర నగర్‌లోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా అప్పాయకుంటలోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో విశేష అర్చనలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఇక సంతపేట శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం, కొణిజేడు బస్టాండ్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం, ఐశ్వర్యనగర్ శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం మొదలైన ఆలయాలలో సైతం హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో..


పెళ్లూరులో శ్రీప్రసన్న ఆంజనేయస్వామి


కరవది అంబేద్కర్‌కాలనీలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలంలోని హనుమజ్జయంతి పండగను ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. కరవది జడ్పీ హైస్కూల్ వద్ద గల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, స్థానిక అంబేడ్కర్‌కాలనీలో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వలేటివారిపాలెం, యరజర్ల, కొప్పోలు శ్రీచెన్నకేశవస్వామి దేవాలయం, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం, ముక్తినూతలపాడు, గుడిమెళ్లపాడులో హనుమజ్జయంతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

మద్దిపాడు మండలంలో..


ఘుడియపూడి కాలనీలో పూజలు చేస్తున్న భక్తులు


సీతారామపురంలో ఆంజనేయస్వామి వేషధారణ

మద్దిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. బసవన్నపాలెం, నందిపాడు, మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, దొడ్డవరం గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్దకొత్తపల్లి హనుమాన్ విగ్రహం దగ్గర మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. సీతారామపురంలో గ్రామానికి చెందిన మండవ అంజయ్య ఆంజనేయస్వామి వేషధారణలో భక్తులను అలరించారు. మద్దిపాడులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఘడియపూడి కాలనీలోని శివాలయంలో గల శ్రీప్రసన్నాంజనేయస్వామికి అర్చకులు సుబ్రహ్మణ్యం, మణికంఠ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. కార్యక్రమంలో అన్నమనేని చెంచయ్య దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సంతనూతలపాడులో..


వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు

సంతనూతలపాడు : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సంతనూతలపాడులో జెండా చెట్టు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామివారికి యాదవసంఘం ఆధ్వర్యంలోను ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా గానుగపాలెం, పోలీస్‌స్టేషన్ సమీపంలోను ఉన్న ఆంజనేయస్వామి గుడివద్ద, గుమ్మళంపాడు సమీపంలోని నిధివద్ద శ్రీప్రసన్నాంజనేయస్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: హనుమత్ జయంతి వేడుకలను గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రం, అభయాంజనేయస్వామి దేవాలయాలతో పాటు నెహ్రూనగర్, రామనగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోని రామమందిరాల్లో ఆంజనేయస్వామి మూలవిరాట్‌లని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. హరిహరక్షేత్రంలో జరిగిన పూజల్లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి విశేషపూజలు జరిపారు. మండలంలోని పలు గ్రామాల్లో హనుమత్ జయంతిని వైభవంగా నిర్వహించారు.


చీమకుర్తిలో అభయాంజనేయస్వామి అరటిపండ్లతో అలంకరణ

సింగరాయకొండలో..

సింగరాయకొండ: మండలంలోని పలు దేవస్థానాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని స్వయంభు ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరాయకొండ పంచాయతీ పరిధి రైల్వేస్టేషన్ రోడ్డులోని రామాలయంలో ఆంజనేయుడిని లక్ష తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం హోమాన్ని నిర్వహించారు. ఆంజనేయకాలనీలోని ఆంజనేయ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ రహదారిపై కనుమళ్ల రోడ్డు వద్ద ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.


సింగరాయకొండలో ఆంజనేయుడికి అలంకరణ

24న మెప్మా ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

ఒంగోలు కార్పొరేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు సంఘాలలోని సభ్యులైన వారి పిల్లల కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ పి.శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీన ఒంగోలు నగరం మంగమూరురోడ్ జంక్షన్‌లోని నాగార్జున డిగ్రీ కాలేజీలో ఉదయం 9గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందని, 35కి పైగా పేరున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. అలాగే ఐటీ, ఫార్మసీ, ప్రొడక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్, పలు కంపెనీలలో ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన సంఘ సభ్యుల పిల్లలు హాజరుకావాలని కోరారు. అలాగే పొదుపు మహిళలకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు మంజూరు చేసిన రాపిడో బైక్‌ల పంపిణీ, మెప్మాబజార్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 96శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం నిర్వహించి ఏపీఈఏపీసెట్‌కు 96.27శాతం మంది హాజరయ్యారు. ఈ పరీక్షకు 1,959 మందికి 1,886 మంది హాజరయ్యారు. రాష్ట్రంలో సగటున 94.39శాతం మంది కాగా జిల్లాలో రెండుశాతం అదనంగా 96.27శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు.

కేంద్ర పట్టణ వ్యవహారాల కమిటీ పర్యటన

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ పర్యటనలో భాగంగా గురువారం ఆ కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఢిల్లీలోని నౌరోజీనగర్‌లో గల వరల్డ్ ట్రేడ్ సెంటర్, సరోజినినగర్‌లోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ పర్యటనకు విచ్చేసిన మాగుంటను సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి


సర్టిఫికెట్లతో చిన్నారులు, నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రకాశం బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో భగత్‌సింగ్ చిల్డ్రన్ క్లబ్ పేరుతో నిర్వహించిన సమ్మర్ క్యాంపు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంగ్లీషు చదవడం, రాయడంతో పాటు హ్యాండ్ రైటింగ్, స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించం, డ్రాయింగ్, క్రాపిటింగ్‌తో నేర్పించి సర్టిఫికెట్లను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కేఎఫ్‌బాబు, కిరణ్, దానియేలు, శ్రీనివాసులు, విజయమ్మ, భావన్నారాయణ, నిర్వాహకులు రాజ్యలక్ష్మి, జేవీవీ కార్యదర్శి జయప్రకాష్ పాల్గొన్నారు.

యోగాను పాఠ్యాంశంగా చేర్చడం చట్టవిరుద్ధం

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠ్యాంశంగా యోగాను చేరుస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక మతపరమైన ఆచారాన్ని పాఠ్యాంశంగా పెట్టడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంకే.బేగ్, సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, శిఖా చంద్రశేఖర్‌బాబు, జి.నరసింహారావు, సుభానీ పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే

మద్దిపాడు, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను పాదర్శకంగా చేయాలని తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి అన్నారు. గురువారం అన్నంగి గ్రామంలో రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన అన్ని రికార్డులను చూపించి కట్టుదిట్టంగా రీసర్వే చేయించుకోవాలన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు అధికారులు సమాచారం ఇవ్వాలని చెప్పారు. రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో షేక్ మీరావలి, సర్వేయర్లు పాల్గొన్నారు.

చిన్నారుల దత్తత కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు నగరం, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న చైల్డ్ కేర్ యూనిట్‌లలో ఉన్న చిన్నారులను పాక్షిక దత్తత తీసుకునేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖాధికారి ఒక ప్రకటనలో కోరారు. 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న వారిని పాక్షిత దత్తత కోసం ఒంగోలు నగరం రామ్‌నగర్‌లో ఐసీడీఎస్ కార్యాలయంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులను సంప్రదించాలని కోరారు. సమాచారం కోసం 9440814506 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

టీడీపీ యరజర్ల గ్రామ అధ్యక్షుడికి సత్కారం


శ్రీనివాసులును సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), మే22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం యరజర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన కంకణాల శ్రీనివాసులును గురువారం రాత్రి పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం కేక్ కట్ చేసి శ్రీనివాసులుకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పుచ్చకాయల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులోనే ట్రిపుల్‌ఐటీని కొనసాగించాలి


మాట్లాడుతున్న జగదీష్

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న ట్రిపుల్‌ఐటీని ఒంగోలులోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని జేఏసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రావ్‌అండ్‌నాయుడు కాలేజీలో నిర్వహిస్తున్న ట్రిపుల్‌ఐటీ కాలేజీని మళ్ళీ కడపకు తరలిస్తే ఊరుకోనేది లేదని హెచ్చరించారు. ఒంగోలులోని మంగమ్మ కళాశాల, శర్మా కళాశాల, మలినేని ఇంజనీరింగ్ కాలేజీ, ఒంగోలులోని పాత రిమ్స్ భవనాలను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో సొంత భవనాలు నిర్మించి ఒంగోలులోనే ఏర్పాటు చేయాలన్నారు. కొంత మంది కనిగిరి ప్రాంతానికి తీసుకొని వెళ్తామంటే కుదరదని చెప్పారు. ఒంగోలుకు ట్రిపుల్‌ఐటీ ఇచ్చిన తర్వాత మార్కాపురం జిల్లా ఏర్పడుతుందని, అవసరమైతే కొత్తగా మరో ట్రిపుల్‌ఐటీ కళాశాల మంజూరు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రెబ్బవరపు ప్రేమ్‌కుమార్, రాజీవ్, బెంజిమెన్, సాగర్, కృష్ణ, సూర్య పాల్గొన్నారు.

పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పిస్తాం

- ఆర్ఎం లక్ష్మణరావు

మద్దిపాడు, మే 22(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు మెరుగైన ధర కల్పించి సకాలంలో కొనుగోళ్లు పూర్తిచేయడానికి కృషి చేస్తామని బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు పేర్కొన్నారు. గురువారం ఆయన వెల్లంపల్లి వేలం కేంద్రాన్ని సందర్శించి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ 160 మిలియన్ కిలోలు లక్ష్యం కాగా 220 మిలియన్ కిలోలు పొగాకు పంట సాగు చేశారని, ధరల విషయం వ్యాపారులతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. వ్యాపారులకు ఆర్డర్లు ఖరారు కావడానికి ఈనెల మూడో వారం వరకు సమయం పడుతుందని చెప్పారు. అనంతరం అన్నిరకాల పొగాకు బేళ్లు కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రానున్న 15 రోజుల్లో నోబిడ్ బేళ్లు తగ్గించాలని వ్యాపారులకు సూచించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వరరావు, మండవ గోవిందరాజులు, మండవ శ్రీరామమూర్తి, నారిపెద్ది వరహాలచౌదరి, బోయపాటి వెంకయ్య, జజ్జర శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణమండపానికి రూ.లక్ష విరాళం


నగదును అందజేస్తున్న అనురాధ

ఒంగోలు కల్చరల్, మే 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం అప్పాయగుంటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రధాన అర్చకులు పరాంకుశం సత్యనారాయణ మూర్తి యాజ్ఞీకంలో విశేష అర్చనలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో దర్శనం చేసుకున్నారు. కాగా ఆలయంలో కళ్యాణమండపం నిర్మాణానికి కమ్మపాలెం నివాసి కాట్రగడ్డ అనూరాధ తన తల్లిదండ్రులు వెంకయ్య, సీతారావమ్మ జ్ఞాపకార్థం లక్ష రూపాయలు నగదును విరాళంగా అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు భైరపునేని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దాచర్ల రమణయ్య, తిరుపతిరావు, సన్నీ, కాట్రగడ్డ రవి తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో కొత్తవారి కదలికలను గమనించాలి : సీఐ


మాట్లాడుతున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

సింగరాయకొండ, మే 22 : తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కొత్త వ్యక్తుల కదలికలను గమనిస్తూ ఉండాలని మత్స్యకారులకు రామాయపట్నం మెరైన్ సీఐ శివన్నారాయణ సూచించారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని క్రాంతి, శాంతినగర్‌లో మెరైన్ సిబ్బందితో కలిసి గురువారం సీఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరంలో అనుమానస్పదంగా సంచరిస్తుంటే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1093కి లేదా రామాయపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు. దేశ భద్రత దృష్ట్యా సముద్రమార్గం ద్వారా దేశంలోకి టెర్రరిస్టులు, ఉగ్రవాదులు ప్రవేశించకుండా, అక్రమ రవాణా కార్యక్రమాలను నివారించడానికి మత్స్యకారులు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌కు సహకరించాలని ఆయన కోరారు.

బస్టాండ్‌కెళితే బాదుడే..!

ఆర్టీసీ ఆవరణంలో పార్కింగ్ సమస్య

జిల్లా కేంద్రమైన ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాలంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. ప్రతిరోజు వేల సంఖ్యలో రాకపోకలు సాగించే ప్రయాణికులు.. వారిని వదిలేందుకు, ఇంటికి తీసుకెళ్ళేందుకు విచ్చేసేవారితో రద్దీగా ఉంటుంది. అయితే ప్రయాణికుల సౌకర్యార్థం ఉచిత పార్కింగ్ ఏర్పాటు చేయాల్సిన అధికారులు వాహనదారుల వద్ద నుంచి రూ.200 అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. ఇదిలా ఉంచితే బస్టాండ్‌లోకి వాహనాలు రావడానికి వీల్లేదంటూ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. దీంతో వాహనదారులు ఏమి చేయాలో దిక్కుతోచక అల్లాడిపోతున్నారు. అటు ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం లేదు. గురువారం ట్రాఫిక్ పోలీసులు పలు వాహనాలను స్టేషన్‌కి తరలించడంతో ప్రయాణికులు బస్టాండ్ అంటేనే హడలిపోతున్నారు. ఇప్పటికైనా ప్రయాణికుల కోసం పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


బస్టాండులో పార్కింగ్ చేసిన బైక్‌లను తీసుకెళుతున్న పోలీసులు

\- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..!

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- ఘనంగా టీడీపీ ఎస్ఎన్‌పాడు నియోజకవర్గం మినీ మహానాడు
- అధిక సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, పక్కన ఎంపీ కృష్ణప్రసాద్, హాజరైన పార్టీ శ్రేణులు

ఒంగోలు కార్పొరేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం బాగుండాలన్నా, భవిష్యత్ తరాలకు భరోసా లభించాలన్నా మరో ఇరవై ఏళ్ళు టీడీపీ అధికారంలో ఉండాలని, అలాగే తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్ఎన్‌పాడు నియోజకవర్గం మినీమహానాడు గురువారం ఒంగోలు నగరం త్రోవగుంటలోని విష్ణుప్రియ ఫంక్షన్‌హాలులో పండుగ వాతావరణంలో జరిగింది. కార్యక్రమానికి చీమకుర్తి మండల అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చిన మొదట్లోనే నియోజకవర్గ ప్రజలకు మాట ఇచ్చానని, ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ఇరవై ఏళ్ళపాటు నియోజకవర్గ ప్రజల కోసం పనిచేస్తానని చెప్పిన మాటను గుర్తు చేశారు. తన గెలుపు కోసం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి మరువలేనిదని, 30వేలకు పైగా మెజారిటీ రావడం అది మీ విజయమే అన్నారు. అలాగే సాధ్యమయ్యే హామీలను మాత్రమే తాను ఇస్తానని, అందుకే తాను మితంగా మాట్లాడతానని తెలిపారు. కుల, మతాలు, వర్గాలకు అతీతంగా అందరినీ కలుపుకుపోతానని, ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. విజయ్‌కుమార్ మంచోడు అని అనిపించుకోవాలన్నదే తనకు కావాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి సాధించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యం, దోపిడీ కారణంగా నిధులు లేకపోయినా అభివృద్ధి, సంక్షేమం, ప్రగతి వైపు సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారని బీఎన్ పేర్కొన్నారు. పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని అన్నారు. అవసరమైతే బోర్డు అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కడపలో జరిగే మహానాడుకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజన్ కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని చెప్పారు. నాటి పాలకులు తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెడితే స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిందని, ప్రతి కార్యకర్త సంక్షేమమే పార్టీ ఏకైక లక్ష్యమన్నారు. ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని ఎంపీ కృష్ణప్రసాద్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలతో నివాళులు అర్పించారు. దాంతోపాటుగా నియోజకవర్గానికి సంబంధించిన పన్నెండు అంశాలపై తీర్మానం ప్రవేశపెట్టగా అందరూ మద్దతు తెలిపారు.

కార్యక్రమంలో ఎస్ఎన్‌పాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండల పార్టీ అధ్యక్షులు హరిబాబు, మండవ జయంత్‌బాబు, తేళ్ళ మనోజ్‌కుమార్, పరిశీలకులు చేటం శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరప్రసాద్, సీనియన్ నాయకులు అడకా స్వాములు, మండవ రంగారావు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఒంగోలు రైల్వే స్టేషన్‌లో 1750 గ్రాముల గంజాయి స్వాధీనం

- కేరళ యువకుడు అరెస్టు

ఒంగోలు క్రైం, మే22(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 1750 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురం జిల్లాకు చెందిన ఎస్ఆర్.విజయ్‌గా గుర్తించామని చెప్పారు. చత్తీస్‌ఘడ్ నుంచి తిరువనంతపురంనకు గంజాయి తీసుకెళుతున్నట్లు విచారణలో వెల్లడయిందన్నారు. గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం 3లో విజయ్ అనుమానాస్పదంగా తిరుగుతూ ఉన్నాడని, అతని వద్ద ఉన్న బ్యాగ్ పరిశీలించగా గంజాయి దొరికిందని చెప్పారు. ఈమేరకు విజయ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌వోలు

కొనసాగుతున్న సీహెచ్‌వోల దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు గురువారానికి 24వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తాము తమ సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా జోక్యం చేసుకొని వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంటా ప్రసన్న, జీవనజ్యోతి, శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొష్టాలుగా అంగన్‌వాడీ భవనాలు


నిర్మాణం నిలిచిన అంగన్‌వాడీ భవనంలో ఉన్న ఎడ్లు

- టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభం
- వైసీపీ పాలనలో చెల్లించని బిల్లులు
- ఏడు చోట్ల నిలిచిన పనులు

పెద్దారవీడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టక పోగా అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను కొనసాగించకుండా అడ్డుకుంది. పెద్దారవీడు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు నిలిచిపోవడం వైసీపీ పాలనలో చిత్తశుద్ధికి అద్దం పడుతుంది.

నిలిచిన ఏడు అంగన్‌వాడీ భవనాలు

పెద్దారవీడు మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఏడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అనుమతిచ్చింది. అందుకు గాను ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.7.50 లక్షల నిధులు కేటాయించింది. నిర్మాణ పనులు వేగవంతంగా జరిగాయి. భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న సమయంలో 2019లో జరిగిన ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకూ జరిగిన పనులకు గాను టీడీపీ ప్రభుత్వం రూ.4.60 లక్షల చొప్పున బిల్లులు మంజూరు చేసింది. వైసీపీ వచ్చాక బిల్లులు మంజూరు చేయడంలో జాప్యం కారణంగా కాంట్రాక్టర్‌లు ఆ పనులను నిలిపి వేశారు. దీంతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

మండలంలో నిలిచిన అంగన్‌వాడీ భవనాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నాం. అధికారులు నిర్ణయించిన వెంటనే నిర్మాణ పనులకు చర్యలు తీసుకుంటాం.

- ఎం.లక్ష్మీదేవి, సూపర్‌వైజర్

పశువుల కొష్టాలుగా

మండలంలోని పెద్దారవీడు, వైడిపాడు, బద్వీడు, కత్రేల, సీహెచ్ అగ్రహారం, బద్వీటి చెర్లోపల్లి, కంభంపాడులలో నిర్మాణ పనులు నిలిచిపోయి ఇప్పటికి ఏడేళ్లు గడిచింది. నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాలలో సమీపంలోని రైతులు తమ పశువులను ఉంచుకుంటున్నారు. దీంతో ఆయా భవనాలు పశువుల కొష్టాలుగా దర్శనమిస్తున్నాయి.


కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న మార్కాపురం డీఎం నరసింహులు

ఆర్టీసీ కార్గో సెంటర్ ప్రారంభం

తర్లుపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న మీసేవా కేంద్రంలో ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సెంటర్‌ను మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్గో సెంటర్ వలన చుట్టుపక్కల వారికి సరకులు సులభంగా పార్సిల్ చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్గో సెంటర్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీపీ రమేష్ బాబు, కార్గో బుకింగ్ అధికార భాస్కర్, యాసిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా శిక్షణ


యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

పెద్ద దోర్నాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. గ్రంథ పాలకుడు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చిత్రలేఖనం, ఆంగ్లంలో రాయడం, చదవడం, కథలు వినిపించడం, నృత్యం వంటి అంశాల్లో తర్ఫీదునిచ్చారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ శేషిరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదరంగం, చిత్రలేఖనంలో శిక్షణ పొందారు. పుస్తకాలు చదవడం, కథలు చెప్పటం నిర్వహించారు. ఈనెల 24, 25 తేదీలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేతిరాతపై శిక్షణ ఇస్తారని బాలబాలికలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు శివారెడ్డి తెలిపారు.

25న నేత్ర వైద్య శిబిరం

గిద్దలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పెద్దకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. 25వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న శిబిరానికి వచ్చే రోగులు ఆధార్ లేదా ఆరోగ్యశ్రీ, ఓటరు కార్డు జిరాక్స్‌లను తీసుకుని వచ్చి చికిత్సలు ఉచితంగా పొందవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేద ప్రజల పక్షాన పోరాడేది సీపీఐ


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు నాసరయ్య

కొనకనమిట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల పక్షాన పోరాడేది సీపీఐ అని మార్కాపురం నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య అన్నారు. గురువారం స్థానిక గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో సీపీఐ మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అట్టడుగు వర్గాల వారికి భూములు, ఇళ్ల స్థలాలు కేటాయించడంలో పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. దర్శిలో జూన్ 21 నుంచి 23వ తేదీ వరకు జిల్లా మహాసభలు జరుగుతాయని అధిక సంఖ్యలో సభ్యులు, ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ఆగస్టులో రాష్ట్ర మహాసభలు ఒంగోలులలో జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కోటేశ్వరావు, సహాయ కార్యదర్శి పి.కొండయ్య, సిగినం వెంకటేశ్వర్లు, పెద్దసిద్దయ్య, పుల్లమ్మ, సుబ్బమ్మ, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

కరెంట్ తీగలు తగిలి గేదె మృతి


మృతిచెందిన గేదె

కొనకనమిట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : తెగిపడిన విద్యుత్ లైన్ తగిలి గేదె మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని చినారికట్ల గ్రామానికి చెందిన ఇల్లూరి ఆదినారాయణకు చెందిన గేదె సమీప పొలాల్లో మేత మేస్తు గాలికి తెగిపడిన ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో గేదె మృతి చెందింది. అయితే గత పదిరోజుల కిందట వీచిన ఈదురు గాలులకు విద్యుత్ లైన్లు తెలిగిపడ్డాయి. ఈవిషయం విద్యుత్ అధికారులకు అప్పుడే చెప్పినప్పటికీ అధికారుల పట్టించుకోలేదని వారంరోజులైనా నిర్లక్ష్యంతో వ్యహరించడం వల్లే మేతకు వెళ్లి గేదె మృతి చెందినదని బాధితుడు ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.80వేలు ఉంటుందని, తనకు అధికారులు న్యాయం చేయాలని కోరారు.

తీరప్రాంతంలో కొత్తవారి కదలికలను గమనించాలి

మెరైన్ సీఐ శివన్నారాయణ

సింగరాయకొండ, మే 22 : తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కొత్త వ్యక్తుల కదలికలను గమనిస్తూ ఉండాలని మత్స్యకారులకు రామాయపట్నం మెరైన్ సీఐ శివన్నారాయణ సూచించారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని క్రాంతి, శాంతి నగర్‌లో మెరైన్ సిబ్బందితో కలిసి గురువారం సీఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరంలో అనుమానస్పదంగా సంచరిస్తుంటే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1093కి లేదా రామాయపట్నం మెరైన్ పోలీసుస్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు. దేశ భద్రత దృష్ట్యా సముద్ర మార్గం ద్వారా దేశంలోకి టెర్రరిస్టులు, ఉగ్రవాదులు ప్రవేశించకుండా, అక్రమ రావాణా కార్యక్రమాలను నివారించడానికి మత్స్యకారులు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌కు సహకరించాలని కోరారు.


నల్లవాగును పరిశీలిస్తున్న నాయకులు

కాలువను పరిశీలించిన టీడీపీ నాయకులు

మార్కాపురం రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివరాంపురం గ్రామం సమీపంలో మరమ్మతులకు గురైన మార్కాపురం చెరువుకు నీరు చేరే వాగు కాలువను గురువారం మార్కాపురం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, బోడపాడు టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి సంఘం చైర్మన్ దగ్గుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శివరాంపురం గ్రామ సమీపంలో ఉన్న నల్లవాగు కాలువ మరమ్మతులకు గురి కావడంతో వరద నీరు వృథాగా పోతున్నదని, వాటిని పరిశీలించి కాలువ మరమ్మతు పనులు చేసి మార్కాపురం చెరువుకు నీరు చేరేలా చేయాలని అధికారులకు తెలియజేస్తామని తెలిపారు.

డీఎల్‌డీవోగా బాలు నాయక్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన డీఎల్‌డీవో బాలునాయక్

మార్కాపురం రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో)గా బీ బాలు నాయక్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో మాచర్లలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీగా విధులు నిర్వర్తించారు. బదిలీపై మార్కాపురం డీఎల్‌పీవో వచ్చారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా పనిచేసిన కొల్లి శ్రీనివాసరెడ్డి కనిగిరి డీఎల్‌డీవోగా బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయ సిబ్బంది బాలునాక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగుల సంఘ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జూన్ 5న జరిగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయ ఆవరణలో గురువారం చలో విజయవాడ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మార్కాపురం తాలుకా అధ్యక్షుడు కొల్లి చెంచిరెడ్డి, కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కోశాధికారి బుడే సాహెబ్, సభ్యులు కోమలి, శేఖర్, శివకుమార్, పఠాన్ పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పొదిలి, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులపై జరిగిన యుద్ధంలో భారత్ సైనికుల విజయంపై గురువారం పట్టణంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. అనంతరం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి విజయలక్ష్మి మాట్లాడుతూ వీరోచిత పోరాటం చేసి అమరులైన సైనికుల త్యాగాలకు ప్రతీకగా త్రివిధ దళాలకు సంఘీభావంగా స్థానిక విశ్వనాథపురం ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పెద్దబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అత్యంత కిరాతకంగా 26 మందిని పొట్టనబెట్టుకున్న పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు ఆపరేషన్ సిందూర్‌తో గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. ర్యాలీలో విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు, విశ్రాంత ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24న మెప్మా ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

ఒంగోలు కార్పొరేషన్, మే 22 (ఆందరజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు సంఘాలలోని సభ్యులైన వారి పిల్లల కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ పి.శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీన ఒంగోలు నగరం మంగమూరురోడ్ జంక్షన్‌లోని నాగార్జున డిగ్రీ కాలేజీలో ఉదయం 9గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందని, 35కి పైగా పేరున్న సాఫ్ట్‌వేర్ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. అలాగే ఐటీ, ఫార్మసీ, ప్రొడక్షన్, మ్యానుఫ్యాక్చరింగ్, పలు కంపెనీలలో ఉద్యోగాలకు జరిగిన ఇంటర్వ్యూలకు జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన సంఘ సభ్యుల పిల్లలు హాజరుకావాలని కోరారు. అలాగే పొదుపు మహిళలకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు మంజూరు చేసిన రాపిడో బైక్‌ల పంపిణీ, మెప్మాబజార్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి


మార్కాపురంలో చందన అలంకరణలో ఆంజనేయుడు


గిద్దలూరులో, కొండపేటలో పూజలు అందుకున్న ఆంజనేయస్వామి


వైపాలెంలో ప్రత్యేక అలంకరణలో ప్రసనాంజనేయస్వామి మూలవిరాట్

మార్కాపురం వన్‌టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ జయంతి మహోత్సవాలు పట్టణంలో గురువారం వైభవంగా నిర్వహించారు. నాగులపుట్ట వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చైతన్యకుమార్ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం, విశేష అలంకారం, అర్చన నిర్వహించారు. చందన అలంకారంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సువర్చల సమేత ఆంజనేయ స్వామికి కల్యాణం జరిపించారు. అన్నసంతర్పణ నిర్వహించి స్వామికి నగరోత్సవం నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు ఇమ్మడి కాశీనాథ్, దేవస్థానం కమిటీ అధ్యక్షులు కాశీరామ్‌సింగ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్, కోశాధికారి రామడుగు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.తర్లుపాడురోడ్డు, మార్కెట్ యార్డు, నాగులవరం రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయాలలో హనుమత్ జయంతి మహోత్సవాలు నిర్వహించారు.

గిద్దలూరు : గ్రామగ్రామాన హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆంజనేయస్వామి దేవాలయాలు, రామాలయాలు భక్తుల రాకతో కిటకటలాడాయి. ఆంజనేయస్వామికి ఆకు పూజలు, అభిషేకాలు, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకాన్ని పంచిపెట్టారు. చాలా దేవాలయాల ఆవరణలో దాతల సహకారంతో భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని రేడియోబావి సెంటర్ వద్ద శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది. తిమ్మాపురం, గిద్దలూరులోని ఆదర్శ బీఈడీ కళాశాల ఆవరణలో గల అత్యంత ఎత్తైన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. రాచర్లగేటు సెంటర్‌లో గల పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో కొత్తపల్లి, కొండపేట, కేఎస్‌పల్లి, పొదలకొండపల్లి, సంజీవరాయునిపేట తదితర గ్రామాల్లో హనుమత్ జయంతిని నిర్వహించారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లోని ఆంజనేయస్వామి, రామాలయాలలో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గుండ్లకమ్మ నది ఒడ్డున వెలసిన గండి వీరాంజనేయస్వామి, శ్రీకాలంగి ఆంజనేయస్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రా మాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలలో భక్తు లు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే అన్ని దేవాలయాల్లో ఆంజనేయస్వామికి అభిషేకాలు, సహస్ర నామావళి, అర్చన అనంతరం హనుమాన్ చాలీసా పఠనం చేశారు.

బేస్తవారపేట : హనుమత్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దరగా గ్రామ సమీపంలోని శ్రీఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

మార్కాపురం రూరల్ : బొడిచెర్ల, చింతగుంట్ల, యల్‌బీఎస్‌నగర్, పట్టణ సమీపంలోని గుండ్లకమ్మ నది వద్ద వెలసిన ఆలయాలలో గురువారం వైభవంగా హనుమత్ జయంతిని నిర్వహించారు. సాయంత్రం ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పొదిలి : హనుమాన్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

తర్లుపాడు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి, సీతానాగులవరం, తర్లుపాడులో హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. చెన్నారెడ్డిపల్లెలో వీరాంజనేయస్వామి దేవాలయం పక్కన నిర్మించిన రేకుల షెడ్డును విజయవాడ కోఆపరేటివ్ ఎండీ తాడేపల్లి ఆదిత్య ప్రారంభించారు. పక్కన నూతనంగా ఏర్పాటు చేస్తున్న కల్యాణ మండపంలో కూడా ఒక రూమ్‌ను ప్రారంభించారు.

పెద్దారవీడు : అన్ని గ్రామాలలో హనుమత్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దారవీడు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆలయ ప్రధానార్చకుడు మేడవరం రాఘవేంద్ర శర్మ స్వామి వారికి ప్రత్యేకంగా పూలమాలలో అలంకరించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేశారు.

ఎర్రగొండపాలెం రూరల్ : పలు ఆలయాల్లో హనుమాన్ జయంతిని వైభ వంగా నిర్వహించారు. దద్దనాల ఆంజనేయ స్వామి, మిల్లంపల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పెద్ద దోర్నాల : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కొలువైన ఆంజనేయస్వామికి, ఐనముక్కల శ్రీ అభయాంజనేయ స్వామికి, తిమ్మాపురం, మోట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో, ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనీ పుత్రుడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎర్రగొండపాలెం : సువర్చలా సహిత ప్రసనాంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమత్ వ్రతంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

పుల్లలచెరువు : పుల్లలచెరువు చౌటపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. చాపలమడుగు, కోమరోలు, చెన్నంపల్లి, ఉమ్మడివరం, ముటుకుల గ్రామాల్లో హనుమత్ జయంతిని నిర్వహించారు.

వానొస్తే అవస్థలే..!

- కుంటలను తలపిస్తున్న ప్రధాన రోడ్లు
- ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు


ఆర్టీసీ బస్టాండ్ సెంటరగేట్ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

పొదిలి, మే 22 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు చిన్నకుంటలను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా మట్టి ఎత్తుగా పోయడంతో వాన కురిస్తే రహదారులు కుంటలుగా మారుతున్నాయి. బుధవారం రాత్రి కురిసిన భారీ వానతో గురువారం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రిలయన్స్ స్మార్ట్ పాయింట్, అంనేయ స్వామి దేవాలయం వద్ద, ఆర్టీసీ సెంటర్ గేట్, పాతపోస్టాఫీస్, పాత పంచాయతీ కార్యాలయం ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి ఉంది. మార్కాపురం అడ్డరోడ్డు నుంచి విశ్వనాథపురం, ఆర్టీసీ బస్టాండ్, పెద్దబస్టాండ్, చిన్నబస్టాండ్, మర్రిపూడి అడ్డరోడ్డు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా షాపుల ముందు ఎత్తుగా మట్టి పోయడంతో వాన నీరు రోడ్డుపో ప్రవహిస్తోంది. దీంతో రోడ్లకు మరమ్మతులు చేసినా కొద్ది రోజులకే మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా నగరపంచాయతీ అధికారులు ప్రధాన రహదారికి ఇరువైపులా ఎత్తుగా ఉన్న మట్టిని తొలగించి వాన నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర పరిస్థితి


రిలయన్స్ స్మార్ట్ పాయింట్ వద్ద కుంటను తలపిస్తున్న రోడ్డు

ముఖాముఖి

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

సునీత, ఎంపీడీవో, ముండ్లమూరు



ప్రశ్న: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మండలంలోని 52 ఆవాసాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ కార్యదర్శుల ద్వారా నివేదికలు తెప్పించుకొని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు వివరించి నీటి ఎద్దడి లేకుండా చేస్తున్నాం.

ప్ర: పారిశుధ్యంపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జ: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ఎస్‌డబ్ల్యూ షెడ్లు(డంపింగ్ యార్డులు) ద్వారా చెత్త సేకరించి ఆ చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీల అభివృద్ధికి వినియోగిస్తున్నాం. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: అభివృద్ధి పనులు చేపట్టారా?

జ: పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులు రూ.3.50 కోట్లతో పల్లె పండుగ ద్వారా సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాం. గోకుల షెడ్లు, సేద్యపు నీటి కుంటలు, నీటితొట్లు మంజూరు చేయించాం.

ప్ర: మండలంలో కూలీలు వలస వెళ్లకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: కూలీలు వలస వెళ్లకుండా ఉండేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా రోజూ ఆరువేల మందికి తగ్గకుండా ఉపాధి పనులు కల్పిస్తున్నాం. రానున్న రోజుల్లో ఆ సంఖ్య పది వేలకు పెంచుతాం.

యోగాతో మానసిక ప్రశాంతత

కురిచేడు, మే 22(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎంపీడీవో సతీష్ కుమార్ సూచించారు. యోగా ఆరోగ్యానికి మంచిదన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల స్థాయి ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు యోగా చేశారు. నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభించడమే కాక శారీరక రుగ్మతలు దూరమవుతాయని ఎంపీడీవో పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

వెలిగండ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మరపగుంట్ల గ్రామ పంచాయతీలో షాపు యజమానులకు, గ్రామస్థులకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా, నారసంచులు వాడాలన్నారు. దుకాణదారులకు కరపత్రాలు పంపిణీచేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, ముత్తిరెడ్డి వెంకటరెడి, తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరించిన విత్తనాలనే విక్రయించాలి

తాళ్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు లైసెన్స్ డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి బిప్రసాదరావు తెలిపారు. గురువారం తూర్పుగంగవరంలోని బాలాజీ సీడ్స్‌ను ఆయన పరిశీలించారు. విత్తన దుకాణదారులు ధ్రువీకరించిన విత్తనాలనే విక్రయించాలన్నారు. రైతులు తప్పనిసరిగా తాము కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదులు పొంది సీజన్ పూర్తయ్యేవరకు తమవద్ద భద్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో అనుమతులు లేకుండా ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుట్టుగా గుట్కా విక్రయాలు

తాళ్లూరు,మే 22(ఆంధ్రజ్యోతి): తాళ్లూ రు ప్రాంతంలో నిషేధిత గుట్కా ప్యాకెట్ల వ్యాపారం గుట్టుగా సాగుతున్నది. గుట్కా, రాజా ఖైనీ తదితర గుట్కా ఆధారిత పదార్థాలు నమలటం వల్ల నోటి క్యాన్సర్, లివర్ సంబంధించిన వ్యాధులు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మండల కేంద్రమైన తాళ్లూరు, వ్యాపార కేంద్రమైన తూర్పు గంగవరం గ్రామాల్లో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతున్నది. గతంలో దాడులు చేసి గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిషేధిత గుట్కాలు అమ్మవద్దని పోలీసులు హెచ్చరికలు చేయటంతో కొంత మేర తగ్గినట్లు కన్పించినా గత కొంత కాలంగా వ్యాపారం జోరుగా సాగుతున్నది.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి

ముండ్లమూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ కమలాకర్ అన్నారు. గురువారం ముండ్లమూరులో వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు నివారణ కోసమే ప్రతిరోజు వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు నిల్

- ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్న అధికారులు

దర్శి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఏళ్లు గడుస్తున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏకారణం చేతనో ఉన్నతాధికారులు సైతం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక పంచాయతీల్లో ఎలాంటి పనులు చేయకుండానే అడ్డగోలుగా నిధుల డ్రా చేసుకున్నారు. చేపల చెరువుల పాటల ద్వారా వచ్చిన నిధులను కూడా స్వాహా చేశారు. అప్పటి వైసీపీ నాయకుల అండదండలతో స్థానిక అధికారులు అక్రమాలకు సహకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కులపై కొరడా ఝులిపిస్తారని భావించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. గ్రామస్థుల ఫిర్యాదుల మేరకు రాజంపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్టు విచారణలో తేలటంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేశారు. అయితే, అక్రమాల్లో కీలకపాత్ర పోషించిన పంచాయతీ కార్యదర్శులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

తూర్పువెంకటాపురం పంచాయతీలో రూ.25 లక్షల నిధులు ఎలాంటి పనులు చేయకుండా డ్రా చేసుకున్నారని కొంతమంది గ్రామస్థులు నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనేకసార్లు మీ కోసం కార్యక్రమాల్లో వివరాలతో ఫిర్యాదులు అందజేశారు. జముకులదిన్నె, సామంతపూడి, తూర్పువీరాయపాలెం, కొత్తపల్లి తదితర పంచాయతీల్లోనూ నిధుల దుర్వినియోగమైనట్టు గతంలో ఫిర్యాదులు అందాయి. అప్పటి వైసీపీ నాయకులు ఒక పంచాయతీ కార్యదర్శిని నాలుగు పంచా యతీలకు ఇన్‌చార్జ్‌గా వేసుకొని పనులు చేయకుండా అడ్డగోలుగా నిధులను డ్రా చేసుకున్నట్లు విమర్శలు వచ్చాయి. గ్రామస్థుల ఫిర్యాదుల మేరకు కొన్ని పంచాయతీలకు అప్పటి డీఎల్‌పీవోను విచారణ అధికారిగా నియమించారు. ఆ అధికారి బదిలీ అయినప్పటికీ విచారణ నేటికీ పూర్తి కాలేదు. కొన్ని పంచాయతీల్లో జరిగిన అక్రమాలపై ఇప్పటివరకు విచారణ జరగలేదు. కాలం గడిచేకొద్దీ ఈ అక్రమాలు మరుగున పడిపోతున్నాయి.

పంచాయతీల్లో దుర్వినియోగమైన లక్షలాది రూపాయలు డ్రా చేసుకున్న అధికారులు హాయిగా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇంత జరిగినా అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత రాష్ట్రంలో అనేక కుంభకోణాలపై విచారణ కమిటీలు వేశారు. పంచాయతీల్లో జరిగిన అక్రమాలపై పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గతంలో జరిగిన లావాదేవీల రికార్డులను పరిశీలిస్తే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంటుంది. అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తే భవిష్యత్తులో ఇదే పరిస్థితి పునరావృతం అవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా అధికారులు విచారణ కమిటీ వేసి అక్రమాలు నిగ్గుతేల్చి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శిథిలావస్థలో పోలీస్‌స్టేషన్ భవనం

- పెచ్చులూడుతున్న శ్లాబ్
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



దొనకొండ పోలీస్‌స్టేషన్ భవనం

దొనకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరింది. తరచూ భవనం పైకప్పు శ్లాబు పెచ్చులూడుతుంది. దీంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రజల రక్షణ కోసం పాటుపడే రక్షకులకు కనీస భద్రత కరువైంది. దొనకొండ పోలీస్‌స్టేషన్ చూసేందుకు బాగుందనిపించినా లోపల పెచ్చులూడుతూ ప్రమాదకరంగా ఉంది. వరండాలో ఒకవైపు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు పోలీస్ సిబ్బంది, ప్రజలు కూర్చునేందుకు టేబుల్, కుర్చీలను గతంలో ఏర్పాటుచేశారు. ఆవైపు తరచూ శ్లాబు పెచ్చులూడిపడుతుంది. చిన్న వర్షం కురిస్తే శ్లాబు కారుతూ పెచ్చులూడి పడుతుంది. పలు సందర్భాల్లో పోలీస్ సిబ్బంది శ్లాబు పెచ్చులూడే సమయంలో త్రుటిలో తప్పించుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. భవనంలోని మిగిలిన గదుల్లోనూ అదే పరిస్థితి ఉంది.

దొనకొండలో 2013లో నూతన పోలీస్ స్టేషన్ భవనం నిర్మించారు. నిర్మాణాల లోపమో ఏమో తెలియదు కానీ ఇక్కడ పని చేస్తున్న సిబ్బంది మాత్రం నిత్యం జాగ్రత్తగా నడుచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజల రక్షణ కోసం నిత్యం సేవలందించే పోలీసులకే రక్షణ కరువైందని, ఏ నిమిషంలో ప్రమాదం వచ్చి పడుతోందన్న భయాందోళన పోలీస్ సిబ్బందిలో నెలకొంది. కొత్త పోలీస్ స్టేషన్ భవనం కన్నా పాత పోలీస్‌స్టేషన్ భవనమే పటిష్టంగా ఉందని పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చిన ప్రజలు చర్చించుకుంటుంటారు. ఏది ఏమైనా తరచూ భవనం పైకప్పు శ్లాబు పెచ్చులూడిపడుతూ ఇటు పోలీస్ సిబ్బందికి, అటు ప్రజలకు ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపడితే ఎంతో శ్రేయస్కరమని ప్రజలు భావిస్తున్నారు.


పెచ్చులూడుతున్న శ్లాబు

వైభవంగా హనుమజ్జయంతి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆంజనేయస్వామి దేవాలయాలలో విశేష అర్చనలు జరిగాయి. స్వామివారికి ఎంతో ఇష్టమైన సింధూరంతో కొన్ని దేవాలయాలలో పూజలు నిర్వహించారు. వేంపాడులోని అంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. పొంగళ్ళు పెట్టి స్వామికి వారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పెదరావిపాడు, ముండ్లమూరు, పసుపుగల్లు, శంకరాపురం, పోలవరం, మారెళ్ళ, మక్కెనవారిపాలెం, ఈదర, బొప్పూడివారిపాలెం, ఉమామహేశ్వర అగ్రహారం, వేముల, కెల్లంపల్లి, పులిపాడుతో పాటు పలు గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాల్లో ప్రధాన అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దొనకొండలో..

దొనకొండ, మే 22(ఆంధ్రజ్యోతి): దొనకొండలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మారావుపేటలోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి అరబస్టాన్‌లోని రామాలయం, అడ్డరోడ్డులోని బ్రహ్మేంద్ర స్వామి దేవాలయం, శ్రీ విజయాంజనేయస్వామి దేవాలయం, కనకదుర్గమ్మ తదితర దేవాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవాలయాల వద్ద అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ త్యాగరాజు తన సిబ్బందితో ప్రారంభం నుండి ముగింపు వరకు బందోబస్తు నిర్వహించారు. అడ్డరోడ్డులోని ఆనంద ఆశ్రమంలోని బ్రహ్మేంద్రస్వామి దేవాలయం వద్ద ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి, శ్రీ వియాంజనేయస్వామి దేవాలయం వద్ద ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి పర్యవేక్షణలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.


దొనకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

పామూరులో..

పామూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో హనుమాన్ జయంత్యుత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. పామూరులో విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో స్థానిక మదన వేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి ప్రారంభమైన హనుమాన్ శోభాయాత్ర పట్టణ పురవీధుల్లో సాగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో పామూరు, సీఎస్‌పురం ఎస్‌ఐలు టి.కిశోర్‌బాబు, ఆర్.సుమన్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, బి.జయరామిరెడ్డి, బి.నరసింహారావు, పాలపర్తి రమణయ్య, పందిటి హరీష్, ఇర్రి కోటిరెడ్డి, బీజేపీ నాయకులు కేవి రమణయ్య, ఉమ్మడి శ్రీను, జె.చిన సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, డాక్టర్ గద్దె ఏడుకొండలు, పి.ప్రభాకర్‌చౌదరి, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు. సీఎస్‌పురంలో హనమాన్ జయంతి సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.నారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



పామూరు: శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు


కురిచేడు: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

కురిచేడులో..

కురిచేడు, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి వేడుకలు మండలంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆంజనేయ స్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానంగా ఆకుపూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువాం ఘనంగా జరిగాయి. భక్తులు వేకువ జామునుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని మాధవరం, తాళ్లూరు, తూర్పు గంగవరం, సోమవరప్పాడు, విఠలాపురం, బొద్దికూరపాడు, లక్కవరం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హ నుమత్ పారాయణాలు పఠించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీను, టీడీ పీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాచకొండ వెంకట్రావులు శింగరకొండలో అభయాంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.


తాళ్లూరు: మాధవరంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

గ్రాసం లేక మూగజీవాలు విలవిల

పామూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసంలేక మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే అత్యధికులు ఆధారపడి జీవిస్తున్నారు. రోజురోజుకు పశుగ్రాసం ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పాటు కొరత ఏర్పడింది. పామూరు, సీఎస్‌పురం మండలాల్లో 50 వేలకు పైగా గేదెలు, 9 వేలకు పైగా ఆవులు, రెండు లక్షలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. గ్రాసం కొరతతో యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మండిపోతున్న ఎండల ధాటికి పచ్చికబయళ్లు ఎండుముఖం పట్టాయి. అయితే, ఆకతాయిలు నిప్పు పెడుతుండటంతో ఎండుగడ్డి సైతం గగనం అవుతుంది. గతంలో ఎన్నడు లేని విధంగా పశుగ్రాసం ధరలు ఆకాశాన్నండుతున్నాయి. ట్రాక్టరు వరిగడ్డి గతంలో రూ.పది వేలు ఉండగా, నేడు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు ధర పలుకుతున్నది. దర్శి, కురిచేడు, అద్దంకి ప్రాంతాల నుంచి గడ్డిని కొనుగోలుచేసి ట్రాక్టర్లపై తెచ్చుకుంటున్నారు. పాల దిగుబడి సైతం తగ్గుముఖం పడుతుండటంతో పోషణకు అయ్యే పెట్టుబడులు కూడా రావడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గ్రాసంలేక వలసపోతున్న గొర్రెలు


అభయాంజనేయస్వామి ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, నసీర్ తదితరులు

అభయాంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, నసీర్

పీసీపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాపురం సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామిని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్‌లు గురువారం దర్శించుకున్నారు. 36 అడుగుల అభయాంజనేయస్వామి ప్రాంగణంలో హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ కొంపల్లి మాలకొండయ్య ఆహ్వానం మేరకు ఆంజనేయస్వామి జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, నసీర్ అహ్మద్, శాప్ చైర్మన్ రవినాయుడులు ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతరం దేవస్థాన చైర్మన్ మాలకొండయ్య వారిని సత్కరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అభయాంజనేయస్వామిని దర్శించుకున్న వారిలో వెల్ది మాలకొండయ్య, కొంపల్లి మధు, మల్లికార్జున్, గుడే నాగేశ్వరరావు, వడ్డెంపూడి వెంకట్, చెరుకూరి సతీష్, రావి రాజా, ఏనుగంటి సోమయ్య, వేమూరి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

చెత్తసంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

ముండ్లమూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో సునీత అన్నారు. తద్వార వచ్చే ఆదాయంతో మౌలిక వసతులకు ఖర్చు పెట్టడం జరుగుతుందన్నారు. గురువారం మండలంలోని ఈదర, పూరిమెట్ల, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో సచివాలయాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ కార్యాలయాలకు తప్పనిసరిగా హాజరై ప్రజల అవసరాలను తీర్చాలన్నారు.

ఏదైనా సమస్యపై సచివాలయానికి వచ్చేవారిపట్ల నిర్లక్ష్యం వహించకుండా సమాధానం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఈదరలోని డంపింగ్ యార్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జె.శ్రీనివాసరావు, మధు, సచివాలయ సిబ్బంది రవీంద్ర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు ప్రయోజనం


మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

వెలిగండ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో మట్టిలో పోషకాల స్థాయి తెలుసుకొని అవసరమైన ఎరువులను ఉపయోగించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు రంగాకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని రాళ్ళపల్లి పంచాయతీలో రైతుల పొలాల్లో అధికారులు మట్టి నమూనా సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడటం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేలకు అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి నేల సారవంతం కోల్పోయి చౌడు గుణాలు ఏర్పడతాయన్నారు. మండలంలో ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 668 మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు తెలిపారు

ఎమ్మెల్యేలకు సన్మానం


ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న నిర్వాహకులు

పీసీపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, శాప్ చైర్మన్ రవినాయుడులను 36అడుగుల అభయాంజనేయస్వామి దేవస్థాన చైర్మన్ కొంపల్లి మాలకొండయ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. మూడు రోజులుగా ఆలయ సమీపంలో జరుగుతున్న ఎడ్ల బలప్రదర్శనపోటీలు గురువారం ముగిశాయి.

నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఈ పోటీలను తిలకించేందుకు వచ్చిన ఎమ్మెల్యేలు, శాప్ చైర్మన్‌లకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. సన్మానించిన వారిలో కొంపల్లి మధు, మల్లికార్జున్, మురుగమ్మి ఎంపీటీసీ సతీష్, పోతవరం సర్పంచ్ తనయుడు రాజా, అలవలపాడు మాజీ సర్పంచ్ శ్రీను, కాటన్‌మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలకొండయ్య, సోమయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, రవి తదితరులు ఉన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

దర్శి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా దర్శి పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తదితరులు పూజలు చేశారు. ఆలయ పూజారులు స్వామివారికి అభిషేకం, తమలార్చన, తదితర పూజలు చేశారు. అలాగే, మండలంలోని రాజంపల్లిలో ఆంజనేయస్వామి ఆలయం, వెంకటచలంపల్లిలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటచలంపల్లిలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు.


దర్శిలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు

ఉష్ణోగ్రత (అంచనా) 23-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	26
తెనాలి	37	27
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	26
చీరాల	36	27

వసూళ్లపై.. ఉపేక్ష

- పన్ను బకాయిలు రూ.225.46 కోట్లు
- వసూళ్లపై పుర పాలకులు మీనమేషాలు
- వసూళ్లపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- మున్సిపాల్టీల్లో జీతాల చెల్లింపులకు ఇక్కట్లు



చీరాల మున్సిపల్ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్నుల బకాయిలు పేరుకుపోతున్నాయి. వసూళ్లపై పుర పాలకులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. పన్నుల వసూళ్లపై అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. దీంతో పట్టణాల్లో ప్రగతి కుంటుపడుతోంది. మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరైన పన్నులు సక్రమంగా వసూలు కాకపోతుండటంతో ఉద్యోగుల జీతాల చెల్లింపులకు ఇక్కట్లు నెలకొంటున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న బకాయిలను వసూలు చేయడంలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు న్నాయి. పన్నుల ఆదాయాన్ని పెంచుకుని స్వయం సమృద్ధి సాధించాలన్న ప్రభుత్వ సూచనలను పెడచెవిన పెడుతున్న పరిస్థితులు గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో నెలకొంది. ఆస్తి పన్ను బకాయిలు రూ.225.46 కోట్లు ఉండగా నీటి పన్ను బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఉన్న బకాయిలను వసూలు చేయడంలో యంత్రాంగం అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలు న్నాయి. వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆస్తి పన్ను బకాయిలతో పాటు నీటి పన్ను బకాయిలు కూడా రూ.కోట్లలో పేరుకుపోయాయి. మూడు జిల్లాల్లో రూ.225.46 కోట్లు పన్నుల బకాయిలు ఉంటే ఒక్క గుంటూరు కార్పొరేషన్‌లోనే రూ.174.82 కోట్లు బకాయిలు ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మున్సిపాల్టీలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.3.07 కోట్లు ఉండగా ప్రైవేట్ భవనాల బకాయి రూ.3.77 కోట్లు ఉంది. పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని మున్సిపాల్టీల్లో కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. రూ.వందల కోట్లు పన్ను బకాయిలు పేరుకుపో వడంతో మున్సిపాల్టీలో ప్రగతి పనులు చేపట్టే పరిస్థితులు కానరావడం లేదు. చాలా మున్సిపాల్టీల్లో చేసిన పనులకే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలేదు. దీంతో కొత్తగా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు.

ఏటేటా పెరుగుతోన్న బకాయిలు

పన్ను బకాయిలు ఏటా పెరుగుతున్నాయే తప్ప వసూలవుతున్న దాఖలాలు లేవు. ప్రైవేట్ ఆస్తులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తులకు సంబంధించిన బకాయిలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల బకాయిలు సక్రమంగా వసూలు కావడంలేదు. పల్నాడు జిల్లాలో రూ.21.77 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి రూ.13.87 కోట్లు బకాయిలు ఏళ్ల తరబడి ఉన్నాయి. గుంటూరు జిల్లాలో రూ.193.85 కోట్లు పేరుకుపోయాయి. ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు 152.86 కోట్లు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో ఆస్తి పన్ను 9.84 కోట్లు బకాయిలు ఉండగా ఇందులో ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాలవి రూ.5.78 కోట్లు ఉన్నాయి.

మున్సిపాల్టీల వారీగా బకాయిలు..

మున్సిపాల్టీ	బకాయిలు (రూ.కోట్లలో)
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	7.71
చిలకలూరిపేట	3.56
సత్తెనపల్లి	3.22
పిడుగురాళ్ల	1.86
మాచర్ల	3.16
వినుకొండ	0.89
దాచేపల్లి	0.80
గురజాల	0.57
గుంటూరు జిల్లా	
గుంటూరు కార్పొరేషన్	174.82
మంగళగిరి.. తాడేపల్లి	9.66
తెనాలి	7.98
పొన్నూరు	1.39
బాపట్ల జిల్లా	
చీరాల	4.13
బాపట్ల	3.51
రేపల్లె	1.42
అద్దంకి	0.78

ప్రభుత్వ బకాయిలూ రూ.కోట్లలో..

గుంటూరు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు సంబంధించి రూ.29.21 కోట్లు, కేంద్ర సంస్థలు, కార్యాలయాల బకాయిలు రూ.11.78 కోట్లు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.27 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.3.79 కోట్లు, పల్నాడు జిల్లా పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు సంబంధించి రూ.7.14 కోట్లు బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి రూ.76 లక్షలు బకాయిలు ఉన్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఖాళీ స్థలాల పన్నులపై అలసత్వం

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వేలల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఆయా ఖాళీ స్థలాల పన్నులు ఏళ్లుగా పేరుకుపోయాయి. స్థలాల క్రయవిక్రయాలు జరగడంతో యజమానుల చిరునామాలు లభించని పరిస్థితి. దీంతో ఖాళీ స్థలాల పన్ను వసూళ్లకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌లోనే ఖాళీ స్థలాలకు సంబంధించి రూ.83.94 కోట్లు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి.



వేమూరు మండలం జంపనిలో విశేష అలంకారంలో వీరాంజనేయస్వామి



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి

శ్రీ ఆంజనేయం

వైభవంగా హనుమత్ జయంతి

అంజనీపుత్రుడికి విశేష అభిషేకాలు, పూజలు

బాపట్ల, అద్దంకి, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం. జై హనుమాన్.. జైజై హనుమాన్ అనే భక్తుల నామస్మరణలతో రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలు మారుమోగాయి. హనుమత్ జయంతి వేడుకలు గురువారం జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అలంకారాలు చేశారు. సుందరకాండ హోమాలు చేశారు. తమలపాకులు, ఫలాలతో స్వామివారిని అలంకరించి సహస్ర నామార్చనలు నిర్వహించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల్లో సువర్చలాంజనేయ స్వామి వారి కల్యాణోత్సవాలు, అన్నసంతర్పణలు జరిగాయి.

శింగరకొండలో హనుమజ్జయంతి శోభ

హనుమజ్జయంతి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండకు భక్తులు పోటెత్తారు. ఈవో తిమ్మానాయుడు, రుషిత దంపతులు, రాతి మండప దాతలు ఆలయంలో విశేష పూజలు చేశారు. బాపట్ల చీలురోడ్డులోని రుక్మిణీ సమేత పాండురంగాస్వామివారి దేవాలయ ప్రాంగణంలో స్వామివారికి సింధూర్చాన, నాగవల్లి దళసహిత విశేష లక్షపత్రి పూజలు నిర్వహించారు. అమృతలూరులోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అంకురార్పణ, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలతోపాటు వివిధ ఫలాలతో పంచామృత స్నపన, నాగవల్లీదళ సహస్రనామార్చ, పూజలు జరిపారు. కొల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో భజన బృందాలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.



మణికేశ్వరం సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ అంచున ముంపు భూములలో ఉన్న చేపల చెరువులు



రిజర్వాయర్ నీటిని చెరువులకు పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన మోటార్, పైపు



చేపల చెరువులలో నీటిపై తేలియాడుతున్న కోళ్ల వ్యర్థాల ఆనవాళ్లు

గుండ్లకమ్మలో.. చేపల చెరువులు

- రిజర్వాయర్‌లోకి కలుషిత నీరు
- ఆ నీటినే తాగునీరుగా గ్రామాలకు సరఫరా
- చెరువుల వద్దనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

అద్దంకి, మే 22 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ రిజర్వాయరు వెనుక వైపు ముప్పు భూములు అక్రమ చెరువులకు అడ్డాగా మారాయి. దీనికితోడు ఆ చెరువుల్లో చేపలను కోళ్ల వ్యర్థాలతో పెంచుతు న్నారు. చేపల చెరువుల నుంచి వచ్చే వ్యర్థాల నీటితో రిజర్వాయర్ నీరు కలుషితం అవుతోంది. రిజర్వా యర్ నిర్మాణ సమయంలో ముంపు భూముల్లోని రైతులకు అప్పట్లో ప్రభుత్వం పరిహారం చెల్లించింది. అయినా 15 ఏళ్లుగా రైతులు తమ ఆధీనంలోనే ఆ భూములను ఉంచుకుని ఏకంగా చెరువులు తవ్వి చేపల పెంపకం చేపడుతున్నారు. ఎక్కువ పరిహారం కోసం అప్పట్లో కొరిశపాడు మండలం అనమనమూరులో పలువురు రైతులు చేపల చెరువులు తవ్వారని ఆరోపణలున్నాయి. మణికేశ్వరం, మోదేపల్లి తదితర గ్రామాల రైతులు పొలాలను చేపల చెరువులుగా మార్చారు. కోళ్లమాంసం నుంచి వచ్చే వ్యర్థాలను చేపల పెంకానికి వినియోగిస్తుండటంతో నీరు దుర్వాసన వెదజల్లుతోంది. ఆ నీటినే రిజర్వాయర్‌లోకి వదులుతున్నారు. దీంతో రిజర్వాయర్ నీరు మొత్తం కలుషితంగా మారుతోంది. రంగు మారిన నీటిని మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొరిశపాడు, పంగులూరు, అద్దంకి మండలాలలోని పలు గ్రామాలకు సరఫరా చేయడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువులోకి కూడా చేపల చెరువుల నుంచి కలుషిత నీటిని వదులుతున్నారు. రిజర్వాయర్ నీటిని చేపల చెరువులకు అక్రమంగా పంపింగ్ చేస్తున్నారు. నీటి పంపింగ్‌కు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేపల చెరువుల వద్ద ఏకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశారు. చేపల చెరువులు ఏర్పాటుతో పొలాల్లో పంట సాగుచేయలేక నష్టపోవాల్సి వస్తోందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుండ్లకమ్మ రిజర్వాయర్, భవనాసి చెరువుల నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతోనే అపరిశుభ్రత

వచ్చే నెల 21 తర్వాత రోడ్లపై చెత్త కనిపిస్తే చర్యలు

కలెక్టర్ మురళి



కలెక్టర్ వెంకటమురళిని దుశ్శాలువాలతో సన్మానిస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులు

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలి

బాపట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, గ్రామాల పరిశుభ్రతపై ఓ కన్వెన్షన్ హాలులో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందన్నారు. గ్రీన్ అంబాసిడర్లు, కార్యదర్శులు, పంచాయతీ అధికారులు నిర్లిప్తంగా వ్యవహరించడంతోనే గ్రామాలు అపరిశుభ్రంగా మారాయని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల రహదార్లు, శ్మశానాలు, వీధులు చెత్తతో దుర్గంధం వెదజల్లుతున్నాయన్నారు. జూన్ 21 తర్వాత గ్రామాల్లోని రహదార్ల వెంట చెత్త కనిపిస్తే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవర్నీ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. చెరువుల్లో చెత్తవేయడం, ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. చెత్తసంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించడం ద్వారా ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వాహణ, మౌలిక సదుపాయల కల్పన బాధ్యత ఎంపీడీవోలదేనన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాలో 459 పంచాయతీలు ఉండగా 367 పంచాయతీలకు చెత్తసంపద కేంద్రాలు ఉన్నాయని డీపీవో ప్రభాకర్ తెలిపారు. 1,673 క్లాప్ మిత్రలు కావాల్సి ఉండగా ప్రస్తుతం 1,344 మంది పనిచేస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు.. షురూ

- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ
- సంఘాల కార్యాలయాల్లోనూ సహకారం
- సాంకేతిక సమస్యలపై సంఘాల ఆందోళన
- ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్న గుంటూరు డీఈవో



బదిలీలు, పదోన్నతుల కోసం ఏపీటీఎఫ్ కార్యాలయంలోని కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు ప్రక్రియ గురువారం సజావుగా ప్రారంభమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉండగా క్యాడర్ల వారీగా పలువురు బదిలీలకు, ఉద్యోగోన్నతులకు దరఖాస్తుకు సిద్ధమయ్యారు. ఈ నెల 21 నుంచి 22 వరకు ప్రధానోపాధ్యాయులకు, 21 నుంచి 24 వరకు స్కూల్ అసిస్టెంట్లకు, 21 నుంచి 27వ తేదీ వరకు ఎస్జీటీలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించింది. దీంతో గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ వేగవంతమైంది. ఇందు కోసం విద్యాశాఖ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. విద్యాశాఖ కార్యాలయంలోని ఐటీ సెల్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికంగా వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు కూడా తమ కార్యాలయాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో బదిలీల ప్రక్రియ కోసం ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారా లను అందిస్తున్నాయి. ఏపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్ కార్యాలయాల్లో దరఖాస్తులు అప్‌లోడులో తలెత్తే సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. దరఖాస్తుల అప్‌లోడు ప్రక్రియలో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తు న్నాయి. ప్రధానంగా రెండు డీఎస్సీలలో ఎంపికైన ఉపాధ్యాయులకు సర్వీస్ రికార్డు సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక సర్వీస్‌ను మాత్రమే సాఫ్ట్‌వేర్ పరిగణనలోకి తీసుకుం టున్నట్లు చెబుతున్నారు. డేటాఫ్ జాయినింగ్ విషయంలో కొంత మందికి ఒక రోజు తక్కువగా చూపుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దరఖాస్తు చేసే వారిలో కొంతమందికి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ ఉంటే సాఫ్ట్‌వేర్‌లో మ్యాథ్స్‌గా చూపుతున్నట్లు చెబుతున్నారు. రీ అపోర్షన్మెంట్ పాయింట్స్ రావడంలేదని, రిక్వెస్ట్ బదిలీ వారికి కంపల్సరీ బదిలీ అని వస్తున్నట్లు పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆయా సాంకేతిక సమస్యలను ఎ ప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని గుంటూరు డీఈవో రేణుక స్పష్టం చేశారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లపై కార్యాచరణ

- 24న రైతులతో మంత్రుల బృందం ముఖాముఖి
- ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో మంత్రుల ఉపసంఘం భేటీ
- క్షేత్ర స్థాయిలో అచ్చెన్నాయుడు, నిమ్మల, గొట్టిపాటి, డోలా, ఏలూరి పర్యటన

పర్చూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రైతులను అదుకునేందుకు వారి వద్ద ఉన్న నిల్వలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది. మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడుతో ప్రభుత్వం మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. దీనిలో భాగంగా ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి మంత్రుల బృందం రానున్నది. మంత్రులతోపాటు, పలువురు ఎమ్మెల్యేలు, వ్యవసాయశాఖ అధికారులు, మార్క్‌ఫెడ్, పొగాకు బోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కానున్నారు. మంత్రులు అధికారులు, కంపెనీ ప్రతినిధులతో చర్చించాక కొనుగోళ్లపై కార్యాచణ ప్రణాళిక రూపొందించనున్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు ప్రణాళిక : ఎమ్మెల్యే

ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా రైతుల మేలు కోరుతూ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతుల వద్ద ఎంతమేర బర్లీ పొగాకు ఉంది అన్న అంశంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.



రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్‌ఫోటో)

అవీ..ఇవీ..

బర్లీ పొగాకు నిల్వల నమోదు

● ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం



వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

యద్దనపూడి, (మార్టూరు) మే22 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలో బుధవారం సాయంత్రం నుంచి రైతుల ఇంట నిల్వ ఉంచిన పొగాకు పంటను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రాల సిబ్బంది నమోదు చేస్తున్నారు. మండలంలో పొగాకు సాగు చేసిన రైతులు పండించిన పంటను అమ్ముకోలేక, కొనుగోలు చేసే నాథుడే లేక దిగాలు పడిపోయారు. పంటసాగు కోసం పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు చెల్లించలేక రైతు కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పొగాకు మండెలు కట్టాలని, వాటిని కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రైవేటు కంపెనీల వారు చివరి క్షణంలో కొనుగోలు చేయకుండా ముఖం చాటేస్తున్నారు. దీంతో ఇటీవల యద్దనపూడి గ్రామంలో ఒక రైతు పురుగుమందు డబ్బాతో ఆత్మహత్యకు యత్నించారు. అయితే వివిధ ప్రైవేటు కంపెనీలు వారు పొగాకును రైతులు దగ్గర కొనుగోలు చేశామని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాయి. కాని క్షేత్రస్థాయిలో రైతుల ఇంట అమ్ముడుపోని పొగాకు మండెలు భారీగా ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు ఏవో ఎస్.మేరమ్మ గ్రామాలలోని రైతులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది సహకారంతో పొగాకును పండించిన ప్రతి రైతు ఇంటి వద్దకు వెళ్లి వారి వద్ద ఉన్న పొగాకు నిల్వలను నమోదు చేస్తున్నారు. మండలంలో దాదాపుగా 2500 మంది రైతులు 8 వేల ఎకరాలలో పొగాకును సాగు చేశారు. పండించిన పంట అంతా దాదాపు రైతుల వద్దే ఉంది. శుక్రవారం నాటికి పూర్తి స్థాయిలో పొగాకు నిల్వల నమోదు పూర్తవుతుందని వ్యవసాయ అధికారి ఎస్ మేరమ్మ తెలిపారు.

చినగంజాం : మండలంలోని గొనసపూడి, సంతరావూరు ప్రాంతాల్లోని బర్లీ పొగాకు మండెలను వ్యవసాయాధికారులు, టీడీపీ నాయకులు గురువారం పరిశీలించారు. పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు టెలీకాన్ఫరెన్స్ ద్వారా చేసిన సూచనలు మేరకు గొనసపూడి, సంతరావూరు గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న పొగాకు మండెలను పరిశీలించినట్లు ఏఈవో కే.భాస్కరరావు తెలిపారు. గ్రామాల్లో పొగాకు వేసిన రైతుల వద్ద ఎంత మేరకు నిల్వ ఉందో ప్రభుత్వం వారు ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, టీడీపీ నాయకులు ఏ.సురేష్, దేవతోటి నాగరాజు, గ్రామ వ్యవసాయసహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : నల్లబర్లీ సాగుచేసిన పొగాకు రైతుల వివరాలను రైతుసేవా కేంద్రం సిబ్బంది ద్వారా నమోదు చేయిస్తున్నట్లు ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని నూజెళ్లపళ్ళి, మల్లవరం గ్రామాలలో గురువారం ఆయన పర్యటించారు. నల్లబర్లీ పంట సాగుచేసి ఇంకా పంటను విక్రయించని రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సాగుదారులు రైతుసేవాకేంద్ర సిబ్బందిని కలసి ఆధార్‌కార్డు, రైతుపేరు, ఫోన్ నంబరు, సాగు చేసిన విస్తీర్ణం, వచ్చిన దిగుబడి, అమ్మకంతో పాటు నిల్వ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పొగాకు మండెల ఫోటోలు యాప్‌లో తీయించాలన్నారు.

పర్చూరు :పొగాకు రైతుల వద్ద ఉన్న నిల్వలు, సాగు విస్తీర్ణం తదితర అంశాల వివరాల సేకరణలో వ్యవసాయాధికారులు ఉన్నారు. పొగాకు రైతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ఆదేశాలు జారీచేసింది. ఈప్రక్రియను మూడు రోజుల్లో పూర్తిచేసే విధంగా నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఆయా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నేతృత్వంలో వివరాలు సేకరించాలని పేర్కొంది. దీంతో యుద్ధ ప్రాతిపతికన నేరుగా అధికారులు రైతుల నివాసాల వద్దకు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

బల్లికురవ : ఈ ఏడాది నల బర్లి పొగాకు సాగు చేసి ఇంత వరకు అమ్మని రైతులు వెంటనే తమ వద్ద ఉన్న పొగాకు నిల్వల వివరాలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని ఏవో కుమారి సూచించారు. గురువారం మండలంలోని వేమవరం గ్రామంలో నల్లబర్లి పొగాకు పంటనిల్వలను ఆమె పరిశీలించారు. అనంతరం రైతులతో ఆమె మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న పొగాకు వివరాలను ప్రత్యేక యాప్‌లో ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. త్వరలో రైతుల వద్ద బర్లి పొగాకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాల సిబ్బందిని రైతులు పొగాకు చెక్కుల వద్దకు తీసుకు వెళ్లి పూర్తి వివరాలను శుక్రవారం సాయంత్రం లోపు తెలియజేయాలన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టండి

● మినీ మహానాడులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపు ● నియోజకవర్గ అభివృద్ధికి 23 తీర్మానాలు ఆమోదం

అద్దంకి,మే22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, సోషల్ మీడియా చేస్తున్న అసత్య ప్రచారాలను టీడీపీ కేడర్ తిప్పికొట్టాలని, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. అద్దంకిలో గురువారం నిర్వహించిన మినీ మహానాడులో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నాయకులు దోచుకోవడంతో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కు పోయిందన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం నుంచి టీడీపీ పుట్టిందన్నారు. టీడీపీ ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు. దేశంలో మొదటగా నదుల అనుసందానం చేసింది చంద్రబాబునాయుడే అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం సమప్రాధాన్యత ఇస్తుందన్నారు. వైసీపీ పాలనలో రోడ్డుపై పడిన గుంతలను కూడా పూడ్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తామన్నారు. గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాల కోసం వైసీపీ నేతలు గేట్లు విరగగొట్టారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిధులు మంజూరు చేసి మరమ్మతుల చేపట్టిందన్నారు. అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లా పరిధిలో చేరుతాయన్నారు. నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు త్వరలో గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు చెల్లించకుండా వదిలివేసిన 2 వేల కోట్ల రూపాయలను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించిందన్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోనే రైతుల ఖాతాలలో నగదు జమ చేస్తోందన్నారు. బర్లీ పొగాకు కొనుగోలు కు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌తో తెలుగు ప్రజలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఐటీని అభివృద్ధి చేసి తెలుగు ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు చంద్రబాబునాయుడు కృషి చేశారన్నారు. పేదరికం నిర్మూలనకు చం ద్రబాబునాయుడు పీ-4 విధానం అమలులోనికి తెచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేల్లపోలు రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, జయకృష్ణ, రావూరి రమేష్, టీడీపీ నేతలు బత్తుల రామకోటయ్య, మన్నెం ఏడుకొండలు, పరమేష్, కాకాని అశోక్, కుందారపు రామారావు, మానం మురళీమోహన్‌దాస్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, మన్నం త్రిమూర్తులు, సందిరెడ్డి శ్రీనివాసరావు, మనోహరమ్మ, మద్దిరాల గంగాధర్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, గోవాడ శ్రీకాంత్, అత్తులూరి రమేష్, చింతల సహదేవుడు,పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏడాది కాలం లో మృతి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, యుద్ధం లో అమరులైన సైనికులకు నివాళులు అర్పించారు.



మినీమహానాడులో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్



మహానాడులో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

23 తీర్మానాలు ఆమోదం

మినీ మహానాడు లో మొత్తం 23 తీర్మానాలు ఆమోదించారు. భవనాసి, కోరిశపాడు రిజర్వాయర్ పనులు పూర్తి చేయడం, శింగరకొండ ను పర్యాటకంగా అభివృద్ధి చేయడం, అద్దంకిని ప్రకాశం జిల్లాలో చేర్చడం, అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా చేయడం, డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు, వంద పడకల వైద్యశాల నిర్మాణం, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, టిడ్కో ఇళ్ల పూర్తి చేయడం, గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు వాసుల సమస్యల పరిష్కారం, పునరావాస కాలనీలలో వసతుల కల్పన, అద్దంకి పోస్టాఫీస్ అభివృద్ధి చేసి పాస్‌పోర్టు సేవలు అందుబాటులోకి తీసుకురావడం, పలు రోడ్లను డబుల్ రోడ్లు గా అభివృద్ధి చేయాలని తీర్మానాలు ప్రవేశపెట్టగా ఆమోదించారు.

దాతల తోడ్పాటుతో పేదలకు సాయం

● 150మంది చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు ●100 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అద్దంకి, మే22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు దాతలు, పరిశ్రమల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావడంతో పేద ప్రజల కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి మరింత దోహద పడుతుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలో మొత్తం 380 మంది చిరు, వీధి వ్యాపారులను గుర్తించి గురువారం 150 మందికి సింథైట్, గ్రీన్‌కో గ్రూప్ కంపెనీల సహకారంతో అసిస్ట్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణ ప్రసాద్‌లు పంపిణీ చేశారు. మిగిలిన 230 మందికి నెల రోజులలోపు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో అద్దంకి నియోజకవర్గంలో విద్యార్థినుల కోసం సైకిళ్లు, దివ్యాంగులకు మూడు చ క్రాల స్కూటీలు పలు గ్రామాలలో కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపడతామన్నారు. అద్దంకి నియోజకవర్గంలో అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎంపీ కృష్ణప్రసాద్ అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గంలో దాతల సహకారంతో పేద కుటుంబాల అభివృద్ధికి తోడ్పాటు అందించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో 100 మందికి రూ.60.55 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి రవికుమార్ అందజేశారు. కార్యక్రమాలలో సింథైట్ జనరల్ మేనేజర్ రామాంజనేయులు, సలాం, ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బర్లీ రైతులకు అండగా రాష్ట్రప్రభుత్వం

● రేపు మార్టూరుకు ముగ్గురు మంత్రులు రాక

● సిఎం చంద్రబాబు సమీక్ష, ఆదేశాలు

● ఫలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి కృషి

ఒంగోలు, మే 22 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు రైతులకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఆమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం సమస్యపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. రైతులతో మాట్లాడి పరిష్కారానికి స్పష్టమైన మార్గాలను నిర్ణయించేందుకు ముగ్గురు మంత్రులు శనివారం మార్టూరు రానున్నారు. ఈ సందర్భంగా వారు ఇసుక దర్శి వద్ద ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు ఆఫీసు ఆవరణలో ఏర్పాటు చేసిన రైతులతో మాట్లాడతారు. నల్లబర్లీ పొగాకు కొనుగోలు దాదాపుగా స్తంభించి పోయి రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో సుమారు 60 వేల ఎకరాల్లో నల్లబర్లీ పొగాకు పండిస్తున్నారు. అందులో రమారమీ 30 వేల ఎకరాల్లో పర్చూరు నియోజకవర్గం రైతులే సాగు చేశారు. మిగిలిన పొగాకు ప్రత్తిపాడు, చందవోలుపాడు, అద్దంకి తదితర నియోజకవర్గాల్లో రైతులు సాగు చేశారు. కనీసం మద్దతు ధర కూడా ఇవ్వకుండా వ్యాపారులు మొండికేయడంతో రైతులు పొగాకు విక్రయానికే వెనుకంజ వేసి రోడ్డెక్కారు. విషయాన్ని ముందుగానే పసిగట్టిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంటనే సమస్యను ప్రభ్వుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఒత్తిడితో రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ పర్చూరు నియోజకవర్గానికి వచ్చి సమస్య తీవ్రతను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. బాపట్లలో బుధవారం జరిగిన డీఆర్‌సీ సమావేశంలో ఇదే అంశంపై ప్రధానంగా చర్చించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి తీర్మానం చేశారు. గురువారం ఉదయం మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే సాంబశివరావులు ఈ విషయాన్ని మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ముఖ్యమంత్రి మంత్రివర్గంతో, అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్ష చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమయితే గిట్టుబాటు ధరకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చర్చించారు. ఆ మేరకు వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్, సాగునీటి పారుదల శాఖా మంత్రి రామనాయుడు పర్చూరు నియోజకవర్గానికి వెళ్లి రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి అవసరమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దీంతో మంత్రులు ఎమ్మెల్యే ఏలూరితో చర్చలు జరిపారు. ఆ మేరకు శనివారం ఉదయం మంత్రుల బృందం మార్టూరు వచ్చే కార్యక్రమం ఖరారైంది. ఒక గ్రామంలోకి వెళ్లి రైతులతో మాట్లాడి పొగాకు పంటను పరిశీలిస్తారు. పొగాకు ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శిస్తారు. ఆ తరువాత ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు ఆవరణలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో వారు పాల్గొంటారు. తదనుగుణంగా వారిచ్చే నివేదికను పరిశీలించి గిట్టుబాటు ధర కల్పించే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ప్రకటిస్తారు. తదనుగుణంగా నల్లబర్లీ పొగాకు రైతుల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పరిష్కారమయ్యే అవకాశం కనిపిస్తోంది.

పొగాకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఇంకొల్లు,మే 22,(ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద ఉన్న పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని మాజీ వ్యవసామశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఇంకొల్లులో రైతుసంఘం ఆధ్వర్యంలో అలంకార్ సినిమాహాల్‌లో గురువారం పొగాకు రైతుల సదస్సు జరిగింది.సుమారు 500 మంది పొగాకు రైతులు హాజరయ్యారు. పొగాకు రైతులు ధైర్యంగా ఉండాలని ఆయన అన్నారు. పొగాకు కంపెనీలతో కొనుగోళ్లు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వలేటి కృష్ణయ్య మాట్లాడుతూ పొగాకు రైతులందరూ ఐక్యతగా ఉండి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మే చివరి నాటికి పొగాకు కొరుగోళ్లు చేసేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు.కంపెనీలు రైతులను పొగాకు పండించమని ప్రోత్సహించి మొఖం చాటేసి మొసం చేశాయన్నారు. కంపెనీలు కానీ, ప్రభుత్వం కానీ పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం రైతులు స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. పొగాకు కొనుగోలు చేయాలంటూ నినాదాలతో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం నాయకులు తల్లపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, జిల్లా కౌలుసంఘం ఉపాధ్యాక్షులు గంగయ్య, హరనాద్, వెంకట్, ఇంకొల్లు, పంగులూరు మండలాల రైతులు హాజరయ్యారు.



ఇంకొల్లులో నిరసన తెలుపుతున్న రైతులు

ఉప్పుటూరు(పర్చూరు): పొగాకు కంపెనీల తీరుపై మాజీ వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మండి పడ్డారు. రైతులను నమ్మబలికి పొగాకు పండించిన అనంతరం ఇప్పుడు కొనకపోతే ఎలా అని పొగాకు కంపెనీలను ఆయన ప్రశ్నించారు. గురువారం పర్చూరు మండలం, ఉప్పుటూరు గ్రామంలో పొగాకు సాగుచేసిన రైతులతో ఆయన మాట్లాడి, నిల్వచేసుకున్న పొగాకు మండెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అందరూ ఐక్యంగా ఉండి గిట్టుబాటు ధర సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. ఒక్క ఉప్పుటూరులోనే 3 వేల ఎకరాల్లో రైతులు పొగాకు సాగుచేయడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి ఇటీవల పొగాకు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడినా కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. రైతుల వద్ద ఉన్న పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని ఆయన పొగాకు కంపెనీలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షులు కృష్ణయ్య, జిల్లా కౌలురైతుసంఘం కార్యదర్శి సీహెచ్.గంగయ్య, కొండయ్య, మత్తే డేవిడ్, షేక్.రహీం, రైతులు పాల్గొన్నారు.

గొలుసు అపహరించిన దొంగ అరెస్ట్

అద్దంకి,మే22(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలోని వాసవినగర్‌లో విశ్వభారతీ స్కూల్ సమీపంలో ఇటీవల ఇంటి ముందు పూలు కోస్తున్న బాలిక మెడలో బంగారు గొలుసును అపహరించిన నిందితుడిని గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. గుంటూరు పట్టణంలోని శ్రీనివాసరావుతోట కు చెందిన పాత నేరస్థుడు పసుపులేటి సాయినాధ్‌బాబు స్కూటి పై వచ్చి అద్దంకి లో బాలిక మెడలో బంగారు గొలుసు లాక్కొని వెళ్లాడు.

కుమార్తె మృతితో మనస్తాపం.. తల్లి ఆత్మహత్య

అద్దంకి,మే22(ఆంధ్రజ్యోతి): కుమార్తె మృతి చెందడంతో మతిస్థిమితం కోల్పోయిన మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన మీనాక్షి వేదవతి 8 నెలల క్రితం ఇంకొల్లులో మృతి చెందింది. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో నివాసం ఉండే తల్లి నర్రా మహాలక్ష్మమ్మ(53) మతిస్థిమితం లేకుండా ఉంటుంది. ఈ నెల 20న గుళికల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఒంగోలు రిమ్స్ లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరా త్రి సమయంలో మృతి చెందింది. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్బరాజు తెలిపారు.

హెచ్‌ఎంల బదిలీ దరఖాస్తు గడువు పూర్తి

● వచ్చిన వాటిలో అనేక తప్పులు

● తలలు పట్టుకుంటున్న అధికారులు

ఒంగోలు విద్య, మే 22(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీ దరఖాస్తుల్లో తప్పులు దొర్లడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. బదిలీల దరఖాస్తుల సమర్పణకు గురువారం రాత్రి 11.59 గంటలకు గడువు ముగియనుంది. తప్పులతడకలతో తమ పరిస్థితి ఏమిటని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్య కమిషనర్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బదిలీలకు హెచ్‌ఎంలు బుధ, గురువారాల్లోనే వివరాలు సమర్పించాలి. అయితే బుధవారం మధ్యాహ్నం మూడు గంటల తర్వాత మాత్రమే దరఖాస్తు ఆన్‌లైన్‌లో ఓపెనైంది. గురువారం సాయంత్రానికి కూడా దరఖాస్తులో తప్పులు సరిచేయకపోవడంతో హెచ్‌ఎంలు ఆందోళన చెందుతున్నారు. ఒక స్థానంలో రెండేళ్లు పూర్తయినవారు బదిలీకి దరఖాస్తు చేసుకుంటే అందులో తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ అని వస్తుండటంతో కొందరు అప్లై చేసేందుకు భయపడుతున్నారు. తప్పనిసరి బదిలీ అని ఉన్నందున తమ స్థానాలు ఖాళీగా చూపిస్తారేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. కొందరికి పాయింట్లు రాకపోవడంతో వారు కూడా టెన్షన్‌కు గురవుతున్నారు. 2023 నుంచి కొత్త స్థానాల్లో చేరిన వారికి స్టేషన్ పాయింట్లు నమోదు కావడం లేదు. బుధవారం నుంచి ఈ పరిస్థితి ఉన్నా దానిని సరిచేసి హెచ్‌ఎంలు ధైర్యంగా దరఖాస్తు చేసుకునేందుకు భరోసా ఇవ్వాల్సిన అధికారులు వారి గురించి పట్టించుకోవడం లేదు.

110 ఖాళీలు

ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఎంల బదిలీలకు 110 ఖాళీలు చూపించారు. వీటిలో జడ్పీ యాజమాన్యంలో 92, ప్రభుత్వ, మునిసిపల్ యాజమాన్యంలో 9 ఖాళీలు ప్రదర్శించారు. మొత్తం 12 మంది హెచ్‌ఎంలకు ప్రస్తుతం వారు పనిచేస్తున్న స్థానాల్లో ఐదేళ్లు పూర్తి కావడంతో వారు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. మరో రెండు పాఠశాలలు ముటుకుల, వైపాలెం జడ్పీ హైస్కూలు విద్యార్థుల సంఖ్య తగ్గడంతో అక్కడ హెచ్‌ఎం పోస్టులు పోయాయి. దీంతో ఆ రెండు పాఠశాలల హెచ్‌ఎంలు కూడా బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. తప్పనిసరిగా కావాల్సిన వారంతా దరఖాస్తు చేయించమని కమిషనర్ ఆదేశించారు. వారు దరఖాస్తు చేసుకోకపోతే బదిలీల కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగిలిన స్థానాల్లో వారికి నియామక ఉత్తర్వులు ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒంగోలులోనే ట్రిపుల్‌ఐటీని కొనసాగించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పో రాటాల ద్వారా సాధించుకున్న ట్రిపుల్‌ఐటీని ఒంగోలులోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రా యపాటి జగదీష్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని జేఏసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రావ్‌అండ్‌నాయుడు కాలేజీలో నిర్వహిస్తున్న ట్రిపుల్‌ఐటీ కాలే జీని మళ్ళీ కడపకు తరలిస్తే ఊరుకోనేది లేదని హెచ్చరించారు. ఒంగోలులోని మంగమ్మ కళాశాల, శర్మ కళాశాల, మలినేని ఇంజనీరింగ్ కాలేజీ, ఒంగోలులో ని పాత రిమ్స్ భవనాలను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో సొంత భవనాలు నిర్మించి ఒంగోలులోనే ఏర్పాటు చేయాలన్నారు. కొంత మంది కనిగిరి ప్రాంతానికి తీసుకొని వెళ్తామంటే కుదరదని చెప్పారు. పాఠశాలను ఇక్కడే కొనసాగించాలన్నారు. ఒంగోలు కు ట్రిపుల్‌ఐటీ ఇచ్చిన తర్వాత మార్కా పురం జిల్లా ఏ ర్పడుతుందని, అవసరమైతే కొత్తగా మరో ట్రిపుల్‌ఐటీ కళాశాల మంజూరు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రెబ్బవరపు ప్రేమ్‌కుమార్, రాజీవ్, బెంజిమెన్, సాగర్, కృష్ణ, సూర్య పాల్గొన్నారు.

కుంట భూమి ఆక్రమణ



ఆక్రమిత భూమిలో పంట సాగు

రూ.కోట్ల భూమిపై కన్నేసిన కబ్జాదారులు

సచివాలయానికి వెళ్లేందుకు దారిలేకుండా దౌర్జన్యం

ప్రభుత్వ భూమిలో కాలువ తవ్వకం

అక్రమంగా దున్ని పంట సాగు

తెలిసినా పట్టించుకోని అధికారులు

పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ ఆగడం లేదు. పట్టణానికి సమీపంలోని రూ.కోట్ల విలువైన భూమిని ఆక్రమించేస్తున్నారు. అధికారుల ఆదేశాలను సైతం లెక్క చేయకుండా భూముల్లో పంటలు చేయడం విడ్డూరంగా ఉంది.

పొదిలి, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి కూత వేటు దూరంలో కంభాలపాడు గ్రామ సర్వే నెంబర్ 45-1 లో 2.11ఎకరాలు కుంట భూమి ఉంది. అందులో ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గ్రామ వార్డు సచివాలయంతో పాటు పలురకాల కార్యాలయాలు నిర్మించేందకు ఎకరం పొలాన్ని కేటాయించారు. సచివాలయం, హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. కంభాలపాడు సచివాలయానికి కేటాయించిన స్థలం పోను మిగిలిన 1.11 ఎకరాల భూమిని గత ఏడాది మార్చి 14వ తేదీన వైసీపీ హయాంలో కొందరు ఆక్రమించారు. ఈ పొలం పక్కనే ఉన్న పొలం యజమాని ఆ భూమి తనదంటూ సచివాలయానికి వెళ్లడానికి వీలులేకుండా ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీశారు. విషయం తెలుసుకున్న నగరపంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆక్రమిత స్థలాన్ని అదేరోజు పరిశీలించారు. ఆ తరువాత చర్యలు తీసుకోకపోవడంతో ఏకంగా పొలాన్ని దున్ని కంది పంటను సాగుచేశారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా.. పంటకాలం పూర్తి అయిన తరువాత సర్వే చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పంట ఇంటికి వచ్చి కూడా రెండు నెలలు అయింది. అయినా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ భూమి ఒంగోలు - నంద్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఉంది. కోట్ల రూపాయలకు విలువ చేస్తోంది. తహసీల్దార్‌ను వివరణ కోరగా.. సర్వే చేసి నగరపంచాయతీకి నివేదికను అందిస్తామని చెప్పారు. దీనిపై కంభాలపాడు కార్యదర్శి శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. రెవెన్యూ అధికారులు సర్వేచేసి నివేదిక ఇచ్చారని, దాని ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇటీవల కొత్తగా వచ్చిన నగరపంచాయతీ కమిషనర్‌తో కలిసి పరిశీలించామని త్వరలో పోలీసుల అనుమతితో ఆక్రణను తొలగిస్తామని స్పష్టం చేశారు.

అవీ..ఇవీ..

ఆహారభద్రత అధికారుల తనిఖీ



పండ్లు నాణ్యత పరిశీలిస్తున్న ఆహార భద్రత అధికారి ప్రణీత్

చీరాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలో ఆహార భద్రత అధికారి ప్రణీత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'నామమాత్రపు ఆహార తనిఖీలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆహార భద్రతా అధికారి ప్రణీత్ పలు రకాల పండ్ల దుకాణాలు, ఆహార పదార్థాల దుకాణాలు తనిఖీలు నిర్వహించారు. పండ్లు వేగంగా పండించేందుకు రసాయనాలు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు చోట్ల శాంపిల్స్ సేకరించారు. దాడులు నిత్యం ఉంటాయని హెచ్చరించారు.

పొదుపు మహిళల ఉపాధికి రుణాలు

- కె.రాజుపాలెం గ్రామానికి చెందిన మహిళలకు ఆయిల్ తయారీ యూనిట్ మంజూరు



ఆయిల్ తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఏపీఎం రాజారావు

బల్లికురవ. మే 22 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలలో మహిళకు స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం పలురకాల రుణాలను అందిస్తోందని వెలుగు ఏపీఎం రాజారావు అన్నారు. మండలంలోని కె.రాజుపాలెం గ్రామానికి చెందిన పొదుపు మహిళ గద్దె నాగవర్దినికి పీఎంఎఫ్ఎంఈ ద్వారా రూ.2.30 లక్షల రుణాన్ని అందించారు. ఈ రుణంలో రూ.70 వేల వరకు రాయితీ అందుతుందన్నారు. ఈ రుణంతో మహిళ మార్టురులో వంటనూనె, హెయిర్ ఆయిల్ తయారుచేసే యనిట్‌ను ఏర్పాటు చేయగా, ఏపీఎం రాజారావు, ఆంధ్ర గ్రామీణ బ్యాంకు మేనేజర్ పృధ్వీలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో సీసీ పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి జీవవైవిధ్య సంరక్షక అవార్డు



అవార్డు అందుకుంటున్న భానుచంద్రమూర్తి

చీరాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు పవని భాను చంద్ర మూర్తికి జీవవైవిధ్య సంరక్షక అవార్డు దక్కింది. ఈక్రమంలో గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదగా, భానుచంద్రమూర్తి జ్ఞాపికను అందుకున్నారు. చెట్ల సంరక్షణ, తీరపరిశుభ్రత, విద్యార్థుల్లో చైతన్యపరమైన కార్యక్రమాలు, వివిధ వ్యాసరచన పోటీలకుగాను ఈ అవార్డు దక్కింది. కార్యక్రమంలో అడవులు పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శి అనంత రాము, జీవవైవిధ్య మండలి చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, సభ్యులు రామకృష్ణ పాల్గొన్నారు.

వేగంగా విద్యుత్ సమస్యల పరిష్కారం : ఎమ్మెల్యే

పందిళ్లపల్లి(చీరాల), మే 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వేగవంతంగా విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. గురువారం పందిళ్లపల్లి విద్యుత్ ఉపకేంద్రంలో నూతనంగా నిర్మించిన రూ.11 లక్షలు విలువైన ఫీడర్ బ్రేకర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గతంలో పందిళ్లపల్లి గ్రామంలో ప్రజలు విద్యుత్ సమస్యలతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. మూడు రోజుల క్రితం ప్రాంత ప్రజలు సమస్యను తనదృష్టికి తీసుకురావడంతో వేగంగా నిధులు మంజూరు చేయించి మరమ్మతులకు గురైన వాటిస్థానాల్లో నూతన పరికరాలను అమర్చినట్లు వివరించారు. అలాగే సోలార్ ప్యానల్స్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు జాన్‌థామస్, శ్రీనివాసరావు, భాస్కరరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

- ఆంజనేయస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల స్వామివారి కల్యాణం



శింగరకొండలో బారులు తీరిన భక్తులు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

అద్దంకి,మే22(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని భక్తులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శింగరకొండ ప్రాంతం అంతాభక్తులతో నిండిపోయింది. ఇటీవల మహా కుంభాభిషేకం నిర్వహించడం, వెనువెంటనే హనుమజ్జయంతి కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. మామిడిపండ్లతో పూజ చేశారు. స్వామి వారి రథోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. మండల దీక్ష, అర్థ మండల దీక్ష పూర్తి చేసుకున్న దీక్షదారులు గురువారం ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకొని ఇరుముడులు సమర్పించారు. భక్తులు సమర్పించిన ఇరుమడి ద్రవ్యాలతో ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ తిమ్మానాయుడు, రిషిత దంపతులు,విమాన శిఖర దాత నలమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులు యజ్ఞశాలలో హోమంలో పాల్గొన్నారు. భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఏర్పాట్లను ఈవో తిమ్మానాయుడు పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని బాలాంజనేయస్వామి, మాధవస్వామి దేవాలయం ఆవరణలోని ఆంజనేయస్వామి ఆలయం, మార్కెట్ యార్డు సమీపంలోని వేలమూరిపాడు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

పంగులూరు : మండలంలోని పలు గ్రామాలలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చందలూరు గ్రామంలో అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంకొల్లు, చందలూరు గ్రామాలకు చెందిన భజన బృందం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం గ్రామ అభయాంజనేయస్వామి కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామకూరు గ్రామంలోని రావిచెట్టు వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజారి నరశింహరావు, వెంకటేష్‌ల ఆధ్వర్యంలో శాస్రోక్తంగా జరిగిన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జనకవరం, తూర్పుకొప్పెరపాడు, కొండమంజులూరు గ్రామ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనమాన్ చాలీసా పారాయణం చేశారు. జనకవరం గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఇంకొల్లు : హనుమాన్‌జయంతి సందర్భంగా మండలంలోని పావులూరు పొలిమేర వీరాంజనేస్వామి గుడి, ఇంకొల్లులోని బస్టాండు వద్ద ఉన్న ఆంజనేయస్వామి వద్ద హనుమాన్‌చాలీసా పఠించారు. పర్చూరురోడ్డులోని అభయాంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కొణికి, గంగవరం, దుద్దుకూరు అంజనేయస్వామి విగ్రహాల వద్ద భజనలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో గురువారం హనుమజ్జయంతి వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామాలలో ఉన్న అంజనేయస్వామి దేవాలయాలలో ఆకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొణిదెన గ్రామంలో ప్రసన్నాజనేయ స్వామికి అర్చక స్వామి అయిన వేలు శోభనాచార్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త యిన్నమూరి ఉమామహేశ్వరరావు పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే కొత్తపాలెం, అంబడిపూడి, మల్లాయపాలెం, కొప్పెరపాడు, నక్కబొక్కలపాడు, సూరేపల్లి గ్రామాలలో హనుమజ్జయంతి సందర్భంగా పూజలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపాలెం గ్రామంలో మహిళలు ఈ సందర్భంగా కోలాట ప్రదర్శన నిర్వహించారు.

చినగంజాం: మండలంలోని పలుగ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. హనుమజ్జయంతిని పురస్కరించుకొని స్థానిక పంచముఖ అంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాయుపుత్రుని విగ్రహానికి నూతన వస్త్రాలు, పలు రకాల పూలలతో గజమాల వేసి విశేష పూజలు చేశారు. వడమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వినియోగం చేశారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి ఆలయం, కడవకుదురు సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి సందర్భంగా భక్తులు 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించారు. ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక హనుమ సాయికుటీరంలోని ప్రసన్నాంజనేయస్వామి, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్‌లో, గొనసపూడి, సంతరావూరు, పెదగంజాం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లో అభయాంజనేయస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

పర్చూరు : హనుజ్జయంతి సందర్భంగా అంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారికి ప్రత్యేక ఆకుపూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. పర్చూరు వైజంక్షన్ వద్ద వేంచేసిన 95 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమాన్ జయంతితోపాటు, ఆలయ ద్వితీయ వార్షిక మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 11 మంది దంపతులతో విశేష పూజలు చేశారు. గ్రామం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ నేతృత్వంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదేవిధంగా వంతెన కూడలిలోని ఆంజనేయ స్వామి ఆలయం, నాతలపాడు పొలిమేరలో ఉన్న అభయాంజనేయస్వామి వార్ల విగ్రహం వద్ద విశేష పూజాకార్యక్రమాలు ఏర్పాటు చేసి అన్నదానం చేశారు.






అద్దంకిలోని మాదవస్వామి ఆలయంలో, రాంకూరులో ఆంజనేయస్వామి విశేష అలంకరణ, చినగంజాం, పర్చూరులో భక్తుల పూజలు

కూటమి ప్రభుత్వంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

ఎమ్మెల్యే కొండయ్య



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

చీరాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పన దిశగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో 66 మంది రుణగ్రహీతలకు రూ.96.75 లక్షలు ముద్ర రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి కే నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో రుణాలు కల్పించి వ్యాపారాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ-4 ప్రాతిపదికన ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్త తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ ఏడీ కిలారి నాగమల్లేశ్వరరావు, ఏపీఎంలు మధు, అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, సీనియర్ నాయకులు నాసిక వీర భద్రయ్య, తదితర కూటమి నాయకులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రాతిమండప నిర్మాణానికి విరాళం



మండపం ప్రధాన దాతలను సన్మానిస్తున్న ఈవో

అద్దంకి, మే22 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ రాతి మండపం నిర్మాణ ప్రధాన దాతలు నలమలపు విజయభాస్కరరెడ్డి, శ్రీదేవి దంపతులను, కాట్రగడ్డ అనిల్, శ్రీవిద్య దంపతులను గురువారం ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు, పూజారులు ఘనంగా సత్కరించారు. రాతిమండపం నిర్మాణానికి గురువారం పంగులూరు మండలం కశ్యాపురానికి చెందిన మక్కెన నాగబ్రహ్మం రూ.1,01,116 రూపాయలు,అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంకు చెందిన కాకాని హరిబాబు,సీతమ్మ దంపతులు రూ.1,11,116లు, అద్దంకికి చెందిన బండారు వెంకట రామానుజమ్మ రూ.1,01,116లు, తంగా పద్మజనాయుడు రూ.1,01,116లు రామమల్లి మోహనకృష్ణ, మానసాసాయిమహలక్ష్మి దంపతులు లక్ష రూపాయలు విరాళాలను ఈవో తిమ్మనాయుడుకు అందజేశారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన చెన్నుపాటి రామాంజనేయులు, రత్నకుమారి దంపతులు మారుతీభవన్‌లో గది ఆధునీకరణకు అవసరమైన నగదు ఈవోకు అందజేశారు.

వైభవంగా వీరాంజనేయస్వామి కల్యాణం




సువర్చలా సమేత వీరాంజనేయస్వామి, కల్యాణంలో కూర్చున్న దంపతులు

మార్టూరు,మే22(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలో బొబ్బేపల్లి,రాజుగారిపాలెం గ్రామాల మధ్య కొండపై శ్రీవీరాంజనేయస్వామి వారి జయంతి ఉత్సవములు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఉదయం దేవస్థానంలో శ్రీసువర్చలా సహిత వీరాంజనేయస్వామి స్వామి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు.స్వామి వారి కల్యాణంనకు భారీగా దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.కల్యాణం సందర్భంగా స్వామి వారి దంపతులను ప్రత్యేకంగా అలంకరణ చేశారు.భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.ఇక సాయంత్రం ఎడ్ల ప్రదర్శన,కోలాటం ప్రదర్శించారు.ఇంకా రాత్రి పాటకచేరీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.దేవస్థానం కమిటి చైర్మన్ దండా వీరాంజనేయులు ఆధ్వర్యంలో స్వామి వారి జయంతి మహోత్సవాలను నిర్వహించారు. మార్టూరు సీఐ యం శేషగిరిరావు ఆద్వర్యంలో మార్టూరు యస్ఐ సైదా, యద్దనపూడి యస్ఐ టి రత్నకుమారి,పర్చూరు యస్ఐ మాల్యాద్రి, ఏఎస్ఐ భాషా ఇంకా దాదాపుగా 30 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించగా రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి.రాజుగారిపాలెం,బొబ్బేపల్లి ద్రోణాదుల గ్రామాల నుండి భక్తులు వి శేషంగా తరలివచ్చారు.

తెలుగు బాప్టిస్ట్ చర్చిలో శిలువ ప్రతిష్ఠ

మార్టూరు, మే22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనంకి గ్రామంలో గురువారం తెలుగు బాప్టిస్ట్ చర్చి శిలువ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు బాపిస్టు రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, తెలుగు బాపిస్టు అధ్యక్షులు ఇమ్మానుయేల్ చర్చి ఫాస్టర్ ఏసుపాదం ఆధ్వర్యంలో ప్రజలు ప్రభు కీర్తనలతో శిలువను ప్రతిష్ఠించారు. పాస్టర్ ఏసుపాదం వాక్యోపదేశం చేశారు. కార్యక్రమానికి గ్రామ సంఘం పెద్దలు,స్థానిక ప్రజలు, వారి బంధువులు హాజరయ్యారు. అనంతరం చర్చి ప్రాంగణంలో అన్నదానం చేశారు.

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విక్టర్ ఇమ్మానియేల్

మార్టూరు,మే22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను డిపార్ట్‌మెంట్ నియమ నిబంధనలను అనుసరించి వెంటనే పరిష్కరించాలని జిల్లా విశ్రాంత న్యాయాధికారి చైర్‌పర్సన్, సిజిఆర్ఎఫ్ యన్ విక్టరీ ఇమ్మానియేల్ విద్యుత్ అధికారులకు సూచనలు చేశారు. గురువారం మార్టూరు సబ్‌డివిజన్ పరిదిలోని మార్టూరు,యద్దనపూడి,బల్లికురవ,సంతమాగులూరు మండలాలలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి స్థానికంగా ఇంటూరి కల్యాణమండపంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విక్టరీ ఇమ్మానియేల్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడం విద్యుత్ అధికారుల బాధ్యత అన్నారు. వినియోగదారుల కరెంటు బిల్లుల వసూలు ఎంత ప్రాధాన్యమో, వారి విద్యుత్ సమస్యలను పరిష్కరించడం కూడా అంతే వేగవంతంగా చేయాలన్నారు. అనంతరం ఏపీటీఎస్ వారు విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కరపత్రాలను అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ అదాలత్ కార్యక్రమంలో 21 ఫిర్యాదులు రాగా వాటిలో 14 సమస్యలను వెంటనే పరిష్కరించామని అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తానరావు తెలిపారు. కార్యక్రమంలో మార్టూరు సబ్ డివిజన్ డిఈఈ యం సురేంద్రబాబు,జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి,మార్టూరు అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్, విద్యుత్ ఏఈ కిరణ్,విద్యుత్ విజిలెన్స్ ఉద్యోగి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ప్రజల అవస్థలు





ఇంకొల్లులో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు, వాగువద్ద నిలిచిన వాహనాలు

ఇంకొల్లు, మే 22,(ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంకొల్లులో బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఇస్లాంపేటలో కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. మరోవైపు రైతులు మిర్చికల్లాలు, పొగాకు మండెలు తడవకుండా ఉండేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పూసపాడు వంకాయలపాడు మధ్య ఉన్న వాగు గురువారం ఉదయం పొంగి ప్రవహించడంతో హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులు గంటపాటు అక్కడ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. పదుల సంఖ్యలో వాహనాలను అటుఇటూ నిలిచిపోగా 100 మంది ప్రయాణికులు చేసేది లేక వాగు తగ్గేవరకు వేచి ఉండి ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ఇంకొల్లు టూ పర్చూరు రహదారి కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారై పెద్దపెద్ద గుంటలతో పంట పొలాలను తలపించారు.

ఇంకొల్లు ప్రాంత సమస్యలపై ఏలూరి దృష్టి



ఇంకొల్లు, మే 22, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రాంతంలో ప్రధానంగా ఉన్న సమస్యలపై పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు దృష్టిసారించారు. సోమవారం జరిగిన మినీమహానాడు కొన్ని సమస్యల పరిష్కారానికి తీర్మానాలు తయారు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పావులూరు నుంచి నాగండ్ల వరకు అధ్వానంగా ఉన్న పంచాయతీ రాజ్ రహదారిని బాగు చేసేందుకు సుమారు రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు సభలో ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. అలాగే ఆర్టీసీ బస్సుడిపో, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. మినీమహానాడులో ఇంకొల్లు ప్రాంత అభివృద్ధి పనులపై జరిగిన చర్చపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తపరుస్తున్నారు.



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	35.2	25.6
కావలి	36	28
ఆత్మకూరు	34	24
ఉదయగిరి	35	27
కందుకూరు	35	27

ప్రాజెక్టులకు భూసేకరణ
వేగవంతం చేయండి
అధికారులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఎన్‌హెచ్ఏఐ, రైల్వే, ఆర్ఓబీలు, ఆర్అండ్‌బీ రోడ్లు, ఏపీఐఐసీ, మెగా ఇండస్ట్రియల్ హబ్ తదితర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. అభివృద్ధి ప్రాజెక్టులను పట్టా లెక్కిచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నందున, అధికారులు త్వరితగతిన భూసేకరణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖాధికారి కె.మహబూబ్‌బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్, ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హుస్సేన్‌సాహెబ్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఎన్‌హెచ్ఏఐ, వివిధ ప్రాజెక్టుల అధికారులు పాల్గొన్నారు.

● పరిశ్రమల ఏర్పాటుకు...

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : నూతన పరిశ్రమలకు ఔత్సాహికులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటోనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇరిగేషన్ కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లాలో టీబీ బాధితులకు పోషక సహాయం అందించడంలో సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు ఆర్థిక సాయం అందించాలన్నారు. అదేవిధంగా యోగాంధ్రలో పరిశ్రమల భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, పరిశ్రమలశాఖ జీఎం ప్రసాద్, ఆర్డీవోలు పాల్గొన్నారు.



మెగా డీఎస్సీ... యువతలో ఆశలు చిగురింపజేస్తోంది. ఎలాగైనా ప్రభుత్వ కొలువు సాధించాలన్న పట్టుదలతో దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. జిల్లాలో అన్ని కేటగిరీల్లో 673 పోస్టులు భర్తీ చేయనుండగా, 15,993 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక అభ్యర్థి ఎన్ని పోస్టులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుల వారీగా లెక్కిస్తే 28,772 వచ్చాయి. అంటే ఒక్కో పోస్టుకు 42 దరఖాస్తులు అందినట్టు సమాచారం. కొన్ని కేటగిరీల్లో అభ్యర్థుల నడుమ తీవ్ర పోటీ నెలకొని ఉండగా మరికొన్నింటిలో పెద్దగా పోటీ లేకపోయినా దరఖాస్తులు మాత్రం అధికంగానే వచ్చాయి. మరోవైపు దరఖాస్తు చేసుకున్న వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు.

ఒక్కో పోస్టుకు 42 దరఖాస్తులు

● మెగా డీఎస్సీలో కొలువు కోసం యువతలో పోటాపోటీ

● 673 పోస్టులకు 28,772 దరఖాస్తులు

● మొత్తం అభ్యర్థుల సంఖ్య 15,993 మంది

● వీరిలో 9,820 మంది మహిళలే!

నిరుద్యోగ అభ్యర్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఉద్యోగాల సాధనకు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలో భర్తీకానున్న 673 పోస్టులకు 15,993 మంది అభ్యర్థులు 28,772 దరఖాస్తులతో పోటీ పడుతున్నారంటే పోటీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారిలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషులు 6,173 మంది, మహిళలు 9,820 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక రిజర్వేషన్ల వారీగా పరిశీలిస్తే బీసీ-డీ, ఎస్సీ, ఎస్సీ-2, ఎస్సీ-3 విభాగాల్లో ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఈ కేటగిరీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. ఓసీ విభాగంలో పోటీ తక్కువగా కనిపిస్తున్నా ఇతర సామాజిక వర్గాల అభ్యర్థులు కూడా సాధించిన మార్కులను బట్టి ఈ కేటగిరీ పోస్టుల కోసం పోటీ పడేందుకు అవకాశం ఉంటుంది.

● పోస్టుల వివరాలు

జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో 673 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1లో 39, హిందీ 18, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్‌ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115 కలిపి మొత్తం 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లీష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు ఉన్నట్లు గుర్తించారు. దరఖాస్తుదారులకు ఈ నెల 30 హాల్‌టికెట్లు విడుదల చేయనున్నారు. జూన్ 6, 7వ తేదీల్లో పరీక్షలు నిర్వహించి రెండురోజుల్లోనే ప్రాథమిక కీ విడుదల చేస్తారు. కీ విడుదలైన తరువాత ఏడు రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించి అనంతరం తుది కీ విడుదల చేస్తారు. అనంతరం వారం రోజుల గడువులో మెరిట్ జాబితాను ప్రకటిస్తారు.

● మహిళలే ఎక్కువ

దరఖాస్తుదారుల్లో పలు సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు భారీగానే పోటీ పడుతున్నారు. ఓసీ విభాగంలో 1468 మంది, బీసీ-ఏలో 1654 మంది, బీసీ-బీలో 1930 మంది, బీసీ-సీలో 188 మంది, బీసీ-డీలో 2004 మంది, బీసీ-ఈలో 1050 మంది పోటీపడుతున్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ తరువాత ఎస్సీ-1లో 2, ఎస్సీ-2లో 2,283 మంది, ఎస్సీ-3లో 4,427 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీ విభాగంలో 957 మంది, ఈడబ్ల్యుఎస్‌లో 900 మంది పోటీ పడుతుండగా, దివ్యాంగుల విభాగంలో వీహెచ్‌లో 69 మంది, హెచ్‌హెచ్‌లో 35 మంది, ఓహెచ్‌లో 365 మంది, ఎంఐలో ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.


● మెగా డీఎస్సీకి రోస్టర్ పాయింట్లు

ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా 668 పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో రోస్టర్ పాయింట్లు సిద్ధం చేసి పోస్టులు, కేటగిరీల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ స్కూళ్లలో 629, నగరపాలక సంస్థ పరిధిలోని స్కూళ్లలో 25, మున్సిపల్ స్కూళ్లలో 14 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు సంబంధించి రిజర్వేషన్ల వారీగా నియామకాలు చేపట్టేందుకు రోస్టర్ పాయింట్లను సిద్ధం చేశారు. కులాల వారీగా సబ్జెక్ట్ టీచర్లు, ఎస్‌జీటీల పోస్టుల నియామకం ఉంటుంది. ఇందులోనూ మహిళలు, దివ్యాంగులకు కొన్ని పోస్టులు కేటాయిస్తుండగా, ఎస్సీ వర్గీకరణ అమల్లోకి రావడంతో ఈసారి ఎస్సీ పోస్టులను మూడు కేటగిరీలుగా విభజించారు. దివ్యాంగుల విభాగంలో వీహెచ్, హెచ్‌హెచ్, ఓహెచ్, ఎండీ తదితర కేటగిరీల వారీగా పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే మాజీ సైనికుల కోటా, స్పోర్ట్స్ కోటాలో కూడా నియామకాలు ఉంటాయని అధికారులు తెలిపారు.

రిజర్వేషన్ల వారీగా పోస్టుల వివరాలు

కేటగిరీ	ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ	మున్సిపల్	కార్పొరేషన్	మొత్తం
ఓసీ	254	6	8	268
బీసీ-ఏ	48	1	1	50
బీసీ-బీ	60	0	1	61
బీసీ-సీ	5	1	2	8
బీసీ-డీ	43	1	2	46
బీసీ-ఈ	24	1	1	26
ఎస్సీ-జి-1	6	1	3	10
ఎస్సీ-జి-11	38	1	1	40
ఎస్సీ-జి-111	48	1	2	51
ఎస్టీ	41	0	2	43
ఈడబ్ల్యుఎస్	62	1	2	65
మొత్తం	629	14	25	668

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



ఉపాధ్యాయ బదిలీల
ప్రక్రియ ప్రారంభం

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి బదిలీల నియంత్రణ చట్టం కింద నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, పురపాలక, నగరపాలక మేనేజ్‌మెంట్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టనున్నారు. ఇప్పటికే ప్రారంభమైన ఈ ప్రక్రియ జూన్ 11వ తేదీ నాటికి పూర్తికానుంది. గ్రేడ్-2 హెచ్ఎంలకు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు వేర్వేరుగా షెడ్యూల్ ప్రకటించగా తొలుత హెచ్ఎంల బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టనున్నారు.

- వివరాలు 8లో..



హంస వాహనంపై కామాక్షితాయి విహారం

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం కామాక్షితాయి హంస వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పుష్పాలంకరణ, మంగళ వాయిద్యాలు, పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారు విహరించారు. ఉదయం తిరుచా ఉత్సవంలో గంగా, కామాక్షితాయి సమేతంగా మల్లికార్జునస్వామికి గ్రామోత్సవం జరిగింది. ఆలయం ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, సభ్యులు, స్థానిక సర్పంచు పెంచలయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. కాగా, శుక్రవారం కామాక్షితాయికి రావణసేవ జరగనుంది.

మహా జోష్!

● నేడు నెల్లూరు పార్లమెంటు మినీ మహానాడు

నెల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పార్లమెంటు స్థాయి టీడీపీ మినీ మహానాడు శుక్రవారం జరగనుంది. ఉదయం 9 గంటలకు కనుపర్తిపాడు వద్ద ఉన్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు హాజరుకానున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడు కార్యక్రమాలు పూర్తయ్యాయి. అక్కడ చేసిన తీర్మానాలను పార్లమెంటు స్థాయి మహానాడులో ప్రవేశపెడతారు. ఉదయం ప్రతినిధుల నమోదు, ఆ తర్వాత టీడీపీ జెండా ఆవిష్కరణ, అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు నేతలంతా నివాళులర్పిస్తారు. గత ఏడాది కాలంలో చనిపోయిన టీడీపీ కార్యకర్తలకు సంతాపం ప్రకటించి తీర్మానం చేస్తారు. తదుపరి నియోజకవర్గస్థాయిలో తీర్మానించిన అంశాలపై చర్చిస్తారు. చివరగా పార్లమెంటు స్థాయి తీర్మానాలను ప్రవేశపెడతారు. ఇలా చేసిన తీర్మానాలను ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమంలో ప్రవేశపెడతారు. మధ్యాహ్నానికి కార్యక్రమం ముగుస్తుంది.





జై హనుమాన్!

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

హనుమజ్జయంతి పర్వదినాన్ని జిల్లా అంతటా గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామాలయాలు, ఆంజనేయస్వామి మందిరాలు, వైష్ణవాలయాల్లో ప్రాతఃకాలం నుంచే విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు చేశారు. జైశ్రీరామ్, జైజై హనుమాన్ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. పలు ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ, హోమాలు, లక్ష మల్లెలతో అర్చన, తమలపాకులతో సామూహిక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పూలంగిసేవ, పల్లకీసేవలతోపాటు కొన్ని ఆలయాల్లో వాహన సేవలు, నగరోత్సవాలు జరిగాయి. నెల్లూరులోని శబరి శ్రీరామ క్షేత్రంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష తమలపాకులతో పూజ చేశారు. బూందీతో ప్రత్యేకంగా రూపొందించిన హనుమంతుని రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆంజనేయస్వామికి పూజలు చేసి ప్రసాదం స్వీకరించారు. పల్లెల్లో హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



రాపూరు : పెంచలకోనలో విశేష అలంకరణలో వీరాంజనేయ స్వామి

● కనుమరుగు కానున్న 'ఎండీయూ' వ్యవస్థ

● వచ్చే నెల నుంచి డీలర్ల వద్దే రేషన్ పంపిణీ

● వృద్ధులు,దివ్యాంగులకు మాత్రం ఇళ్ల వద్దే...

● హర్షం వ్యక్తం చేస్తున్న డీలర్లు

జిల్లాలో చౌకదుకాణాలు : 1,513

కార్డుదారులు : 7,22,25

ఎండీయూ వాహనాలు : 438

చౌకదుకాణాలకు మళ్లీ ప్రాణం!

ఎప్పుడు వస్తాదో తెలియని ఎండీయూ వాహనం కోసం ఇక వేచి ఉండాల్సిన అవసరం లేదు. రోజువారి పనులు చేసుకుంటూనే వీలున్న సమయంలో నెలలో ఎప్పుడైనా డీలర్ల వద్ద సరుకులు తెచ్చుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తేనుంది. ఎండీయూ వాహనాలకు స్వస్తి పలికి జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)



కనుమరుగుకానున్న ఎండీయూ వాహనాలు



చౌకదుకాణంలో రేషన్ పంపిణీ చేస్తున్న డీలరు (ఫైల్)

మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) వ్యవస్థ కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసింది. ఒక్కో వాహనాన్ని రూ.7 లక్షల చొప్పున చెల్లించి కొనుగోలు చేసింది. అందులో ఆపరేటర్ 10 శాతం వాటా అంటే రూ.70 వేలు చెల్లించగా మిగిలింది బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు. జిల్లాలో 438 వాహనాల కొనుగోలుకు సుమారు రూ.30 కోట్లు వెచ్చించారు. ప్రభుత్వం ఆపరేటర్ వేతనం రూ.10 వేలు, కూలీకి రూ.5 వేలు, ఇంధనం, ఇతర ఖర్చులకు రూ.3 వేలు, ఈఎంఐ రూ.3 వేలు చొప్పున ప్రతినెలా రూ.21 వేలు చెల్లించేవారు. అయితే, ఆపరేటర్లు ఈఎంఐ కట్టడం లేదంటూ నెలకు రూ.18 వేలు మాత్రమే వేస్తున్నది. ప్రభుత్వం ఇచ్చే నగదు సరిపోక ఆపరేటర్ అష్టకష్టాలు పడుతూ వాహనాన్ని నడిపేవారు. కొంత మంది ఆపరేటర్లు ఆర్థిక, శారీరక కష్టాలు పడలేక రేషన్ పంపిణీ వ్యవస్థకు మధ్యలోనే స్వస్తి పలికారు.

● చౌకదుకాణాల ద్వారా సరుకులు

వచ్చే నెల 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చౌకదుకాణాలను కిరాణా సరుకుల అంగడిగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. దుకాణాల్లో రేషన్‌తోపాటు నిత్యావసర సరుకులు కూడా అందించనుంది. నెలంతా రేషన్ దుకాణాల తలుపులు తెరిచి ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం ఇంటి వద్దే సరుకులు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కార్డుదారులందరికీ సరుకులు అందుతాయి. కూటమి ప్రభుత్వానికి డీలర్లంతా రుణపడి ఉంటారు.

- ఎండీ ఖాదర్‌బాషా, డీలర్ల సంఘం అధ్యక్షుడు

అనేక ఇబ్బందులు పడ్డాం



గత ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను అమలు చేయడంతో అనేక ఇబ్బందులు పడ్డాం. సర్వర్ సమస్యతో కార్డుదారులకు పూర్తిగా సరుకులు అందేవి కావు. వారు తమ వద్దకు వచ్చి వివాదాలకు దిగేవారు. ఇక ఆ పరిస్థితుల ఉండవు.

- జీ.పెంచలయ్య, డీలర్, దేకూరుపల్లి

కష్టాలు తప్పాయి!



చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో తమ కష్టాలు తీరాయి. గత ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థ అమలు చేయడంతో డీలర్లు పని లేక ఖాళీగా కూర్చొని ఉన్నారు. కొందరు కుటుంబ పోషణ కోసం ఇతర పనులకు సైతం వెళ్లారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

- ఎంఏ ఫయాజ్, డీలర్, ఉదయగిరి

TENDER NOTICE
EXTENSION OF TENDER SUBMISSION DATE
నెం. 01 డిసిల్టింగ్/ తేది: 14-05-2025

డి.ఎల్.ఎస్.సి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు కలువాయి మండలము, రాజుపాళెం గ్రామము పెన్నానది అనికట్ అప్ స్ట్రీమ్ (46.19 హెక్టార్స్ ఏరియా) కోసము ఆసక్తిగల సంస్థల నుండి APPCB నుండి స్వీకరించిన సమ్మతి మేరకు CTE Orders NLR-68/APPCB/ZO-TPT/CTE/2024-459 Date:02-11-2024 మరియు CTO Order NLR-68/APPCB/ZO-TPT/CTO/2024-597 Date:17-12-2024, దరఖాస్తులు కోరింది. మానవశక్తి ద్వారా డిసిల్టింగ్ మరియు సమీపములోని నిర్దేశిత డంపింగ్ పాయింట్కు ఉపయోగకరమైన మెటీరియల్ను రవాణా చేయడానికి ఖర్చు టన్నుకు రూ.129/-గా నిర్ణయించబడినది. ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోగలరు.

వరుస సంఖ్యా	వివరములు	అప్ స్ట్రీమ్ సంగం బ్యారేజ్ నియర్ రాజుపాళెం గ్రామం, కలువాయి మండలం
1.	Bid Document Fee	Rs. 15,000/- Through DD in favor of sand account 2024 Nellore.
2.	Earnest Money Deposit (EMD) (10%)	Rs. 90,75,150/- in favor of sand account 2024 Nellore.
3.	Performance Security Deposit PSD (20%)	Rs. 1,81,50,300/- in favor of sand account 2024 Nellore. (Successful Bidder)
4.	Bid Submission Opening Date:	15-05-2025 at 10:00 A.M
5.	Revised Bid Submission Closing Date:	26-05-2025 at 05:00 P.M
6.	Bid Opening Date & Time	27-05-2025 at 04:00 P.M

Note: దరఖాస్తు రుసుము (Bid Document Fee) తిరిగి వాపసు ఇవ్వబడదు. ప్రైస్ బిడ్లు మరియు టెక్నికల్ బిడ్లు శ్రీయుత కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారి ఆధ్వర్యంలో నెల్లూరు నందు తెరువబడును. ఆసక్తి కలవారు Bid Document Fee మరియు EMD తో పాటు వారి దరఖాస్తును తీసుకొని శ్రీయుత కార్యనిర్వాహక ఇంజనీర్, నెల్లూరు మధ్య విభాగము, నెల్లూరు వారి కార్యాలయము నందు ఆఫీసు పనివేళలో Tender Schedule పొందగలరు. Technical మరియు Price Bid open చేయు సమయానికి బిడ్డర్లు గానీ బిడ్డర్ల తరపున ఏజెంటులు గానీ హాజరుకావలెను. ఈ నోటిఫికేషన్ను జారీ చేసి అధికార యంత్రాంగానికి ఈ నోటిఫికేషన్ వాయిదా వేయడానికి లేదా రద్దు చేయడానికి పూర్తి అధికారములు కలవు.

జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 530

దళితులకు అండగా టీడీపీ


విలేకరులతో టీడీపీ నాయకులు

కొండాపురం, మే22(ఆంధ్రజ్యోతి): దళితులకు అండగా టీడీపీ ఉంటుందని మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు దళితలను భయపెట్టి అక్రమకేసులు పెడుతున్నారని మర్రిగుంట సర్పంచి డీ. గోపి, రేషన్ డీలర్ సురేష్ అనడం సమంజసంకాదన్నారు. మర్రిగుంటలో అర్ధరాత్రి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుంటే గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు పిర్యాదుచేయడంతో కేసు నమోదు చేశారన్నారు. ఈవిషయంలో టీడీపీ నాయకుల ప్రమేయంలేదన్నారు. ఇటువంటి ఆరోపణలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడవళ్లూరు సర్పంచి మాచర్ల, నాయకులు పోలినేని రమేష్, దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీనివాసులు, నర్రా శివన్నారాయణ, చిట్లాబత్తిన మాచర్ల , కే.నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తూర్పుపాలెంలో సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కొండాపురం, మే22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుపాలెంలో సీతారాముల కల్యాణ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల తిరునాళ్లలో భాగంగా సీతారాముల విగ్రహాలకు విశేషపూజలుచేసి ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దివివారిపాలెంలో 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద 100 ఏంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు గురువారం ఉదయం భూమిపూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు షేక్ అమీన్, నాగరాజు, సుధీర్‌బాబు, శ్రీనివాసులు, రవితేజ, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చదలవాడ కొండయ్య, దివివారిపాలెం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆలయాల భూములకు నేడు వేలం

కావలి,మే22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కలుగోళ్ల శాంభవి, పాతూరు శివాలయం, విష్ణాలయాలకు సంబంధించిన సుమారు 22 ఎకరాల భూములకు శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో రాధాక్రిష్ణ, ఆలయాల ధర్మకర్త క్రిష్ణమోహన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కలుగోళ్లశాంభవి ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నామన్నారు. పాల్గొనదలచిన వారు నిబంధనల మేరకు ముందుగా దరావత్తు చెల్లించాలని చెప్పారు.

తెగిన విద్యుత్ తీగలు తప్పిన ప్రమాదం

కావలి రూరల్, మే22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు డంపింగ్ యార్డు సమీపంలో గురువారం రోడ్డు 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పెద్దశబ్దతో మంటలు వచ్చి తీగలు తెగి రోడ్డుపై పడ్డ సమయంలో అటుగా వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న విద్యుత్ లైన్లు తొలగించి కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వేలంపై వదంతులు నమ్మొద్దు

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామదేవత అంకమ్మ ఆలయ షాపుల వేలంపై వదంతులు నమ్మవద్దని దేవస్థానం అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగే షాపుల బహిరంగ వేలం యథావిధిగా జరుగుందన్నారు. నిబంధనలకు అనుగుణంగా వేలంలో పాల్గొనవచ్చన్నారు.

రేపు కరేడు గ్రామానికి రామచంద్ర యాదవ్ రాక

ఉలవపాడు, మే 22(ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యర్థన మేరకు శనివారం సాయంత్రం కరేడుకు భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ రానున్నారని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండోసోల్ కంపెనీకి గ్రామస్థుల అనుమతి లేకుండా సర్వే చేయించి రైతుల భూములు లాక్కొనేందుకు ప్రభుత్వం సిద్ధ పడటం, దాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నందున గ్రామస్థులకు, రైతులకు మద్దతుగా నిలిచేందుకు ఆయన వస్తున్నట్లు పేర్కొన్నారు.

విట్స్ గోల్డ్ మెడలిస్టులకు అభినందనలు

కావలిటౌన్, మే22(ఆంధ్రజ్యోతి) గోల్డ్ మెడల్స్ సాధించిన విట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులను గురువారం కళాశాలలో అభినందించారు. ఇటీవల అనంతపురం జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో విద్యార్థిని భవిత సీఎస్‌సి ఏఐ విభాగంలో, అభినయ సీఎస్‌సీ ఐవోటి విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ లిఖిత్ రెడ్డి, ప్రిన్సిపాల్ శేషయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ శ్రీనాథ్, సునీల్‌కుమార్ అధ్యాపకులు తదితరులు వారిని అభినందించారు.

గ్రామగ్రామాన హనుమజ్జయంతి

● పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ● వివిధ ప్రాంతాల్లో అన్నదానం


లింగసముద్రం : ఆంజనేయుడి విగ్రహ ఊరేగింపు


బిట్రగుంట : ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


గుడ్లూరులో ఆంజనేయుడి పూజల్లో పాల్గొన్న భక్తులు

కావలి రూరల్, మే22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలు కనుల పండుగలా జరిగాయి. గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌదరిపాలెంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి అన్న సంతర్పణ, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

● గుడ్లూరు, (ఆంధ్రజ్యోతి): గ్రామంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు ఒక్కపొద్దులతో మొ


కందుకూరులో అరటి పండ్లతో ఆంజనేయుడికి అలంకరణ

క్కు చెల్లించుకున్నారు. మిట్టపాలెం వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉత్తర ముఖ ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామ్‌సేవక్ ఆధ్వర్యంలో కాషాయజెండాలతో గుడ్లూరు వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. మెలుకొల్లారు వెళ్లే రహదారిపక్కన ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు ఆకుపూజ నిర్వహించారు. శివాలయం సమీపంలో ఉన్న అంనేయస్వామి విగ్రహం వద్ద సనిశెట్టి గిరిబాబు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మంచినీళ్ల ప్యాకెట్లను అందచేశారు.

● వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భగా స్వామి విగ్రహన్ని సిందూరం తులసి, బంతి, మందారం మాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం విశేష అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. మధ్యాహ్నం గుత్తా కొండయ్య, జయమ్మ, గుత్తా నాగమోహన్, శ్రీలత, గుత్తా చంద్రమోహన్, సునీత,ముండి గ్రామానికి చెందిన తాడిబోయిన చిరంజీవి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు

● కొండాపురం, (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని గురువారం మండలంలోని బీమవరప్పాడు, సాయిపేట, మర్రిగుంట గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆంజనేయుడి విగ్రహాలకు అభిషేకాలుచేసి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయిపేట ఆంజనేయస్వామి విగ్రహంవద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం కందుకూరులో శోభాయాత్ర జరిగింది. విశ్వహిందూ పరిషత్, బజరంగ దళ్, కందుకూరు ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సంఘచాలక్ డాక్టర్ తన్నీరు మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో అంకమ్మ ఆలయం వద్ద ఉన్న బజరంగ్ సెంటర్ నుంచి పట్టణంలోని పలు బజారుల్లో మోటార్ సైకిళ్లపై శోభాయాత్ర కొనసాగింది. యాత్ర మధ్యలో అంబేడ్కర్, పొట్టిశ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. పట్టణంలోని పెద్దబజారు కోదండ రామాలయంలోని ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, చందనాలంకారం, ఆకుపూజ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీరామ శరన్ గరుదేవుల ప్రియ శిష్యులు రామ్నాథ్ బిరుదంకితులు పంగులూరి గోవిందరావు ప్రవచనం చేశారు. అనంతరం పంచామృత ధార పుస్తక ఆవిష్కరణ చేశారు.

● కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి) పట్టణంలో గురువారం హనుమత్ జయంత్యుత్సవాలు వైభవంగా జరిగాయి. ముసునూరు హనుమత్ క్షేత్రం, మద్దూరుపాడు వీరాంజనేయస్వామి ఆలయం, జనతాపేట ఆలయాల్లో ప్రత్యేక పూజలు అన్నదానాలు నిర్వహించారు. మద్దూపాడు ఆలయంలో పెద్దఎత్తున వేడుకలు జరిగాయి. ఉదయం స్వామివారికి పంచామృత సేవలు, అభిషేకాల అనంతరం వడమాల అలంకారంలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పీ శ్రీధర్, గుత్తికొండ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో ఉదయం శాంతి అభిషేకాలు, శాంతి అభిషేక సిందూరార్చన, హోమ పూజలు జరిగాయి. అనంతరం సామూహిక లక్ష సిందూరార్చన పూజలు జరిగాయి. రాత్రి కోలాటాలు, మంగళ వాయిద్యాల మధ్య పల్లకీసేవ, ఆలయ ఉత్సవం కనులపండువగా జరిగాయి.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం మండలంలోని అల్లూరు మారుతీ ఆశ్రమంలో, వేణుగోపాలస్వామి ఆలయంలో, కోనేరు సెంటరులోని అభయాంజనేయస్వామి పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ పాతహరిజనవాడలోని కోదండరామస్వామి ఆలయంలో కొలువై ఉన్న అభయాంజనేయస్వామికి గురువారం పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి సిందూర, ఆకుపూజలు చేశారు. బోగోలు చెన్నకేశవస్వామి, బృందావనంలోని కోదండస్వామి, రాజావీధిలోని షిరిడీ సాయిమందిరం, రైల్వే


కావలి టౌన్ : హనుమత్ క్షేత్రంలో పవనసుతుడికి పల్లకీసేవ


లోకో, ట్రాఫిక్ రామాలయాల్లోనూ హనుమజ్జయంతి కార్యక్రమాలు జరిగాయి. ఎస్‌జీవీకండ్రికలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

● కలిగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిర్రావారిపాలెం తిప్ప, కమ్మవారిపాలెం, కుమ్మరకొండూరు, కలిగిరిలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కలిగిరిలోని బాలాంజనేయుడికి చందనంతో శ్రీరామ అని వ్రాసిన తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిగిలిన ఆలయాలవద్ద స్వామి వారికి అభిషేకాలు జరిగాయి.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలోని బలిజపాలెంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామి వారికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.సాయంత్రం 4 గంటలకు ఆంజనేయస్వామి విగ్రహానికి శోభాయాత్ర నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కావలి : ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


వలేటివారిపాలెం : ప్రసన్నాంజనేయుడి ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు


కలిగిరి : ప్రత్యేకాలంకరణలో ఆంజనేయుడు

పాత చెరువు అలుగులో ప్లాస్టిక్ వ్యర్థాలు

● కమ్మేసిన చిల్లచెట్లు

లింగసముద్రం, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని పాత చెరువు దక్షిణ వైపున ఉన్న అలుగు చిల్లచెట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయింది. గ్రామంలోని హోటళ్లు, ఇతర దుకాణాల వారు ప్లాస్టిక్, వ్యర్థాలను అలుగులో పడేస్తున్నారు.దీంతో దుర్వాసన వస్తోంది.దీనికితోడు గత ఆరేళ్ల నుంచి తీవ్ర వర్షభావ పరిస్థితుల కారణంగా చెరువులోకి నీరు చేరలేదు. ఈ అలుగు పక్కనే ఉన్న కాలనీవాసులు కూడా మురుగు నీటిని అలుగులోకే వదులుతున్నారు. అయితే ఈ అలుగుపై వేసిన చప్టా ద్వారానే తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెంతోపాటు పలు గ్రామాల ప్రజలు నిత్యావసర వస్తువులకోసం, ప్రభుత్వ కార్యాలయాలకు లింగసముద్రానికి వచ్చి వెళుతుంటారు.వ్యవసాయ సీజన్‌లో పనుల కోసం రైతులు, రైతుకూలీలు పొలాలకు వెళుతుంటారు. దుర్వాసనతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాలు, చిల్లచెట్లతో నిండిన లింగసముద్రం పాత చెరువు అలుగు

బోగస్ మస్టర్లపై ప్రత్యేక దృష్టి

● దయాసాగర్, ఉపాధి పథకం ఏపీవో



వలేటివారిపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని ఏపీవో దయాసగర్ తెలిపారు. పనుల వద్దకు వెళ్లి మస్టర్లను పరిశీలిస్తున్నామని, స్వయంగా మస్టర్లు వేసి కూలీలతో మాట్లాడుతున్నామని ఆయన వివరించారు.

? : పనుల వద్ద కూలీలలకు ఏయే వసతులు కల్పిస్తున్నారు.

! : ఉపాధి పనుల వద్ద కూలీలకు టెంట్, మంచినీరు, మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పిస్తున్నాం. కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనిచేసేలా చర్యలు చేపడుతున్నాం.

? : మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి.

! : మండలంలో 10932 జాబ్ కార్డులు ఉం డగా, 18539 మంది కూలీలు పనిచేస్తున్నారు.

? : రోజుకు ఎంత మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు ?

! : ప్రతి రోజూ 5 వేల నుంచి 5500 మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు.

బుడంగుంట కాలనీలో పారిశుధ్యం అధ్వానం

కావలి, మే22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా పారిశుధ్య నిర్వహణకు మున్సిపల్ అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నా కాలనీలవైపు మాత్రం చిన్న చూపు చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బుడంగుంట కాలనీలో పారిశుధ్య నిర్వహణను పట్టించుకోవటం లేదని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. పట్టణానికి శివారులో ఉన్న ఆ కాలనీకి అసలే విషపురుగుల సంచారంతో భయపడుతుండగా, దానికి తోడు అక్కడ రోడ్ల వెంబడి ఉన్న చెట్లను తొలగించడంలేదు. దీంతో రోడ్ల వెంబడి చెట్లుపెరిగి మూసుకుపోవటమేకాక వాటివల్ల విషపురుగులు తిరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే డ్రైనేజీ కాలువలు నిర్మించినా వాటిలో చెత్తాచెదా రం తొలగించడంలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి బుడంగుంట కాలనీలో పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కంప, పిచ్చి చెట్లతో మూసుకుపోతున్న రోడ్డు


చెత్తాచెదారంలో నిండిన డ్రైనేజీ కాలువ

రూ.3.26 కోట్లతో ఇంటింటికి కుళాయి


అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతీ ఇంటికి కుళాయిని ఏర్పాటు చేసేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ3.26 కోట్లు మంజూరయ్యాయని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలోని చెర్లోసంఘం వద్ద సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని గురువారం ఆయన పునఃప్రారంభించారు. దాదాపు రూ40 లక్షల నిధులతో మరమ్మతులు చేసిన మిషనరీని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొంతమంది స్వార్ధ రాజకీయ నాయులు అందలాన్ని ఎక్కాలనే ఆలోచనతో నగర పంచాయతీని తీసుకొచ్చి అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. త్వరలో అల్లూరును గ్రామ పంచాయతీగా మార్పు చేసేందుకు ఆర్డినెన్స్ వస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారత ఒక్క చంద్రబాబునాయుడుతోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే అన్నారు. బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, నాయకులు పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి అమర్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై నాలుగు గడ్డివాములు దగ్ధమైన సంఘటనలో బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం చేశారు. సింగపేట మజరా గ్రామమైన మూర్తిరాజపురంలో బాధితులతో మాట్లాడి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● టీడీపీ ఆధ్వర్యంలో కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే అన్నారు. గురువారం రాత్రి ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త పార్టీకి కీలకమని, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రేబాల శంకర్‌రెడ్డి, కృష్ణచైతన్య, రత్తయ్య, ఆట తిరుమల, ఊటు శ్రీకాంత్, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజేఐని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నేతలు

కావలి, మే22(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) ఎస్‌ఆర్ గవాయ్‌ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణకు వినతి పత్రం అందచేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ముంబాయి న్యాయవాదుల సంఘం సన్మాన కార్యక్రమంలో సీజేఐకి తగిన ప్రొటోకాల్ పాటించకుండా అవమాన పరిచారన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, సురేష్, ఆదెయ్య, తిరుపతి, జెడ్డా వాసు, సమితి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జలదంకిలో తిరంగా ర్యాలీ


జలదంకిలో నిర్వహించిన తిరంగా ర్యాలీ

జలదంకి, మే22(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని విజయం సాధించిన త్రివిధ దళాలకు మద్దతుగా గురువారం రాత్రి జలదంకిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజలు తివర్ణపతాకాలను చేతబూని భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. జలదంకి ఆర్టీసీ బస్టాండ్ కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు యాత్ర కొనసాగింది. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి వక్తల ప్రసంగాలు సాగాయి. ఈ యాత్రలో అన్ని రాజకీయపార్టీల నేతలతో పాటుగా ఎస్‌ఐ సయ్యద్ లతీఫున్నీసా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

25న ప్రతిభ పురస్కారాలు

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందచేయనున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, విశ్వబ్రాహ్మణ విద్యాభివృద్ధి కమిటీ కన్వీనర్ అద్దంకి వెంకట అజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న దర్శిలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో అవార్డుల ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ కుందుర్తి గురవాచారి, విద్యావేత్తలు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దు తగదు : బుర్రా

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాల రద్దు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ అన్నారు. గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకర్ల తో మాట్లాడారు. పేదల సంక్షేమాన్ని అడ్డుకునే ఉద్దేశ్యంతోనే రేషన్ సరఫరా వాహనాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇంటి వద్దనే రేషన్ బియ్యం సరఫరా కొనసాగించాలని, లేదంటే ఉపాధి కోల్పోయి రాష్ట్రవ్యాప్తంగా 10,000 ఎండీయూ వాహనదారులు రోడ్డున పడతారన్నారు. అంతేకాకుండా రేషనలైజేషన్ పేరుతో సచివాలయం వ్యవస్థను నిర్వీర్యం చేయాలని చూస్తుందని కూటమి ప్రభుత్వంపై ఆయన ఆరోపణలు చేశారు.

పండ్ల, పూలతోటల పెంపకంపై సమావేశాలు

కలిగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆసక్తిగల రైతులకు పండ్ల, పూలతోటల పెంపకం, పొలంలో అభివృద్ధి పనులకు సంబధించి ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రత్యూష పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం, కావలిముస్తాపురం, వెలగపాడు, తూర్పుగుడ్లదొన, పడమరగుడ్లదొన, 24న ఎరుకల రెడ్డిపాలెం, 27న లక్ష్మీపురం, సిద్దనకొండూరు,పరికోట, 29న కుమ్మరకొండూరు, క్రాకుటూరు, 30న పెదకొండూరు, పోలంపాడు, 31న రావులకొల్లు, ఏపినాపి, జూన్3న చిన అన్నలూరు, తూర్పుదూబగుంట, 5న కృష్ణారెడ్డిపాలెం, 6న గంగిరెడ్డిపాలెం, తెల్లపాడు, 7న నాగసముద్రం, వీరనకొల్లు, జూన్10న కలిగిరి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు సన్న,చిన్నకారు రైతులు ఆధార్‌కార్డు, జాబ్‌కార్డ్, 1బి, అడంగల్‌కాపీలతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

ఆకట్టుకున్న హనుమాన్ శోభాయాత్ర



బుచ్చిలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర

హనుమజ్జయంతి సందర్భంగా గురువారం బుచ్చిలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర ఆకట్టుకుంది. వేలాదిమంది జైశ్రీరామ్.. జైజై శ్రీరామ్.. జై హనుమాన్.. జై బజరంగభళి...అంటూ నినాదాలు చేస్తుండగా యాత్ర సాగింది. ముందుగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. స్థానిక డీఎల్ఎన్ఆర్ హైస్కూలు ప్రాంగణం నుంచి మొదలయిన యాత్ర బస్టాండ్ సెంటర్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్ వరకు సాగింది. ర్యాలీకి ముందు శ్రీరాముడు, అంజనేయుడితోపాటు వివిధ వేషధారణలు, గుర్రాలు, బైకులు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ, పలువురు కౌన్సిలర్లు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, మండల పార్టీ నాయకులు గుత్తా శ్రీనివాసులు, బెజవాడ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

-బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి

సైనిక్ స్కూల్ ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం

- రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ - 2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతోపాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకుగాను ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి. మోక్షిత్ మొత్తం 400 మార్కులకు గాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వీరితోపాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.



ఆలయ ఈవోకి నగదును అందచేస్తున్న రాజు ప్రభాకర్‌రెడ్డి దంపతులు

నిత్యాన్నదానానికి విరాళం

రాపూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన శ్రీవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప జిల్లా మాధవరం గ్రామస్థులు రాజు ప్రభాకర్ రెడ్డి, రెడ్డెమ్మ దంపతులు రూ. 2,05,121 ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందచేశారు. వీరికి ఆలయ అధికారులు వేద పండితులతో వేదాశీర్వచనం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

ఉపాధ్యాయ బదిలీల

ప్రక్రియ ప్రారంభం

- 8, 5 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి తప్పనిసరి
- జిల్లాలో 3వేల మందికిపైగా స్థానచలనం

నెల్లూరు(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. 8 ఏళ్లు, 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరి బదిలీలు జరగనున్నాయి. ఒకే పాఠశాలలో రెండేళ్లు పూర్తి చేసుకున్న వారూ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ బదిలీలు, ఉద్యోగోన్నతులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా జరగనుండగా ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లో 278 మంది, జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 9,483 మంది, మునిసిపల్ విభాగంలో 183 మంది, నగరపాలక సంస్థలో 411 మంది కలిపి మొత్తం 10,355 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో ఐదేళ్లు పూర్తి చేసిన హెచ్‌ఎంలో 45 మంది, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న స్కూల్ అసిస్టెంట్‌లు 774 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 572 మంది ఉన్నారు. మొత్తం 2,821 మందికి తప్పనిసరి బదిలీలు జరగనుండగా వీరితో పాటు రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారితో కలిపి 3వేల మందికి పైగా స్థానచలనం కలగనుంది. ఉద్యోగ విరమణకు సమీపంలో ఉన్న ఉపాధ్యాయులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు.



తొలుత ప్రధానోపాధ్యాయులకు..

తొలుత గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు ప్రక్రియ పూర్తికాగా ఈ నెల 24వతేదీన సీనియారిటీ జాబితాను ప్రకటిస్తారు. 25న జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించి 26న పరిష్కరిస్తారు. 27న దరఖాస్తు చేసిన హెచ్‌ఎంల తుది సీనియారిటీ జాబితాను విడుదల చేసి 28వతేదీన ఆన్‌లైన్‌లో తాము కోరుకునే స్థానాలకు ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్‌లు ఎంచుకుంటారు. 30న బదిలీ ఉత్తర్వులు అందచేస్తారు. అదే రోజున స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. వీరికి 31వ తేదీన నియామక ఉత్తర్వులు అందచేస్తారు.

ప్రాధాన్యత కేటగిరీలో..

వందశాతం దృష్టిలోపం ఉన్నవారికి, 80శాతంకు పైగా శారీరక వైకల్యం ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అలాగే 75శాతం దృష్టిలోపం, 70-79 శాతం శారీరక వైకల్యం, 70శాతానికి పైగా వినికిడి లోపం ఉన్నవారికి రెండో ప్రాధాన్యత ఇస్తారు. పునర్వివాహం చేసుకోని వితంతువులు, క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోనోటీసీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, సైనల్ సర్జరీ చేసుకున్నవారికి, జీవిత భాగస్వామి, పిల్లలు జునైనల్, డయాబెటిస్, తలసేమియా, హీమోఫిలియా, కండరాల క్షీణతతో బాధపడుతన్న వారికి వైద్య చికిత్స పొందుతున్న వారికి తరువాత ప్రాధాన్యతలు కింద బదిలీలు జరగనున్నాయి.

1289 మంది ఎస్‌ఏలకు తప్పనిసరి

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్‌లు 1289 మంది 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవడంతో వీరు తప్పనిసరి బదిలీ కానున్నారు. ఎస్‌ఏలకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కాగా ఈనెల 24వరకు దరఖాస్తులు చేసుకోవాలి. 26, 27వతేదీల్లో ప్రాథమిక సీనియారిటీ జాబితాను సబ్జెక్టుల వారీగా విడుదల చేస్తారు. 28న జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి 29వతేదీ వరకు పరిశీలించి పరిష్కరిస్తారు. 31న సీనియారిటీ తుది జాబితాను సబ్జెక్టుల వారీగా ప్రకటిస్తారు. జూన్ 1, 2 తేదీల్లో బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం 4వతేదీన బదిలీ ఉత్తర్వులు అందచేస్తారు. 5న అర్హులైన ఎస్‌జీటీలకు ఎస్‌ఏలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. 6న నియామక ఉత్తర్వులు అందచేస్తారు.

1487 మంది ఎస్‌జీటీలు తప్పనిసరి

జిల్లాలో 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 1487 మంది ఎస్‌జీటీలు తప్పనిసరి బదిలీ కానున్నారు. వీరు ఈ నెల 28వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను 28వతేదీ వరకు పరిశీలిస్తారు. 31వతేదీన ప్రాథమిక సీనియారిటీ జాబితాను విడుదల చేస్తారు. వీటిపై జూన్ 1వతేదీ సాయంత్రం వరకు అభ్యంతరాలను స్వీకరించి 2వతేదీ వరకు పరిశీలన చేస్తారు. అనంతరం జూన్ 6న తుది సీనియారిటీ జాబితాను విడుదల చేసి 7 నుంచి 10వతేదీ వరకు ఎస్‌జీటీలు కోరుకున్న స్థానాలకు వెబ్ ఆప్షన్‌లకు ప్రాధాన్యత క్రమంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. జూన్ 11న బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తారు. బదిలీలు, ఉద్యోగోన్నతలకు సంబంధించి పాయింట్లు, ప్రాధాన్యత కేటగిరీలను కూడా విడుదల చేశారు.

చిన్నారులకు ఎంఆర్ వాక్సిన్ వేయాలి

- మూడు విడతలుగా అమలు చేయండి
- టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికి ఎంఆర్(మీజిల్స్, రూబెల్లా) వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఎంఆర్ వాక్సినేషన్‌పై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తట్టు, పొంగు వ్యాధుల నివారణకు టీకాలు వేసుకోని చిన్నారులను గుర్తించి ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. తట్టు, పొంగు వ్యాధులు నమోదైన ప్రాంతాల్లో ముమ్మరంగా సర్వేచేసి నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మూడు విడతల్లో ఎంఆర్ వాక్సిన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు మొదటి విడత వాక్సిన్ వేయాలన్నారు. జూన్ 23 నుంచి 28వ తేదీ వరకు రెండవ విడత, జూలై 21 నుంచి 26వ తేదీ వరకు మూడవ విడత ఎంఆర్ వాక్సిన్ పంపిణీని అమలు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలు, మురికివాడలు, ఇటుక బట్టీలు, భవన నిర్మాణ కార్మికుల నివాస ప్రాంతాలు, మత్స్యకార గ్రామాలను లక్ష్యంగా చేసుకుని చిన్నారుల వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీహెచ్ఎస్ పరిమళ, మెప్మా పీడీ లీలారాణి, ఐటీడీఏ పీవో మల్లికార్జున, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, డాక్టర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

'బెల్టు' కావాలంటే

వేలం పాడాల్సిందే !

- నిన్న అయ్యవారిపల్లె ... మొన్న అంకభూపాలపురం
- రేపు ఏ గ్రామమో మరి...!
- పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు
- సీఎం చంద్రబాబు హెచ్చరికలు బేఖాతర్
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

వలేటివారిపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లెలో మద్యం బెల్టుషాపు నిర్వహణకు గ్రామస్థులు బుధవారం బహిరంగ వేలం పెట్టారు. గ్రామానికి చెందిన వీరయ్య అనే వ్యక్తి రూ.10 లక్షలకు వేలం పాడారు. ముందురోజు గ్రామంలో దండోరా వేసి వేలం పెట్టారు. ఈ వేలంలో 10 మంది పాటదారులు డిపాజిట్లు చెల్లించి పాల్గొన్నారు. ఐదారుగురు పాటదారులు తగ్గేదెలా అన్నట్లుగా పోటాపోటీగా పాట పాడారు. చివరికి వీరయ్య రూ.10 లక్షలకు పాట దక్కించుకున్నాడు. రెండునెలల క్రితం అంకభూపాలపురంలో కూడా బెల్టు షాపు వేలం పెట్టగా రూ .1.50 లక్షలకు సత్యనారాయణ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. మొన్న అంకభూపాలపురం, నిన్న అయ్యవారిపల్లె, రేపు ఏ గ్రామమోమరి... అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

- పరిస్థితి ఇలా ఉంటే...



పరిస్థితి ఇలాగే ఉంటే గ్రామ గ్రామాన బెల్టుషాపు లకు వేలం నిర్వ హించే అవ కాశాలు ఉన్నాయని ప్రజలంటున్నారు. గ్రామపెద్దల సమ క్షంలో వేలం దక్కించుకున్న వ్యక్తి తప్ప ఇంక ఎవరూ బెల్టుషాపు నిర్వ హించకూడదని నిర్ణయించారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులకు తెలిసీ కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం మారినా ఎక్సైజ్ అధికారుల తీరు మాత్రం మార లేదు. 'బెల్టుషాపులు పెడితే తాట తీస్తా.... ఫైన్ కాదు ఏకంగా మూసివేయడమే'.. అంటూ సీఎం చంద్రబాబు చేస్తున్న హెచ్చరికలను ఎక్సైజ్ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. అధికారుల నిఘా కొరవడడంతో వేలం పాటలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి కైనా వారు స్పందించి బెల్టుషాపులు వేలంపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటా

అయ్యవారిపల్లెలో బెల్టుషాపు కోసం వేలం పెట్టిన సంగతి మా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకుంటా. వీటిపై ఇక నిఘా పెడతాం.

- వెంకట్రావు, ఎక్సైజ్ సీఐ

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక ఐదు నెలల క్రితం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. నీటి పారుదలశాఖ, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఈ ఎన్నికలను అట్టహాసంగా నిర్వహించారు. విజేతలకు అక్కడికక్కడే ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. అయితే, ఇప్పటికి ఐదు నెలలు దాటినా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఈ గెజిట్ విడుదల చేస్తేనే ఎంపికైనవారికి పూర్తి అధికారాలు లభిస్తాయి.

- సంగం (ఆంధ్రజ్యోతి)

గజిట్ నోటిఫికేషన్

ఇచ్చేదెప్పుడు!?

జిల్లాలో 765 సాగునీటి సంఘాలు ఉండగా, 2024, డిసెంబరు 14న ఎన్నికలు జరిగాయి. కొన్నింటికి పోటీలు జరగ్గా, మరికొన్నింటికి ఏకగ్రీవం అయ్యాయి. గెలుపొందిన వారికి ఎన్నికలు నిర్వహించిన అధికారులు ఫామ్ -10 కాపీలను అందించారు. ఎన్నికలు జరిగిన 15 నుంచి 30 రోజుల్లోపు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. కానీ ఐదు నెలలు దాటినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో సాగునీటి సంఘాలకు ఎన్నికైన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెజిట్ నోటిఫికేషన్‌లో ఎంపికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యుల పేర్లతో కూడిన జాబితా ఉంటుంది. సంఘం పదవీకాలం ఎంత వరకు తదితర వివరాలూ ఉంటాయి. ఈ గెజిట్ నోటిఫికేషన్ వస్తేనే సాగునీటి సంఘాలకు పూర్తి అధికారం వచ్చినట్లవుతుంది.



సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన వారికి ధ్రువ పత్రం ఇస్తున్న అధికారులు (ఫైల్)

- సంఘాల బాధ్యతలు..

చెరువులకు, డిస్ట్రిబ్యూషన్ కాలువలకు అత్యవసర పనులు చేపట్టడం. గండ్లు పడినా, కాలువలు దెబ్బతిన్నా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి మరమ్మతులు చేపట్టడం, ఆయకట్టు పరిధిలోని రైతులకు వంతులవారీగా నీటిని సరఫరా చేయ డం, నీటి తీరువా పన్ను వసూలు చేయించి ప్రభుత్వానికి కట్టడం, చెరువుల్లో చేపలు వేలం వేయించి వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ పద్దుల్లో జమ చేయించడం వంటి పనులు సంఘాల పాలకవర్గం చేయాల్సి ఉంటుంది.

మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువకుడు గురువారం ఉదయం గొంతు కోసుకున్నాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కస్తూరిదేవి స్కూలు ఎదురు వీధిలో ఓ యువకుడు కత్తితో గొంతుకోసుకొని అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గమనించిన స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటా హుటిన అక్కడికి చేరుకుని ఆ యువకుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మార్గ మధ్యలో తాను ప్రకాశం జిల్లా తుళ్లూరుకు చెందిన వాడినని, తన పేరు దాసు అని, బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, తిరుపతి నుంచి వస్తున్నానని పోలీసులకు తెలిపాడు. గొంతు ఎందుకు కోసుకున్నావని అడగ్గా సమాధానం చెప్పలేదు. జీజీహెచ్‌లో చేర్పించిన పోలీసులు సాయంత్రం యువకుడిని విచారించేందుకు వెళ్లగా అప్పటికే అతను డిశ్చార్జ్ అయి వెళ్లిపోయాడని వైద్యసిబ్బంది తెలిపారు. అతని కోసం గాలిస్తున్నామని దర్గామిట్ట పోలీసులు తెలిపారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై ఒకరి మృతి

నెల్లూరు (క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లోని రెండవ నెంబరు ప్లాట్‌ఫాం పై గుర్తుతెలియని వ్యక్తి గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 55 నుంచి 60 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహంపై స్కైబ్లూ, పసుపు చెక్స్ ఫుల్ హాండ్స్ షర్ట్, బులుగు గళ్ళ లుంగీ ఉన్నాయి. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ఎస్ఐ ఎన్ హరిచందన తెలిపారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలకు ఆగస్టు 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు అడుగులు వేస్తోంది. అదే జరిగితే ఉచిత ప్రయాణం కావడంతో ఆర్టీసీ బస్సులు మహిళలతో నిండుతాయి. దీంతో సంస్థకు ఓఆర్ భారీగా పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలకు సంబంధించిన నగదును ఆర్టీసీ సంస్థకు చెల్లించడంతో ఆర్టీసీ సంస్థ పూర్వవైభవం పొందేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయి.

'ఉచితం'

ఊపిరి పోసేనా?

- ఆర్టీసీకి పూర్వవైభవం వచ్చేనా?
- భారీగా పడిపోయిన ఓఆర్
- వేసవి సెలవుల్లోనూ పెరగని ప్రయాణికుల సంఖ్య
- రైళ్లు, ప్రైవేటు బస్సులు, కార్ల వైపు మొగ్గు
- నెల్లూరు రీజియన్‌లో నిత్యం 1.50లక్షల మంది ప్రయాణం
- వారిలో సగం మహిళలే...!
- ఉచిత ప్రయాణంతో మరింత పెరిగే అవకాశం
- పథకానికి ప్రభుత్వం నిధుల చెల్లింపు
- సంస్థ పునరుజ్జీవానికి ఆశలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 22 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ప్రయాణం అంటే గుర్తుకు వచ్చే ఎర్ర బస్సే. అయితే రోజులు గడిచే కొద్దీ ఆటోలు, ప్రైవేటు బస్సుల సంఖ్య భారీగా పెరిగిపోవడం, ప్రజలు సొంత వాహనాలు కొనుగోలు చేయడం, రైలు ప్రయాణం మరింత సౌకర్యంగా ఉండటంతో ఆర్టీసీ ఆదాయం తగ్గుతూ వచ్చింది. దీనికితోడు డీజిల్ భారం, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లోని సౌకర్యాలు, వేగంతో పోటీ పడలేక ఆర్టీసీ మరింత వెనుకబడింది. మిగతా రోజుల్లో ఎలా ఉన్నా ఏటా దసరా, సంక్రాంతి, వేసవి సెలవుల్లో మాత్రం ఆర్టీసీకి ప్రయాణికుల ఆదరణ బాగానే ఉండేది. కానీ, ఈ ఏడాది వేసవి సెలవల్లో సైతం ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు 75 శాతం కూడా ఓఆర్ రాకపోవడంతో అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని చేస్తున్న ప్రకటనలు రోడ్డు రవాణా సంస్థకు కొత్త ఊపిరిని అందించనున్నాయి.

ఉచిత ప్రయాణం ఊపిరి పోసేనా

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ పథకం ఆర్టీసీకి ఊపిరి పోస్తుందని సంస్థ అధికారులు, కార్మికులు ఆశపడుతున్నారు. ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో రోజూ లక్ష యాభైవేల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. తద్వారా రోజుకు రూ.93 లక్షల రాబడి వస్తోంది. ఈ ప్రయాణికుల్లో సగం మంది మహిళలు ఉంటున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం అందించడంతో రీజియన్‌లో రోజు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య లక్షకుపైగా పెరగవచ్చని అంచనా. ప్రస్తుతం తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం అందిస్తున్న ఆయా ప్రభుత్వాలు అందుకు సంబంధించిన నిధులను రోడ్డు రవాణా సంస్థలకు మూడు నెలలకో, వార్షిక బడ్జెట్‌లోనే కేటాయిస్తున్నాయి. ఈ విధానంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి మహిళల ఉచిత ప్రయాణా నికి సంబధించిన నగదును చెల్లించే అవకాశం ఉంది. దీంతో సంస్థకు సాధారణంగా వచ్చే రాబడితోపాటు, మహిళ ప్రయాణికులు పెరగడంతో ప్రభుత్వం నుంచి వచ్చే నగదును కలుపుకుంటే ఆర్టీసీ సంస్థ లాభాల బాట పడు తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



బస్సులు పెంచాలి, సిబ్బందినీ పెంచాలి

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అంటే బస్సుల సంఖ్యను తప్పనిసరిగా పెంచాల్సి వస్తుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. రీజియన్ వ్యాప్తంగా ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో 137 కొత్త బస్సులను ప్రభుత్వం అందించింది. అయితే గత ప్రభుత్వంలో రీజియన్‌కు కొత్త బస్సులు రాకపోవంతో కాలం చెల్లిన బస్సుల సంఖ్య పెరిగి పోయింది. వాటి స్థానంలో కొత్త బస్సులను అధికారులు తిప్పుతున్నారు. ఈ క్రమంలో మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లోకి వస్తే రీజియన్‌కు కొత్త బస్సులు మరిన్ని అవసరమ వుతాయి. ఇక ప్రస్తుతం రీజియన్‌లో ఎక్కువగా ఉన్న సింగల్ డ్రైవర్ టిమ్ సర్వీసు లను రద్దు చేయాల్సి ఉంటుంది. పాత విధానంలో బస్సుల్లో డ్రైవర్, కండక్టర్ ఇద్దరు ఉంటేనే బస్సుల్లో మహిళలు ఎంత మంది ఎక్కారు, పురుషులు ఎందరు, రాయితీ పాస్‌లు, ఇలా అన్నీ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుంది.

వెంగళాపురం ఆలయంలో చోరీ

- అమ్మవారి తాళిబొట్లు, రూ.15 వేల నగదు అపహరణ

లింగసముద్రం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళాపురంలో ఉన్న శ్రీకోదండ రామాలయంలో దొంగలు పడ్డారు. గురువారం ఆలయం తలుపు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గ్రామస్థులు గమనించి లోపలికి వెళ్లి చూశారు. సీతాదేవి ఉత్సవ విగ్రహానికి, అమ్మవారి మరో విగ్రహానికి ఉన్న రెండు బంగారు తాళిబొట్లను దొంగిలించారు. అలాగే హుండీని గ్రామానికి దూరంగా తీసుకెళ్లి పగులగొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు.రెండు తాళిబొట్ల విలువ సుమారు రూ.35 వేలు, హుండీలోని నగదు సుమారు రూ.15 వేలు ఉండవచ్చని గ్రామస్థులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి దొంగలు ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చని వారు భావిస్తున్నారు.అయితే ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.29,500 స్వాధీనం

కందుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కనిగిరి రహదారి పక్కన ఉన్న హనుమాన్ లాడ్జిపై పట్టణ ఎస్సై సాంబశివయ్య గురువారం తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. లాడ్జిలో పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.29,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లాడ్జిలో పేకాట ఆడుతున్నారని తనకు అందిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన చెప్పారు.